పరిష్కరించాల్సినవి చాలా...

జిల్లాలో పాత కేసుల దర్యాప్తులో జాప్యం జరగడం, గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు బనాయించిన వారు తమ పరిస్థితి ఏమిటి అనేది ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. భూ వివాదాలలో కూరుకుపోయిన బాధితులు సిట్ ఏర్పాటుతో సాంత్వన లభిస్తుందని ఆశపడితే అది నిరాశగానే మిగిలిన విషయం తెలిసిందే. అలాంటి వారికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో అక్రమంగా కేసులు బనాయించి కక్షపూరితంగా రౌడీషీట్లు తెరవడంపై విమర్శలు వచ్చాయి. ఇలాంటి వాటిపై దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్పీ దూకుడు

- నిన్న తర్లుపాడు ఎస్సై వీఆర్‌కు
- మొన్న త్రిపురాంతకం సీఐ, కురిచేడు ఎస్‌ఐ కూడా..
- ఆకతాయిలు, మృగాళ్లకు ముకుతాడు
- సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న దామోదర్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ ఏఆర్ దామోదర్ పాలనాపర విధానాల్లో దూకుడు పెంచారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై వేటు వేసేందుకు వెనుకాడటం లేదు. అదేసమయంలో రౌడీయిజం చేసేవారికి తన పోలీసు మార్కు ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. కేసుల నమోదు విషయంలో జాప్యం చేసిన వారిపైనా చర్యలు చేపట్టారు. త్రిపురాంతకం సీఐ, కురిచేడు ఎస్సైలను మొన్న వీఆర్‌కు పిలిపించారు. నిన్న విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తర్లుపాడు ఎస్‌ఐని వీఆర్‌కు పిలిపించి ఏఆర్‌కు అటాచ్ చేశారు. అదేసమయంలో సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అలాగే ఒంగోలు నగరంలో రౌడీయిజం చేస్తున్న వారిపైనా దృష్టిపెట్టారు.



- సిట్ దర్యాప్తు కోసం ఎదురుచూపులు
- కొన్ని చిక్కుముడి వీడని పాత కేసులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 8 : పాలనాపరంగా ఎస్పీ దామోదర్ దూకుడు పెంచారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై వేటు వేసేందుకు వెనుకడుగు వేయడం లేదు. బుధవారం సెట్ కాన్ఫరెన్స్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తర్లుపాడు ఎస్‌ఐని ఆగమేఘాల మీద వీఆర్‌కు పిలిచి ఏఆర్‌కు అటాచ్‌మెంట్ ఇచ్చారు. అదేవిధంగా కేసులు నమోదు విషయంలో జాప్యం చేసినందుకు కురిచేడు ఎస్‌ఐ, పర్యవేక్షణలోపం ఉందని త్రిపురాంతకం సీఐలను వీఆర్‌కు పిలిచారు. కురిచేడు పొలాలలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించిన వారి గురించి మీడియాలో వచ్చినప్పటికీ పోలీసు అధికారుల నుంచి స్పందన లేదని, అక్కడ పనిచేస్తున్న స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సరైన సమాచారం సేకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు వచ్చి చెప్పినా పట్టించుకోలేదని తెలిసింది. ఆ నేపథ్యంలోనే ఎస్సై, సీఐలపై చర్యలు తీసుకున్నారు. ఇలా అధికారుల నిర్లక్ష్యంపై అత్యంత వేగంగా ఎస్పీ చర్యలు తీసుకోవడంతో శాఖ ఉలికిపాటుకు గురైంది.



బాధితులతో నేరుగా మాట్లాడుతున్న ఎస్పీ

పెండింగ్‌లో అనేక కేసులు

పాత కేసులు అనేకం పోలీసు స్టేషన్‌లో పెండింగ్ ఉన్నాయి. అక్రమంగా కేసులు బనాయించి రౌడీషీట్లు తెరిచిన సందర్భాలు ఉన్నాయి. ఒంగోలులో ఎన్నికలకు సంబంధించి రెండు కేసులలో 150 మందిపై రౌడీషీట్లు తెరిచిన చరిత్ర ఉంది. అమాయికులపై రౌడీషీట్లు తెరవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికీ దర్యాప్తు ముందుకు సాగని హత్య కేసులు ఉన్నాయి. ఒంగోలులో బాతుల కాపరి పక్కలో నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారి అదృశ్యం ఇప్పటికి కొలిక్కి రాలేదు. కరవదిలో వృద్ధురాలను హత్య చేసి బంగారం అపహరించిన కేసు అలాగే ఉంది. పేర్నమిట జీవన్ హత్య కేసులో ఎలాంటి పురోగతి లేదు. ఒంగోలులో జరిగిన అనేక దొంగతనాలు ఇంతవరకు రికవరీ కాలేదు. ఇలా పాత కేసులలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఇలాంటి కేసులలో దర్యాప్తు వేగవతం చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పోకిరీలు, ఆకతాయిల కట్టడిపై ప్రత్యేక దృష్టి

ఆకతాయిలు, పోకిరీలపై ప్రధానంగా దృష్టిపెట్టిన ఎస్పీ తనదైన శైలిలో బుద్ధి చెబుతున్నారు. ఒంగోలులో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలపై ఆయన స్పందించిన తీరు నగర ప్రజలకు సాంత్వన కలిగించింది. మహిళా పోలీసుస్టేషన్ తనిఖీకి ఎస్పీ వెళ్లిన సమయంలో అక్కడ ఓ బాలిక తల్లి ఆవేదనను వినిపించింది. తమ కుమార్తె పెంపుడు కుక్కను బయటకు తీసుకెళుతుండగా, ఆకతాయి బైక్‌పై వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. ఇదేమిటి అని ప్రశ్నించిన తన భర్తపై దాడి చేశారని మొరపెట్టుకుంది. దీంతో స్పందించిన ఎస్పీ ఆకతాయిపై కేసు నమోదు చేయడమే కాకుండా కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు. రౌడీషీట్ తెరవాలని ఆదేశించారు. అదేక్రమంలో స్థానిక ఎన్‌జీవో కాలనీలో నూడిల్స్ కోసం వెళుతున్న బాలిక పట్ల ఇరువురు యువకులు అసభ్యంగా ప్రవర్తించడం పట్ల ఎస్పీ తీవ్రంగా స్పందించారు. స్వయంగా ఘటన స్థలానికి వెళ్లి ఆ ప్రాంతవాసులకు భరోసా కల్పించి, ఇరువురు పోకిరీలకు తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలు, చిన్నపిల్లలను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు.

కేసుల దర్యాప్తులో సిట్ జాప్యం

జిల్లాలో గత ప్రభుత్వంలో భూదందాలు విచ్చలవిడిగా జరిగాయి. అప్పటి ఎస్పీ మలికగర్గ్ భూదందాలపై సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు. ఆ కేసులలో పురోగతి కనిపించలేదు. అంతేకాకుండా దందాలకు మూలకారణమైన వారిపై కేసులు నమోదు చేయడం కానీ, ఒకవేళ చేసినా కనీసం విచారించిన పాపాన పోలేదు. కేవలం జిరాక్స్ తీసినవారు, డాక్యుమెంట్‌లు తయారుచేసిన వారు, సాక్షి సంతకం పెట్టిన వారిని అరెస్టు చేశారు. అసలు ఆ భూస్కాంల వలన ఎవరు లబ్ధిపొందారు అనే విషయంలో పోలీసులు ఉదాసీనత ప్రదర్శించారు. వందల ఎకరాలకు నకిలీపత్రాలు సృష్టించిన వారిని తెలిసీ వదిలివేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అండతో దందాలు చేసి కోట్లు కొల్లగొట్టిన వారి జోలికి వెళ్లలేదు. పైగా సిట్ ఏర్పాటు పోలీసు అధికారులకు సిరులు పంట కురిపించిందనే ఆరోపణలు వచ్చాయి. తెలియక భూములు కొని మోసపోయిన అమాయకులనే పోలీసులు మళ్లీ వేధించారనే విమర్శలు వచ్చాయి. ఇప్పటికైనా భూదందాలకు పాల్పడిన వారిపై దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

ఎస్పీ బాధ్యతలు తీసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది సంక్షేమంపై దృష్టిసారించారు. శాఖలో పనిచేస్తున్న వారి పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. నిత్యం విధి నిర్వహణలో పని ఒత్తిడితో ఉండే సిబ్బందికి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచనలు ఇచ్చారు. ఒంగోలులో వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు.



సిబ్బందికి చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు డీఎస్పీగా రాయపాటి

- పోలీసు శాఖలో బదిలీల పరంపర
- మరో ఐదుగురు సీఐలకు పోస్టింగ్‌లు



ఒంగోలు(క్రైం), ఆగస్టు 8: పోలీసు శాఖలో బదిలీల పరంపర కొనసాగుతోంది. నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలీసు అధికారుల బదిలీలు చేపట్టారు. గురువారం మలివిడత బదిలీల పర్వంలో రాష్ట్రంలో 28మంది డీఎస్పీలకు స్థానచలనం కల్పించారు. ఒంగోలు డీఎస్పీగా ప్రస్తుతం శ్రీకాకుళంలో దిశ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రాయపాటి శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చారు. అదే విధంగా ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావును గన్నవరం డీఎస్పీగా నియమించారు. అదేవిధంగా గుంటూరు రేంజిలో 30మంది సీఐలను బదిలీ చేయగా జిల్లాలో ఐదుగురికి పోస్టింగ్ ఇచ్చారు. ఒంగోలు పీటీసీలో ఉన్న వై రామారావును దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కే సురేష్‌ను గిద్దలూరు సీఐగా నియమించారు. ప్రస్తుతం కంభం సీఐగా పనిచేస్తున్న రామకోటయ్యను గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. బాపట్ల జిల్లా చీరాల 2 టౌన్ సీఐగా పనిచేస్తున్న సోమశేఖర్‌ను కొడపి సీఐగా, రేంజి వీఆర్‌లో ఉన్న ఎన్.శ్రీకాంత్‌ను ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. గిద్దలూరు సీఐగా పనిచేస్తున్న దాసరి ప్రసాద్‌ను గురజాల టౌన్‌కు, ఒంగోలు డీటీసీలో పనిచేస్తున్న మాకినేని శ్రీనివాసరావును అమరావతి టౌన్‌కు బదిలీ చేశారు. అలాగే రేంజి వీఆర్‌లో ఉన్న మాకినేని మురళీకృష్ణను తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. పీసీఆర్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వరరావును కందుకూరు సర్కిల్‌కు బదిలీచేయగా వై వీరాస్వామయ్యను గిద్దలూరు టౌన్ నుంచి ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీ చేశారు.

జిల్లాకు సుపరిచితుడు రాయపాటి

ఒంగోలు డీఎస్పీగా నియమితులైన రాయపాటి శ్రీనివాసరావు జిల్లాకు సుపరిచితుడు. జిల్లాలో ఎస్సైగా, సీఐగా అనేక ప్రాంతాలలో పనిచేశారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేశారు. రాయిపాటికి మంచి అధికారిగా పేరు ఉంది. ఆయన నియామకంతో అసాంఘిక శక్తుల గుండెల్లో గుబులు మొదలైంది. వచ్చేవారంలో బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని శ్రీనివాసరావు తెలిపారు.

ఉన్నదంతా దోచేసి, ఖాళీ ఖజానా ఇచ్చిన వైసీపీ

మెయిన్‌లో...



‘సాఫ్ట్’గా దొంగాట!



నిరసన చేస్తున్న పలు క్రీడాసంఘాలు, ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయులు

- కలెక్టర్ ఆదేశాలతో కదులుతున్న భాగోతం
- సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో భారీగా దోపిడీ
- నకిలీ క్రీడా సర్టిఫికెట్లపై విచారణ ప్రారంభం
- కీలకంగా వ్యవహరించిన గురుకుల పాఠశాల పీఈటీ
- దొడ్డిదారిన ఉద్యోగాలు పొందిన వారిలో ఆందోళన

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 8 : క్రీడారంగంలోనూ నకిలీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కొందరు క్రీడా సంఘం పేరుతో జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయుడు చేతివాటం చూపారు. పోటీలు నిర్వహించకుండానే సర్టిఫికెట్‌లు ఇవ్వడంతో వాటి ఆధారంగా కొందరు ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు పొందారు. అర్హులైన వారికి మొండిచేయి చూపి, ఆ ధ్రువపత్రాలను బజారులో అమ్మకాలు చేపట్టడంపై కొందరు క్రీడా సంఘాల నేతలు కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ అవినీతి వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. ఇందుకు సంబంధించి విచారణాధికారిగా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు (భూసేకరణ) స్పెషల్ కలెక్టర్ కే రూసీలక్ష్మిని నియమించారు. గురువారం నకిలీ క్రీడా సర్టిఫికెట్లపై విచారణ ప్రారంభమైంది. దీంతో ఇప్పటికే ఆ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిలో ఆందోళన మొదలుకాగా, మరోవైపు నకిలీ భాగోతంలో కీలకంగా వ్యవహరించిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు, అసోసియేషన్ ప్రతినిధులలో కలవరం మొదలైంది.

తీగలాగితే కదిలిన డొంక

సంతనూతలపాడు మండలం, గురువారెడ్డిపాలెంకు చెందిన కందుకూరి అనీల్ అనే అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ద్వారా ప్రచురితమైన ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత రాత పరీక్షలో పాసై స్పోర్ట్స్ కోటాలో సర్టిఫికెట్ సమర్పించారు. అయితే ఆన్‌లైన్‌లో పరిశీలించగా, ఆ వెబ్‌సైట్‌లో తనకన్నా ముందు చింపిరెడ్డి కొండారెడ్డి అనే వ్యక్తి నకిలీ సర్టిఫికెట్ ఆన్‌లైన్ చేసుకుని అర్హత పొంది ఉన్నారని అనీల్ గుర్తించారు. ఈ నేపథ్యంలో కొండారెడ్డి అను గురించి విచారణ చేయగా, సదరు వ్యక్తి సీనియర్స్ నేషనల్స్ పోటీలకు హాజరు కాకుండానే సర్టిఫికెట్ పొందాడని గుర్తించారు. ప్రస్తుతం కొండారెడ్డి వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా, అనంతపురం జిల్లాకు చెందిన మిధున్‌కుమార్, సాయి, ప్రకాశం జిల్లాకు చెందిన కే వంశీ తదితరులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు అమ్ముకున్నారని ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో విచారణ చేయాలని నిరసన ర్యాలీలు కూడా చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో నకిలీ క్రీడా సర్టిఫికెట్ భాగోతం వెలుగులోకి రాగా, గురువారం దీనిపై స్పెషల్ కలెక్టర్ రూసీ విచారణ ప్రారంభించారు.

సంఘం పేరుతో దర్జాగా దోపిడీ

జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో నకిలీ భాగోతం సర్టిఫికెట్ల వ్యవహారం నడిచినట్లు కొందరు క్రీడాసంఘాల నేతలు నేరుగా రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. వాస్తవాలు విచారించాలని, నకిలీ భాగోతం తేల్చాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దర్శి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న బొడ్డు సుబ్బారావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, సీఈవో సి.వెంకటేశ్వర్లుపై పలువురు క్రీడాసంఘాలు ఫిర్యాదులు చేశారు. బొడ్డు సుబ్బారావు ఇచ్చినవి నకిలీ సర్టిఫికెట్‌లు అని వారు కలెక్టర్‌కు వివరించారు. నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా అర్హులైన వారు ప్రభుత్వ ఉద్యోగాలను కోల్పోయారని వారు విన్నవించారు.

అమ్మఒడి పేరుతో సైబర్ నేరగాళ్ల వల

- వలంటీర్ నంబర్ నుంచి బాధితుడికి కాల్
- ఫోన్‌పే ద్వారా రూ.22వేల తస్కరణ

పొదిలి, ఆగస్టు 8 : రోజుకో కొత్తమార్గం వెతుక్కునే సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాల లబ్ధిపేరుతో ప్రజలను బోల్తాకొట్టిస్తున్నారు. తాజాగా అమ్మఒడి లబ్ధి పేరుతో వ్యక్తిని మోసం చేసి రూ.22వేలుదోచేశారు. నగరపంచాయతీ పరిధిలోని పిచ్చిరెడ్డితోటకు చెందిన బి.రామకృష్ణకు వలంటీర్ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. మేము సచివాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం. మీకు సంక్షేమ పథకాల డబ్బులు వచ్చాయా అని అడిగారు. దీనికి రామకృష్ణ వచ్చాయన్నాడు. అమ్మఒడి డబ్బులు పడలేదు కదా అని అడిగాడు. ‘పడలేదు సార్’ అని చెప్పాడు. ఇప్పుడు డబ్బులు పడతాయి ఫోన్‌పే తెరిచి నేను చెప్పినట్లు చేయిండని చెప్పాడు. నిజమేనని నమ్మిన రామకృష్ణ అతడు చెప్పినట్లు చేశాడు. దీంతో రామకృష్ణ ఖాతా నుంచి రూ.22వేల పోయాయి. వెంటనే వలంటీర్‌కు ఫోన్ చేసి విషయం తెలుపగా తనను హోల్డ్‌లో పెట్టి సైబర్ నేరగాళ్లు నీతో మాట్లాడారని, తన ఫోన్ ట్రాప్‌చేసి ఇద్దరిని మోసం చేసినట్లు చెప్పాడు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు తీసుకొని పరిశీలిస్తున్నారు.

ఎన్నికలు ప్రశాంతం



నేతివారిపాలెంలో ఎన్నిక సందర్భంగా పోలీస్ బందోబస్త్

- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీల ఎంపిక
- 83 చోట్ల ఎన్నికలు వాయిదా

ఒంగోలు(విద్య), ఆగస్టు 8 : ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల ఏర్పాటుకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సున్నితమైన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినా ఎక్కడ ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. సాయంత్రం ఆరు గంటలకు అందిన సమాచారం మేరకు.. 2,405కుగాను 2,002 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 310 పాఠశాలల్లో చేతులెత్తే విధానంలో సభ్యులను ఎన్నుకున్నారు. 84 పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడగా మరో తొమ్మిది పాఠశాలల్లో వివిధ కారణాలతో నిలిచిపోయాయి. నాలుగు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించి ఎన్నికలు జరగకుండా నిలుపుదల చేసుకున్నారు. ఒంగోలులోని వివేకానంద విద్యావిహార్, కొమరోలులోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం, కంభం, రావిపాడులోని శ్రీ సత్యనారాయణ అండ్ శ్రీనివాస్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో హైకోర్టు ఉత్తర్వులతో ఎన్నికలు ఆగాయి.

కమిటీల ఎన్నిక ఇలా...

ప్రాథమిక పాఠశాలల్లో 15 మందిని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 24 మందిని, హైస్కూళ్లలో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లాలో మొత్తం 38 మండలాలకు సాయంత్రం ఆరు గంటలకు 34 మండలాల నుంచి మాత్రమే సమాచారం జిల్లా కేంద్రానికి అందింది. ఎస్‌ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అనంతరం మొదట ఎస్‌ఎంసీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు ఓటర్లలో 50శాతం మంది హాజరు అవసరం. అయితే 84 పాఠశాలల్లో కోరం లేని కారణంగా ప్రధానోపాధ్యాయులు ఎన్నికలను వాయిదా వేశారు.

నేతివారిపాలెంలో పోటాపోటీ

కొండపి మండలం నేతివారిపాలెం ఎస్‌ఎంసీ ఎన్నిక పోటాపోటీగా జరిగింది. ఇక్కడి ఎస్‌ఎంసీ ఎన్నిక పంచాయతీ ఎన్నికలను తలపించింది. ఓటర్లకు డబ్బు ప్రలోభాలు పెట్టడంతో భారీమొత్తాలు చేతులు మారాయి. ఇతర గ్రామాలు, సమీప గ్రామాల్లోని పిల్లల తల్లిదండ్రులను రప్పించారు. ఇక్కడ ఓటు రూ.5వేలు పలికినట్లు చెప్పుకుంటున్నారు. ఇక్కడ పోటీ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికకు చేతులెత్తే పద్ధతిలో నిర్వహించారు. ఎటువంటి అలజడి లేకుండా ఎన్నిక ప్రశాంతంగా జరగడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఒంగోలు మండలంలో మొత్తం 82 పాఠశాలలకుగాను 81 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగినట్లు ఎంఈఓ కిషోర్‌బాబు తెలిపారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

టీడీపీ కూటమి మద్దతుదారుల హవా ● ఏకగ్రీవంగా చైర్మన్లు, సభ్యుల ఎన్నిక ● పలుచోట్ల కోరం లేక వాయిదా ● అభ్యర్థులను నిలిపేందుకు సాహసించని వైసీపీ నాయకులు

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. టీడీపీ కూటమి బలపర్చిన అభ్యర్థులు విజయఢంకా మోగించారు. వైసీపీ క్యాడర్ ఏ ఒక్క చోట కూడా పోటీ చేసేందుకు సాహసించలేదు. అయితే పలుచోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి..!

చీమకుర్తి, ఆగస్టు 8: చీమకుర్తి మండల పరిధిలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 67 పాఠశాలలకు గాను 64 స్కూళ్లలో కమిటీలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నాయుడుపాలెంలో ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గం

గాడిపర్తివారిపాలెంలో ఉన్న హైస్కూల్, ప్రాథమికపాఠశాల, రంగశాయిపురం ప్రాథమిక పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవోలు నరసింహారావు, శివాజీలు తెలిపారు. కాగా గాడిపర్తివారిపాలెంలో అధికారపార్టీలో నెలకొన్న విభేదాల వల్ల కాసింత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సీఐ సుబ్బారావు అక్కడకు చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. అయితే కోరం లేకపోవటంతో అక్కడున్న మూడు పాఠశాలల్లో ఎన్నిక వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఉద్రిక్తత నెలకొంటుందేమో అని అనుకున్న పి.నాయుడుపాలెం గ్రామంలో ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. బక్కమంతుల సుబ్బారావు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్ కూరాకుల కరుణాకరరెడ్డి, తొరటి రోశయ్య, శ్రీనివాసరెడ్డి, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు. చీమకుర్తి పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నతపాఠశాల చైర్మన్‌గా చలువాది రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పులికొండ ప్రాథమికోన్నతపాఠశాల చైర్మన్‌గా రావి వెంకటశేషారావు, వైస్‌చైర్మన్‌గా గుంటూరి గీత ఎన్నికయ్యారు.

సంతనూతలపాడులో ఎన్నిక ఏకగ్రీవం

సంతనూతలపాడు: సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆళ్లచెరువు నాగధన లక్ష్మి చైర్మన్‌గాను, వైస్ చైర్మన్‌గా కందుల బ్రహ్మయ్యను ఎన్నుకున్నారు. సంతనూలపాడులోని అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న మండలపరిషత్ పాఠశాల కమిటీ చైర్మన్‌గా పి.సుమలత, వైస్‌చైర్మన్‌గా పి.సురేష్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వారికి టీడీపీ నాయకులు తస్నీరు శ్రీను, ఆర్.అంకారావు, ఎస్.శ్రీరామ్మూర్తి, సురేష్, మట్టా పోలిశెట్టి, శంకర్, నాయబ్‌రసూల్ అభినందనలు తెలిపారు.

సైకిల్ మద్దతుదారుల హవా

నాగులుప్పలపాడు: మండలంలో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో టీడీపీ ఏకగ్రీవంగా క్లీన్ స్వీప్ చేసింది. మండలంలోని 64 పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో భాగంగా 13 జిల్లా పరిషత్, 51 మండల పరిషత్ పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.



ఉప్పుగుండూరులో కమిటీ సభ్యులు



మాచవరంలో కమిటీ సభ్యులతో కూటమి నాయకులు

ఈదుమూడి జడ్పీ హైస్కూలు లో కోరం లేక ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈవో రమణయ్య తెలిపారు. పలు చోట్ల వైసీపీ క్యాడర్ పోటీలో ఉండాలని భావించి చివరి నిమిషంలో వెనుదిరిగారు. గత వైసీపీ పాలనలో మండలంలో అనేక పదవులు పొందిన నాయకులు ఈ ఎన్నికల్లో మాత్రం తమ హవాను చూపించలేకపోయారు. మాచవరంలో జనసేన మద్దతు అభ్యర్థి చైర్మన్‌గా విజయం సాధించారు.

దొడ్డవరం విద్యాకమిటీ చైర్మన్‌గా అలేఖ్య

మద్దిపాడు: దొడ్డవరం జడ్పీ హైస్కూలులో గురువారం జరిగిన ఎన్నికలలో విద్యా కమిటీ చైర్మన్‌గా భీమవరపు అలేఖ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, గ్రామస్తులు ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు కృషిచేశారు. కార్యక్రమంలో కొర్రపాటి దుర్గారావు, బి.వెంకట్రావు, కుంచాల రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దొడ్డవరంలో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

కొత్తపట్నం హైస్కూలులో నిలిచిన ఎన్నిక

కొత్తపట్నం(ఒంగోలునగరం): కొత్తపట్నం మండలంలో స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. అయితే అన్ని స్కూళ్లలో కమిటీ ఎన్నికలు జరగ్గా, ఒక్క కొత్తపట్నం హైస్కూలులో నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగిన అన్ని పాఠశాలల్లో టీడీపీ అనుచరులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైసీపీ వర్గీయులు ఎస్ఎంసీ ఎన్నికల్లో తలదూర్చేందుకు మండలంలో ఎక్కడా చొరవ చూపిన దాఖలాలు కనిపించలేదు. ఒక్క కొత్తపట్నంలోని హైస్కూలులో ఎన్నికపై టీడీపీ, సీపీఐ నాయకుల మధ్య చర్చలు ఒక కొలిక్కి వచ్చినా కోరం లేకపోవటంతో ఎన్నికలు నిలిచిపోయాయి. ఇక్కడ మొత్తం 1300 మంది విద్యార్థులు ఉండగా, తల్లిదండ్రులు ఎస్ఎంసీ ఎన్నికల్లో పాల్గొనేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ఎన్నికలను వాయిదా వేశారు. అయితే 3,4,5 తరగతులకు మాత్రం ఎన్నికలు జరిగి డైరెక్టర్లను ఎన్నుకున్నారు. కొత్తపట్నంలోని పోస్టాఫీస్ వద్ద గల ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల విషయమై టీడీపీ, సీపీఐ వర్గాల మధ్య కొద్దిపాటి ఘర్షణ చోటు చేసుకుంది. అల్లూరు, మోటు మాల, ఆలూరు, గమళ్ళపాలెం, ఈతముక్కల హైస్కూళ్లతో పాటు మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరిగాయి. డైరెక్టర్లు, చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అల్లూరు పాఠశాలలో ఎన్నిక ప్రక్రియ

వైసీపీకి బిగ్ షాక్..!

టీడీపీలో చేరిన ఇరువురు కార్పొరేటర్లు

ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసిన మేయర్, డిప్యూటీ మేయర్

మరో ఐదుగురు కార్పొరేటర్లు, వారి భర్తలు కూడా..





ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో పార్టీలో చేరిన కార్పొరేటర్లు పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కమలమ్మ

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 8: ఒంగోలులో వైసీపీకి మరోసారి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, వారి భర్తలు గురువారం ఎమ్మెల్యే దామచర్లను ఆయన నివాసంలో కలిశారు. వారిలో 33వ డివిజన్ కార్పొరేటర్ నియంతరెడ్డి భర్త పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు, 13వ డివిజన్ కార్పొరేటర్ కమలమ్మ తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకొన్నారు. ఇదిలా ఉండగా, వారితోపాటు మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకటసూర్యనారాయణ (వేమూరి బుజ్జి), 2వ డివిజన్ కార్పొరేటర్ భర్త గాంధీ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజాశాండిల్య, 43 డివిజన్ కార్పొరేటర్ కండే స్వాతి భర్త రమణయాదవ్ మరో పది మంది వైసీపీ కార్పొరేటర్లు, వారి భర్తలతో ఎమ్మెల్యే దామచర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా వారిలో పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కమలమ్మలు టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరగా, మిగిలిన మేయర్ మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు రెండు రోజుల్లో టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ కుమారుడు సిద్ధూ కూడా పార్టీలో చేరారు. ఈ మేరకు త్వరలో జరగనున్న కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ల మెజారిటీతో జరిగేలా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల వారితో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని, పార్టీలో చేరడం సంతోషమని తెలిపారు. అనంతరం వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

● జేసీ గోపాలకృష్ణ హెచ్చరిక



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు, ఆగస్టు 8: గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ హెచ్చరించారు. గురువారం వెల్లంపల్లి గుండ్లకమ్మ నదీ పరివాహ ప్రాంతంలో ఇసుక రీచ్‌ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితోనే ఇసుక తరలించాలని, ఎవరైనా ఇసుక అక్రమంగా తరలిస్తే రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామాలలో ఇసుక అవసరమైన వారికి తహసీల్దార్ అనుమతి ఇస్తారన్నారు. తహసీల్దార్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలో ఎవరు ఇసుకను అక్రమ రవాణా చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకోవటమే కాకుండా వాహనాన్ని సైతం అదుపులోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేష్, డీటీ ఆశాజ్యోతి, వీఆర్వో అరుణ, మైనింగ్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెల్లంపల్లిలో రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేశారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం



అన్నదానం చేస్తున్న మేయర్ సుజాత

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8 : ఆంధ్రుల అన్నపూర్ణగా పిలిచే డొక్కా సీతమ్మ పేరుతో క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలు, కూలీలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. జనసేన పార్టీ నేత జడ బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేటలోని సీతమ్మక్యాంటీన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మేయర్ సుజాతను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పసుపులేటి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

● ఎమ్మెల్యే దామచర్ల

పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 8 : ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే టీడీపీ కూటమి ప్రభుత్వం లక్ష్యమని, కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఆయన పాఠ్యపుస్తకాలు, నోట్సులు, బ్యాగులను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.తారక్ అధ్యక్షతన జరిగిన సదస్సులో దామచర్ల మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో పిల్లల పుస్తకాలు, బ్యాగులు, బెల్టులపైనా జగన్ బొమ్మలు వేసుకుని కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఎలాంటి రాజకీయ ముద్రలేని మెటీరియల్ అందిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాలేజీ స్థాయి విద్యార్థులకు సబ్జెక్ట్ పుస్తకాలు, నోట్సులు అందిస్తున్నారని చెప్పారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తారక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల కుటుంబం పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందిస్తూ, ఆధునిక వసతులతో కూడిన భవనాలను ఇప్పటికే నిర్మించి విద్యాదాతలుగా ఉన్నారన్నారు. డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కాలేజీలు నిర్మించారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆర్ఐవో సైమన్‌విక్టర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ స్టాంపుల కుంభకోణదారులపై చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే దామచర్లను కోరిన బీజేపీ నేత

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8: ఒంగోలు నగరంలో జరిగిన నకిలీ స్టాంపుల కుంభకోణంపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ కోరారు. గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా యోగయ్యయాదవ్ మాట్లాడుతూ ఒంగోలు-కొత్తపట్నం మధ్యలో ఉన్న బకింగ్‌హామ్ కాలువపై బ్రిడ్జిని పూర్తిచేయడంతో పాటు గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మైనింగ్ జోన్‌లో ఉందని తెలిసినా కూడా గత వైసీపీ ప్రభుత్వం యరజర్ల కొండను ధ్వంసం చేసిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం కక్ష సాధింపుచర్యల్లో భాగంగా అర్హులైన అనేక మంది పింఛన్లు తొలగించారని, వారందరికి తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, కూటమి ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆయా అంశాల వారీగా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని యోగయ్యయాదవ్ తెలిపారు.



ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసిన యోగయ్యయాదవ్

కళలతో సంస్కారం, మానవతా విలువలు

● ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు హరిబాబు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 8: కళలు సంస్కారాన్ని నేర్పించడంతో పాటు మానవతా విలువలను ప్రబోధిస్తాయని ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరం లాయర్‌పేట సాయిబాబా మందిరంలో ఆయన శ్రీరాఘవ కూచిపూడి నృత్య సంగీత కళానిలయాన్ని ప్రారంభించారు. కళానిలయం ద్వారా సంగీతం, నృత్యం నటనలో శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులు కరవది సాయిశరణ్య, కరవది సాయిశ్రావ్యలను ఆయన అభినందించారు. అనంతరం ఈదర మాట్లాడుతూ రంగస్థల నటులు స్వర్గీయ కరవది రాఘవకు ఎన్టీఆర్ కళాపరిషత్‌తో సుదీర్ఘ అనుబంధం ఉందని, ఆయన కుమార్తెలు సైతం కళారంగంలో కృషిచేయటం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రరసం అధ్యక్షులు పొన్నూరు వెంకటశ్రీనివాసులు మాట్లాడుతూ కళాసేవ ద్వారా మంచి సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఈ సందర్భంగా శ్రీకళాప్రకాశం అధ్యక్షులు చిట్టా వెంకటశివప్రసాద్, నళినీప్రియ కూచిపూడి నృత్యనికేతన్ అధ్యక్షురాలు ఎస్వీ.శివకుమారిలను ఘనంగా సత్కరించారు. కాగా కరవది సాయిశరణ్య ఆలపించిన శాస్త్రీయసంగీతం, కరవది శ్రీనివాస్ ప్రదర్శించిన విశ్వామిత్ర ఏకపాత్రాభినయం, సాయిశ్రావ్య శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. కార్యక్రమంలో కరవది నాగలక్ష్మి, సుమంత్, జశ్వంత్, సాయిబాబా మందిర నిర్వాహకులు డాక్టర్ రావి ప్రసాదరావు, రుద్రవరం సాయి, రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళానిలయ పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8 : ఒంగోలులో జిల్లా యువజన సంక్షేమశాఖ, శ్రీప్రతిభ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక ప్రతిభ కళాశాల నుంచి పేర్నమిట్ట వరకు జరిగింది. ఈ సందర్భంగా సెట్ప్ సీఈవో ఎంవీఎస్.లోకేశ్వరరావు మాట్లాడుతూ 75 ఏళ్ళ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ప్రతిఏటా ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల యువతకు మన స్వాతంత్ర్య సమరయోధుల కృషి, వారి త్యాగాలను గుర్తు చేయడంతో పాటు వారిలో దేశభక్తిని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో విద్యార్థులు 75 అడుగుల జాతీయ పతాకంతో తిరంగా యాత్రను నిర్వహించారు కార్యక్రమంలో ప్రతిభ కళాశాలల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, సెట్ప్ మేనేజర్ పువ్వాడ శ్రీమన్నారాయణ, నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ కమల్‌షా, ప్రతిభ కళాశాలల వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయజెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఏఐఎల్‌యూ, ఐఏఎల్, ఒంగోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా కోర్టు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కొత్త చట్టాల వల్ల ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగించేలా ఉందన్నారు పోలీసులు ఈ చట్టాల ద్వారా విస్తృతమైన అధికారులు కలిగి న్యాయ వ్యవస్థ అధికారాన్ని తగ్గించేలా ఉందని విమర్శించారు. అనంతరం జిల్లా కోర్టు వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌దాస్, జనరల్ సెక్రటరీ సురేంద్రబాబు, కోశాధికారి లక్ష్మీనారాయణ, యాసిన్, డి.ఏడుకొండలు, పోతినేని వెంకటేశ్వర్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అవీ..ఇవీ..

ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటు చేయాలి

● ఎంపీ మాగుంట

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 8: ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని గురువారం పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో విమానాశ్రయాల సంఖ్య దేశంలో 150కు చేరుకున్నాయన్నారు. దేశంలో 75శాతం ప్రయాణికులు మూడు కంపెనీల విమానాల్లోనే ప్రయాణిస్తున్నారని చెప్పారు. విమానయాన టిక్కెట్ ధరలు తగ్గడంతో పేద, మధ్యతరగతి ప్రజలు సైతం విమానాల్లో ప్రయాణాలు చేస్తున్నారని తెలిపారు. 20 ఏళ్లక్రితం ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటుకు 650 ఎకరాలను సంబంధిత బృందం పరిశీలించిందని, దీనిపై ఆనాడే సంబంధిత శాఖ అధికారులు సైతం ఆమోదించినట్లు గుర్తుచేశారు. కేంద్రం 60 శాతం నిధులిస్తే రాష్ట్రం 40శాతం నిధులతో నూతన విమానాశ్రయాల ఏర్పాటుకు ముందుకు వెళ్లే అవకాశం ఉందని మాగుంట పేర్కొన్నారు.

నిధులు మంజూరుపై హర్షం

మద్దిపాడు, ఆగస్టు 8: ప్రైవేటు ఆలయాల్లో ధూప దీప నైవేధ్యాలకు ప్రభుత్వం రూ..10వేలు మంజూరు చేయటం హర్షణీయమని బ్రాహ్మణ కార్పొరేషన్ మండల మాజీ కోఆర్డినేటర్ కొణిజేటి శివకుమార్ పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవాలయాలకు రూ.10వేలు మంజూరు చేయటం ద్వారా ఆలయాల అభివృద్ధికి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. అదేవిధంగా బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి పేద బ్రాహ్మణులకు రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రమేష్ పంతులు, వెంకటేశ్వర్లుపంతులు, రాజుపంతులు, జన్నాపట్ల శ్రీనివాస రావుశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్విస్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో రెడ్‌క్రాస్ సంస్థ, సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండెరెక్ట్ టాక్సీస్ అండ్ కస్టమ్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమలో రెడ్‌క్రాస్ సభ్యులు డాక్టర్ జీవీ.సుబ్బారావు, బీవీరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి నవనీత కృష్ణన్, పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 8: ఒంగోలు నగరం సత్యనారాయణపురంలో నివసిస్తున్న రుద్రనేత్ర అనే పేద విద్యార్థి కాలేజీ ఫీజుకు రూ.24 వేల ఆర్థిక సహాయాన్ని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ గురువారం అందజేశారు. స్థానిక కర్నూల్ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రుద్రనేత్ర తండ్రి హోటల్ కార్మికుడు కాగా తల్లి ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారి పరిస్థితిని తెలుసుకుని ప్రవాస భారతీయుడు మహేష్ తుమ్మల సహకారంతో నగదును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, జనసేవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

12న ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

ఒంగోలు(విద్య), ఆగస్టు 8: ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 12వ తేదీన ఒంగోలులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు ఇంటర్‌లో 75శాతం కంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులైన సీఎస్ఈ, బైపీసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్ విద్య, నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్‌టెక్‌ల ఆధ్వర్యంలో ఈ మేళా జరుగుతుందన్నారు. రాత పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగానికి ఎంపిక చేస్తారని, వారికి మొదట మూడు నెలలు శిక్షణ కాలంలో రూ.10వేల చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారు. శిక్షణ పూర్తయిన వారికి ఏడాదికి రూ.1.70 లక్షలు వేతనం ఇస్తారు. అభ్యర్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు హెచ్‌సీఎల్ సహకారం అందిస్తుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏకేయూలో కొత్త కోర్సులు : వీసీ

ఒంగోలు(విద్య), ఆగస్టు 8: ఆంధ్రకేసరి యూనివర్శిటీలో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచేలా కొత్త కోర్సులు ప్రారంభించనుననట్లు వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి తెలిపారు. గురువారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో బీఈడీ కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ళతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కోర్సులకు కళాశాలలు కూడా తగు విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన చెప్పారు. జాతీయ నూతన విద్యావిధానం, డిజిటల్ మూల్యాంకాన్ని ప్రోత్సహిస్తున్నందున యూనివర్శిటీలో కూడా డిజిటల్ మూల్యాంకనం ప్రవేశపెడుతున్నట్లు మూర్తి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థుల రికార్డులు డిజిటలైజేషన్ మూల్యాంకనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డీన్ డి.వెంకటేశ్వరరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, సీఈ కేవీఎన్.రాజు, ఎస్ఈ పద్మజ, ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, డీవోఏ సోమశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, బీఈడీ కళాశాలల ప్రతినిధులు వై.వెంకటేశ్వరరావు, కె.గుండారెడ్డి, మార్పు గ్రెగోరి, చంద్రరావు, రమణారెడ్డి, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పల్లామల్లిలో విద్యుత్ సమస్యలు పరిష్కారం

చీమకుర్తి, ఆగస్టు 8: పల్లామల్లిలో పొంచి ఉన్న యమపాశాలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన వార్తకు విద్యుత్‌శాఖాధికారులు తక్షణమే స్పందించారు. ఏఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిశీలించారు. ప్రమాదంగా ఉన్న రామాలయంవీధిలో శిథిలస్థితికి చేరుకున్న కరెంటు స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభానికి తీగలు ఏర్పాటు చేసి విద్యుత్‌సరఫరా చేశారు. గ్రామంలో నెలకొన్న మిగతా సమస్యలకు సైతం తాము వెంటనే పరిష్కారం చూపుతామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చెబితే తాము పరిష్కరిస్తామని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొత్త స్తంభానికి తీగలు బిగిస్తున్న సిబ్బంది

రైలు కిందపడి యువకుడు మృతి

ఒంగోలు(క్రైం), ఆగస్టు8 : రైలు కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం ఒంగోలు సమీపంలో కరవది వైపు జరిగింది. సమారు 30 ఏళ్ళ యువకుడు రైలు కింద పడి చనిపోగా మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. బులుగు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఒంగోలు రైల్వే పోలీసులు రిమ్స్‌కు తరలించారు. మృతిడి వివరాలు తెలిసినవారు స్టేషన్‌రైటర్ 9381923900, 7013915467, అలాగే సీఐ 9440904870 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

పేస్‌లో విద్యార్థుల రక్తదానం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

ఒంగోలు(విద్య), ఆగస్టు 8: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేకంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పటల్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తలసేమియా పేషెంట్ల కోసం రక్తదానం చేసేందుకు విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేకమందిని కాపాడవచ్చని తెలిపారు. ఈ శిబిరంలో 50 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీన్ ఆర్.వీరాంజనేయులు, ఎం.మల్లికార్జునరావు, పి.బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సెంట్రల్ స్కూలులో సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8: ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో గురువారం విశ్వంలో మన జీవితం అనే అంశంపై విద్యార్థులతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యాలు, లఘు నాటికలను ప్రదర్శించారు. అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ శశిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలి

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 8 : గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలని ఏపీఎస్ఐఆర్డీ, పీఆర్ జాయింట్ డైరెక్టర్ రామనాథం సూచించారు. జరుగుమల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి మూడురోజులపాటు జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ అమర్‌బాబు మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ బి. నిర్మల, ఎంపీడీవో జలజాక్షి, ఈవోపీఆర్ఆర్డీ అంజలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ పాల్గొన్నారు.

పొన్నలూరులో... పొన్నలూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులు శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన పాల్గొన్నారు.

పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

టంగుటూరు, ఆగస్టు 8 : పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం మేలని టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ చెప్పారు. గురువారం టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని ఈడీ పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రాబోయే సీజన్‌లో పంట పరిమాణాన్ని స్థిరీకరించడం, ఉత్పత్తి నియంత్రణ అవసరతను వివరించారు. వచ్చే సీజన్‌లో ధరలు ఎలా ఉంటాయో చెప్పలేమని, అధిక ధరలు చెల్లించి భూములు కౌళ్లకు, బ్యారన్లు లీజులకు తీసుకోవద్దని హెచ్చరించారు. ఈసందర్భంగా వర్జీనియా పొగాకు సాగు రైతులంతా ఈడీ శ్రీధర్, సూపరింటెండెంట్ ఏ శ్రీనివాసరావు, మేనేజర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆక్షన్ మేనేజర్, ఇన్చార్జ్ మేనేజర్ దివి వేణుగోపాల్, ప్రాంతీయ అధికారి ఎం లక్ష్మణరావు, ఆక్షన్ సెంటర్ గుంటూరు నిర్వహణాధికారి రామాంజనేయులు, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ సిద్ధిరాజులను సన్మానించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, వేలం కేంద్రానికి వచ్చిన ఉప్పలపాడు రైతులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఎస్ఎంసీ ఎన్నికలు

ఇలవర గ్రామంలో ఉద్రిక్తత
పోటీపోటీగా టీడీపీ రెండు వర్గాలు, అలాగే వైసీపీ కూడా..
నాలుగు స్కూళ్లలో మూడు నాయుడు వర్గం కైవసం
పేరెంట్స్ రాక నిలిచిన డిపెప్ స్కూల్ ఎన్నిక
ఓటర్లకు భారీగా నజరానాలు

కొండపి, ఆగస్టు 8 : మండలంలోని ఇలవర(నేతివారిపాలెం) గ్రామంలో గురువారం పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా జరగాల్సిన ఎన్నికలు చివరి వరకు నేతల కనుసన్నల్లోనే సాగాయి. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు స్వగ్రామం ఇలవర. ఆ గ్రామంలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీలో రెండో వర్గం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు పేరెంట్స్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలొచ్చాయి. దీంతో రెండు వర్గాలు గ్రామంలోని స్కూళ్ల కమిటీలను దక్కించుకునేందుకు పోటీపడ్డాయి. హైస్కూల్‌తోపాటు అదే ఆవరణలోని ఎలిమెంటరీ స్కూల్, ఎస్సీ కాలనీలోని డిపెప్ స్కూల్, గ్రామంలోని మరో డిపెప్ స్కూల్‌కు ఎన్నికలు జరిగాయి. అన్ని స్కూళ్లలో తమకు అనుకూల కమిటీలను గెలిపించుకోవాలనే పట్టుదలతో ఉన్న రెండు వర్గాలు, విద్యార్థుల తల్లిదండ్రులైన ఓటర్లకు ఓటుకు 5 వేల రూపాయల చొప్పున పంచారు. ఎస్సీ కాలనీలోని డిపెప్ స్కూల్‌లో మొత్తం 9 మంది విద్యార్థులు ఉన్నారు. వారి తల్లిదండ్రులు కూడా 9 మంది ఉండటంతో ఒక్క ఓటు కోసం ఒక దశలో 50 వేల రూపాయలు లేదా ఇంటివద్ద బోరు వేసేందుకు నాయకులు హామీ ఇచ్చారు. టీడీపీ రెండు గ్రూపులకు మద్దతుగా గ్రామంలోని వైసీపీ కూడా రెండు గ్రూపులుగా చీలిపోయింది. వైసీపీ రెండు గ్రూపులు టీడీపీ రెండు గ్రూపులకు మద్దతు పలికాయి. దీంతో గ్రామంలోని నాలుగు స్కూళ్లలో మూడు కమిటీలు యల్లమంద నాయుడి వర్గం దక్కించుకున్నది. గ్రామంలోని డిపెప్ స్కూల్‌లో 11 మంది పేరెంట్స్ ఉన్నారు. ఈస్కూల్ కమిటీ కూడా యల్లమంద నాయుడికే దక్కే అవకాశం ఉండటంతో ప్రత్యర్థి వర్గం పేరెంట్స్‌ను నిలువరించింది. దీంతో ఎవరూ ఎన్నికల సమయంలోపల పేరెంట్స్ హాజరు కాకపోవడంతో ఈ స్కూల్ కమిటీ ఎన్నిక నిలిచిపోయింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కృష్ణబాజీబాబు పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. పలు దఫాలు రెండు వర్గాలు హైస్కూల్ వద్ద మోహరించడంతో వారిని ఎస్సై రెండు వర్గాలను చెదరగొట్టి పంపించారు.


మూలగుంటపాడు హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన ఆదిలక్ష్మిని అభినందిస్తున్న టీడీపీ నేతలు

పేరెంట్స్ కమిటీలు ఏకగ్రీవం

పేరెంట్స్ కమిటీల ఎన్నికలు సజావుగా గురువారం జరిగాయి. కొండపి మండలంలోని ఇలవర(నేతివారిపాలెం) గ్రామంలోని మూడు స్కూళ్లకు మినహా, మిగతా మండలంలోని స్కూళ్ల కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండలంలో మొత్తం 49 స్కూళ్లు ఉండగా 45 చోట్ల కమిటీలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈస్కూళ్లలో పేరెంట్స్ సభ్యులను అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇలవర గ్రామంలోని ఎంపీపీఎస్(డిపెప్) స్కూల్ ఎన్నిక కోరం సభ్యులు హాజరు కానందున వాయిదా పడిందని ఎంఈవో పి.రామారావు తెలిపారు. ఇలవర హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ ఎన్నిక సందర్భంగా పేరెంట్స్‌ను సమావేశ పరిచిన స్కూల్ హెచ్‌ఎం పి.సీతారామయ్య మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధి కోసం పనిచేసే వారిని కమిటీలో ఎన్నుకోవాలని పేరెంట్స్‌కు సూచించారు. అనంతరం స్కూల్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు.


నేతివారిపాలెంలోని జడ్పీహైస్కూల్‌లో కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న హెచ్‌ఎం

- జరుగుమల్లి మండలంలో... మండలంలో 43 స్కూళ్లు ఉండగా, 42 స్కూళ్లకు కమిటీలు ఏకగ్రీవమయ్యాయని ఎంఈవో బి. నాగేంద్ర వదన్ తెలిపారు. పీరాపురం ఎంపీస్కూల్‌లో కోరం సభ్యులు హాజరు కానందున ఎన్నిక వాయిదా పడిందని వివరించారు. మండలంలోని రెడ్డిపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ఎన్నికకు ముందుగా హాజరైన ఎంఈవో స్కూల్ అభివృద్ధికి పాటుపడేవారిని ఎన్నుకోవాలని సభ్యులకు సూచించారు. అనంతరం జరిగిన ఎన్నికలో పేరెంట్స్ స్కూల్ కమిటీ ఛైర్మన్‌గా మూలె శివారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్‌గా కె. భాగ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హెచ్‌ఎం బి. చలపతిరావు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకుడు వై. రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.
- పొన్నలూరు మండలంలో... మండలంలో 53 స్కూళ్లలో జరిగిన పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో అన్ని స్కూళ్లలో కమిటీలను పేరెంట్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎంఈవో ఇడపలపాటి రవికుమార్ తెలిపారు.

అన్ని పాఠశాలల్లో కూటమి మద్దతుదారులే చైర్మన్లు

సింగరాయకొండ, ఆగస్టు 8 : మండలంలో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని ప్రాథమిక పాఠశాలలు 40 ఉండగా అందులో 33 పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు మూడు ఉండగా రెండు పాఠశాలల్లో, హైస్కూల్స్ ఆరు ఉండగా ఐదు హైస్కూళ్లలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. 49 పాఠశాలల్లో ఎన్నికలు జరగగా 40 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవమయ్యాయి. సింగరాయకొండ బాలికల హైస్కూల్ ఎస్ఎంసీ ఛైర్మన్‌గా టి.భాగ్యలక్ష్మి, మూలగుంటపాడు హైస్కూల్ ఛైర్మన్‌గా నరాల ఆదిలక్ష్మి, పాతసింగరాయకొండ హైస్కూల్ ఛైర్మన్‌గా జాజుల విజయలక్ష్మి, ఊళ్లపాలెం హైస్కూల్ ఛైర్మన్‌గా కూనపరెడ్డి వెంకటసుబ్బయ్య, పాకల హైస్కూల్ ఛైర్మన్‌గా వాయిల తిరుపతి ఎన్నికయ్యారు. అన్నీ పాఠశాలల్లో టీడీపీ కూటమి మద్దతుదారులు విజయం సాధించడంపట్ల కూటిమి నేతలు విజయం సాధించిన ఛైర్మన్లకు, కమిటీ సభ్యులను అభినందించారు.

టంగుటూరులో విద్యాకమిటీలు ఏకగ్రీవం

టంగుటూరు, ఆగస్టు 8 : మండలంలోని కారుమంచి, ఎం నిడమలూరు, జమ్ములపాలెం, మర్లపాడు, కొణిజేడు, జిల్లా పరిషత్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అత్యధిక స్థానాలు టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా మన్నం వెంకటేష్, మొత్తం 24 మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఇదే గ్రామంలోని కొత్త ఎస్సీ కాలనీలోగల ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా చొప్పర మౌనిక, అరుంధతీవాడలోని ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా బద్దిపూడి రూప, గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా దామవరపు అరవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎం నిడమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా పిడుగురాళ్ల సురేష్ బాబు, వైస్ ఛైర్మన్‌గా మార్తూరి రమణ కమిటీ ఏకగ్రీవమైంది. అలాగే ఇదే గ్రామంలోని ఎస్సీ కాలనీ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా మేశం సూర్య, అరుంధతీవాడ ప్రాథమిక పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా పల్లెపోగు ప్రసాద్, తెల్లబాడు ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌గా గుజ్జు కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా మాదాల నారాయణమ్మ, వైస్ ఛైర్మన్‌గా అంగలకుర్తి సాల్మన్, ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా లక్కంతోటి శ్రీకాంత్, వైస్ ఛైర్మన్‌గా దార్ల అంకబాబు, అరుంధతీవాడలోని ప్రాథమిక పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా తగరం విజయలక్ష్మి, వైస్ ఛైర్మన్‌గా ఇండ్ల నవీన ఏకగ్రీమయ్యారు. కొణిజేడు జిల్లా పరిషత్ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా యనమల వెంకట్రావు, వైస్ ఛైర్మన్‌గా ధనలక్ష్మి ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా పూనాటి కృష్ణవేణి, వైస్ ఛైర్మన్ షేక్ రఫీ ఎంపికయ్యారు.


ఎం నిడమలూరు ఎస్ఎంసీ ఛైర్మన్ సురేష్

కాలువలో పడి వృద్ధురాలు మృతి

సింగరాయకొండ, ఆగస్టు 8 : మండలంలోని వఙాలగుంటపాడు పంచాయతీ పరిధిలోని గొల్లా చెంచయ్య పెట్రోల్ బాంకు సమీపంలోని పంక్చర్ దుకాణం వైనుక వైపు ఉన్న కాలువలో వృద్ధురాలు మృతిచెందింది. ఎస్సై టి. శ్రీరామ్ తెలిపిన వివరాల మేరకు.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సుందర్ నగర్‌కు చెందిన కుంభా వెంకాయమ్మ(70) కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై టి. శ్రీరామ్ మంగళవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం పెట్రోల్ బాంకు సమీపంలో మృతదేహం ఉందనే సమాచారంలో ఎస్సై అక్కడికి చేరుకొని పరిశీలించారు. వెంకాయమ్మగా గుర్తించారు. తిండి, నీరు లేక శరీరం డిహైడ్రోజన్‌కు గురై చనిపోయి ఉండవచ్చునని నిర్ధారణకు వచ్చారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై టి. శ్రీరామ్

ఆర్టీసీ బస్సు ఢీకొని...

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన స్థానిక బస్‌స్టేషన్ లోపలికి వెళ్లే రోడ్డుపై మసీద్ ఎదుట గురువారం చోటుచేసుకుంది. ఎస్సై టి. శ్రీరామ్ తెలిపిన వివరాల మేరకు... జరుగుమల్లి మండలం కె. బిట్రగుంట గ్రామానికి చెందిన యాదగిరి ఈశ్వరమ్మ సింగరాయకొండకు వచ్చింది. పనులు ముగించుకొని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఒంగోలు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వెళ్లేసమయంలో ఈశ్వరమ్మను ఢీకొట్టింది. దీంతో ఆమె బస్సు కిందపడడంతో ఎడమచక్రం పొట్టపై ఎక్కింది. దీంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న ఎస్సై టి. శ్రీరామ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. వృద్ధురాలిని 108లో కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కుట్టు మిషన్లు అందజేసిన మాగుంట ఛారిటబుల్ ప్రతినిధులు, టీడీపీ నేతలు

మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ

సింగరాయకొండ, ఆగస్టు 8 : మండలంలోని ఊళ్లపాలెంలో మాగుంట ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన తనయుడు రాఘవరెడ్డి ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ సెంటర్‌లో ట్రైనింగ్ పూర్తిచేసుకున్న 18 మంది మహిళలకు గురువారం మాగుంట ట్రస్టు సభ్యులు కుట్టుమిషన్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సాగర్, టీడీపీ నేతలు బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, నూతలపాటి చైతన్య, మోటుపల్లి కిషోర్, రోటరీ క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలినేని అక్రమాల లెక్కలు తేలుస్తాం

- ఈవీఎంల మాక్ కౌంటింగ్‌పై ఎలాంటి అభ్యంతరం లేదు
- ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 8: గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి అడ్డగోలుగా చేసిన అక్రమాలన్నీ లెక్కలు తేలుస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓట్లు లెక్కింపుపై అనుమానంతో బాలినేని చేసుకున్న దరఖాస్తుకు తాము సిద్ధమేనని, రీ మాక్ కౌంటింగ్‌లపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, దానిని స్వాగతిస్తామని చెప్పారు. గురువారం ఒంగోలులోని పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ ఇటీవల బాలినేని చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా సమాధానమిచ్చారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో గంజాయి బ్యాచ్‌ను అడ్డుపెట్టుకుని జీజీహెచ్ లో చేసిన రౌడీయిజం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళలపై చేసిన దాడులు, టీడీపీ కార్యకర్తలపై పెట్టిన కేసులు, బాలినేని అక్రమాలు, అవినీతిపై అన్ని లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ఇష్టమొచ్చినట్లు నోరుపారేసుకుని పరుష పదజాలంతో మాట్లాడిన బాలినేని ఓట్లు లెక్కింపు రోజు తొలి రౌండ్‌కే ఒంగోలు వదిలి వెళ్ళిపోయిన సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. మరలా నెలతర్వాత ఒంగోలు వచ్చి నోటికొచ్చినట్లు మాట్లాడి వెళ్ళిపోతే ఇక్కడ ఎవరూ భయపడరని దామచర్ల ఎద్దేవా చేశారు. గతంలో వైసీపీకి 151 సీట్లు వచ్చినపుడు ఈవీఎంలపై అనుమానం రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు టీడీపీ కూటమికి 164 సీట్లు వచ్చి వైసీపీకి 11 సీట్లు రావడంతో జగన్‌రెడ్డికి మతి భ్రమించి ఏదేదో మాట్లాడుతున్నారని, అలాగే ఇక్కడ కూడా బాలినేనిది అదే పరిస్థితి అని విమర్శించారు.

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఓట్లు లెక్కింపుల్లో ఈవీఎంలపై అనుమానం ఉందంటూ బాలినేని దరఖాస్తు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్లు రూపాయల అవినీతి సొమ్మును సంపాదించి ఇప్పుడు రూ.లక్షలు చెల్లించి మాక్ కౌంటింగ్ కోరితే ఎవరూ భయపడరన్నారు. దీనిని తాము స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే దామచర్ల స్పష్టం చేశారు. తనపై వ్యక్తిగతంగా చేసిన వాఖ్యలు, జీజీహెచ్‌లో చేసిన రౌడీయిజం, బాలినేని అక్రమాల చిట్టా అంతా సిద్ధంగా ఉందని, తాము కూడా బాలినేని పై రూ.25 కోట్లు పరువు నష్టం దావా వేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 19 నుంచి 24లోపు మాక్ పోలింగ్

- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- డమ్మి ఈవీఎంలో బ్యాలెట్ ఏర్పాటు చేసి ఓటింగ్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని 12 పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 12 పోలింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపులో తేడాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించి రూ.5.44లక్షల నగదును కూడా ఎన్నికల కమిషన్‌కు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన 6,26,42,59, 76, 123, 184,192,199,245,256 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలకు మాక్ పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్ పైభాగంలో ఉన్న భవనంలో ఈ మాక్ పోలింగ్ నిర్వహించేందుకు బ్యాలెట్ నమూనాను కూడా ముద్రించనున్నారు. మాజీమంత్రి బాలినేని ఫిర్యాదు చేసిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించి డమ్మి ఈవీఎంలను ఏర్పాటు చేసి అందులో బ్యాలెట్ నమూనాను ఏర్పాటు చేసి మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఆ మాక్ పోలింగ్‌లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్ని ఓట్లు పోలయ్యాయో అన్ని ఓట్ల వరకు పోల్ చేసి లెక్కిస్తారు. అందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమించినవారితోపాటు ఈవీఎంలకు చెందిన బెల్ కంపెనీ ప్రతినిధులు కూడా ఈ మాక్ పోలింగ్‌కు రానున్నారు. ఎన్నికల కమిషన్ ఈనెల 19 నుంచి 24లోపు ఒక తేదీని కేటాయిస్తుంది. ఆ తేదీలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే మాక్ పోలింగ్‌కు సంబంధించి ఇటీవల హైదరాబాద్‌లో ఎన్నికల కమిషన్ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియాతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ హాజరయ్యారు.

పంట ఉత్పత్తి నియంత్రణ పాటించాలి

పొగాకు రైతులకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు విజ్ఞప్తి
పలు కేంద్రాల్లో కొనుగోళ్లు పరిశీలన

ఒంగోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న సీజన్‌లో రైతులు అనుమతి ఇచ్చిన మేరకే పంట సాగు, ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు కోరారు. ఎవరికి వారు ప్రస్తుత ధరలు చూసి ఉత్పత్తి అధికం చేస్తే భవిష్యత్‌లో నష్టపోతారన్నారు. ప్రతి రైతు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. దక్షిణాది వేలం కేంద్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న కొనుగోళ్లను బోర్డు సెక్రటరి దివి వేణుగోపాల్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని టంగుటూరు, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కందుకూరు-2 కేంద్రాలలో వేలం తీరును పరిశీలించారు. బయ్యర్లు, రైతు ప్రతినిధులు, సంబంధిత అధికారులతోనూ మాట్లాడారు. రెండు కేంద్రాల్లోనూ రైతులతో సమావేశాలను నిర్వహించారు. రెండేళ్లుగా అంతర్జాతీయంగా పంట ఉత్పత్తి తగ్గడం, ఇతర సానుకూల పరిస్థితులతో మెరుగైన ధరలు లభించాయన్నారు. వాటిని చూసి పంట ఉత్పత్తి పెంచరాదన్నారు. లేకుంటే వచ్చే సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని హితవు పలికారు. కాగా ప్రస్తుత సీజన్‌లో దక్షిణాదిలోని 11 వేలంకేంద్రాలలో సుమారు 101 మిలియన్ కిలోలు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.254.57 ధర లభించినట్లు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు వివరించారు. వచ్చేనెల 15 నాటికి వేలం ప్రక్రియ పూర్తికావచ్చని తెలిపారు.


టంగుటూరులో పొగాకు వేలం పరిశీలిస్తున్న బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు ఇతర అధికారులు

మద్దిపూడి మండలంలో 54 స్కూళ్లలో ఏకగ్రీవం

మద్దిపూడి, ఆగస్టు 8 : మండలంలోని 54 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రభుత్వ జడ్పీ, గురుకుల పాఠశాలల పేరెంట్స్ కమిటీలకు గురువారం ఎన్నికలు జరిగాయి. మొత్తం 54 స్కూళ్ల కమిటీలకు ఎన్నికలు జరగ్గా అన్ని చోట్లా ఏకగ్రీవంగా కమిటీలు పేరెంట్స్ ఎన్నుకున్నారని ఎంఈవో ఈవీ రంగయ్య తెలిపారు. జువ్విగుంటలోని కేజీబీవీ స్కూల్ పేరెంట్స్ కమిటీ ఛైర్మన్‌గా మెర్సీ, వైస్ ఛైర్మన్‌గా శ్రావణి ఎన్నికయ్యారని స్కూల్ ఎస్‌వో సీతాభాయి తెలిపారు.


జువ్విగుంట కేజీబీవీ స్కూల్ కమిటీ అధ్యక్షురాలికి ఎంపిక పత్రం అందజేస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్

రూ.52.95 లక్షల రికవరీకి చర్యలు

- జిల్లా సహకారశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి

ఒంగోలు(విద్య), ఆగస్టు 8: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లో దుర్వినియోగమైన రూ.52.95 లక్షలు రికవరీకి కలెక్టర్ ఆదేశాలు, సహకార సంఘాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు సహకారశాఖ అధికారి బి.శ్రీనివాస రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 7న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన డీసీఎంఎస్‌లో రూ.52.95లక్షలు గోల్‌మాల్ శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. డీసీఎంఎస్‌లో జరిగిన భారీ కుంభకోణాన్ని మొదట ఆంధ్రజ్యోతి వెలికితీసి వరుస కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలో అప్పటి జిల్లాసహకారాధికారి రాజశేఖర్ విచారణకు ఆదేశించారు. వేగవంతంగా విచారణ చేసి నివేదికను డీసీవోకు సమర్పించారు. ఆ నివేదికపై కలెక్టర్ రిమార్కులతో తగు చర్యలు నిమిత్తం డీసీఎంఎస్ పాలక వర్గానికి పంపించారు. 30 రోజుల్లోపు డీసీఎంఎస్ మహాజన సభ నిర్వహించి ఆ విచారణ నివేదికపై తీర్మానాలు చేసి పంపించాలని, సొసైటీలో నిధులు దుర్వినియోగానికి కారకులుగా తేలిన ముగ్గురిపై కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకొని సర్‌చార్జి ఉత్తర్వులు జారీచేసి నిధులు రికవరి చేస్తామని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

భూకబ్జాకు పాల్పడిన వైసీపీ నేతపై కేసు నమోదు చేయాలి

ఒంగోలు(క్రైం), ఆగస్టు 8: చింతలపాలెంలో దళితుల భూమిని కబ్జా చేసిన వైసీపీ నాయకుడు ఎడ్ల మల్లయ్య ముఠాపై కేసు నమోదు చేయాలని ఎస్పీ దామోదర్‌ను దళిత నాయకులు బాధితులతో గురువారం ఒంగోలులో కలిసి వినతిపత్రం అందజేశారు. తాళ్లూరు మండలం చింతలపాలెంలో దళితులు సాగు చేసుకుంటున్న భూమిని కబ్జా చేసేందుకు పంటపొలాన్ని ట్రాక్టర్లతో దున్ని నష్టం చేశారని ఎస్పీకి వివరించారు. దీనిపై స్థానిక ఎస్ఐకి పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ నేత మల్లయ్య ముఠాపై కేసు నమోదు చేసి, బాధితుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని దళితనాయకులు కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, దారా అంజయ్య, బాధితులు పాల్గొన్నారు.

టోల్ ట్యాక్స్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8: రాష్ట్రంలో టోల్‌ట్యాక్స్ పెట్టాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహ రించుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏపీపీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపరెడ్డి, జిల్లా రీజియన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఫెడరేషన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రహదారులకు టోల్ ట్యాక్స్ నిర్ణయించాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సరైనది కాదన్నారు. రోడ్డు ట్యాక్స్ వేసి ప్రజలపై అధిక భారం మోపే విధానాలను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

విద్యాకమిటీల ఎన్నిక పూర్తి

● అధిక పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులే గెలుపు

● కోరం లేక పలుచోట్ల నిలిచిన ప్రక్రియ


మార్కాపురం బాలికల పాఠశాలలో ఎన్నికైన నూతన కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 8: మార్కాపురం డివిజన్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. టీడీపీ మద్దతుదారులు అత్యధికంగా ఎన్నికయ్యారు. మార్కాపురంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉప విద్యాశాఖాధికారి ఎం.చంద్రమౌళీశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. యాజమాన్య కమిటీ చైర్మన్‌గా ఏడుకొండలు, వైస్ చైర్మన్‌గా ముంతాజ్ బేగం, కో-ఆపరేట్ సభ్యులుగా మురళీ, కప్పగంతుల మధుసూధన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికలలో టీడీపీ మద్దతుదారులు ఎస్‌ఎంసీ ఛైర్మన్‌గా పఠాన్‌నాగూర్, వైస్ ఛైర్మన్‌గా అంకేశ్వరం అంజలి ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఎన్నికల పర్యవేక్షకులు రవిచంద్ర కుమార్, బేబీరాణిలు పాల్గొన్నారు. 8వ వార్డు ముస్లిం ఉర్దూ పాఠశాలలో మొఘల్ షాకీర్ హుస్సేన్ బేగ్, ప్రధానోపాధ్యాయురాలు రఫియా ఆధ్వర్యంలో విద్యాకమిటీ ఎన్నిక నిర్వహించారు. ఛైర్మన్‌గా కాశింబాషా, వైస్‌ఛైర్మన్‌గా షేక్ రుబినాలు ఎన్నికయ్యారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు.

గిద్దలూరు : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఛైర్మన్‌గా సయ్యద్ రసూల్, వైస్‌ఛైర్మన్‌గా పందిటి సమాదానమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాన్షావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాలికల ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్‌గా ఎం.బాలూనాయక్, వైస్ ఛైర్మన్‌గా వి.అన్నపూర్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముండ్లపాడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఛైర్మన్‌గా కంటా ఓబులేసు, వైస్‌ఛైర్మన్‌గా షేక్ పర్వీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణస్వీకార కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడియం శేషగిరి, బొమ్మినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. రాచర్ల మండలం అనుమలవీడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఛైర్మన్‌గా పిల్లి యశోద, వైస్ ఛైర్మన్‌గా పొన్నగంటి ఆంజనేయులు ఎన్నికయ్యారు. బురుజుపల్లి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఛైర్మన్‌గా అరిగెల లక్ష్మీనారాయణ, వైస్‌ఛైర్మన్‌గా పగడాల నాగమ్మ ఎన్నికయ్యారు.

పొదిలి : మండలంలో మొత్తం 70 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 69 పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. అక్కచెరువు డీడబ్ల్యూ ఎస్సీకాలనీలో పాఠశాలలో కోరం లేక ఎన్నిక వాయిదా పడిందని ఎంఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

త్రిపురాంతకం : మండలంలో 63 పాఠశాలల్లో 49 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 48 పాఠశాలల్లో పూర్తయ్యాయి. జి.ఉమ్మడివరం ఎస్సీ పాఠశాలలో కోరం లేక ఎన్నిక నిలిచింది. ఆరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో వెల్లంపల్లి పాఠశాల పాత కమిటీకి కాల పరిమితి పూర్తి కానందున ఎన్నికలు నిర్వహించలేదు. ఏడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. కాగా త్రిపురాంతకం జడ్పీలో ఛైర్మన్‌గా చల్లా హైమావతి, వైస్‌ఛైర్మన్‌గా సిరిగిరి ఏడుకొండలు ఎన్నికయ్యారు. ఎంఈవో మల్లికార్జుననాయక్, ఎంపీడీవో బీవీఎస్ వరప్రసాద్ పలు పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

పెద్దదోర్నాల : మండలంలోని 56 పాఠశాలల్లో పాఠశాలల అభివృద్ధి కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలు గురువారం నిర్వహించారు. మండలంలోని చిలకచెర్ల, చెరువుగూడెం చిన్నదోర్నాల ఎస్సీపాలెం ఎలిమెంటరీ పాఠశాలల్లో, కస్తూరిబా గురుకుల పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవో మస్తాన్‌నాయక్ తెలిపారు. ఆయా పాఠశాలల అభివృద్ధి కమిటీల్లో 90శాతం మంది టీడీపీ మద్దతుదారులు ఎన్నిక కాగా 10శాతం మంది వైసీపీ అనుకూలురు ఎన్నికయ్యారు. దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఛైర్మన్‌గా షేక్ ఖాదర్‌వలి, వైస్ ఛైర్మన్‌గా కే.రాజేశ్వరి, ఎంపీయూపీ పాఠశాలలో షేక్‌హసీనా, సీహెచ్ సంధ్యారాణి, ఎంపీపీ పాఠశాలలో కే.ఇందు, కే.ఎస్.రాజు, ఎలిమెంటరీ పాఠశాలలో నీలూరి గోవిందు, వై.రవణమ్మ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. హసనాబాద్‌లో ఛైర్మన్‌గా పీ.పెద్దిరాజులు, వైస్ ఛైర్మన్‌గా ఎస్.రాజేశ్వరీ, యడవల్లిలో ఛైర్మన్‌గా డీ.సురేష్, వైస్‌ఛైర్మన్ చల్లా శారద, ఎగువ చెర్లోపల్లి మోడల్ స్కూలులో వై.వెంకటేశ్వర్లు, జే.రూతుమేరీలు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నారాయణరెడ్డి, అనూష, వెంకటయ్య, రత్నప్రసాద్, టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, కే.సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, షేక్ ఇస్మాయిల్, బట్టు సుధాకర్ రెడ్డి, ఏర్వ మల్లికార్జునరెడ్డి, జనసేన అధ్యక్షులు కేతి వెంకట మోహన మురళి పాల్గొన్నారు.

కొమరోలు హైస్కూల్ ఛైర్మన్‌గా సుబానీ

కొమరోలు : మండలంలోని 62 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ఎస్‌ఎంసీ ఎన్నికల్లో 46 పాఠశాలలకు ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 5 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. మరో 11 పాఠశాల్లో కోరం లేకపోవడం, సాంకేతిక కారణాలతో ఏన్నికలు నిర్వహించలేదని ఎంఈవో బోర్రా వెంకటరత్నం తెలిపారు. కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా షేక్ మహబూబ్ సుభానీ, వైస్ ఛైర్మన్‌గా కొమరోలు లక్ష్మిదేవీలు ఏకగ్రీవమయ్యారు. ముత్రాసుపల్లిలో పందిళ్ల సరస్వతిని, ఇడమకల్లులో గోపవరం సుధాకర్‌రావును, రెడ్డిచర్లలో షేక్ రఫీ, పోసుపల్లిలో కలగొట్ల చిన్న పీరయ్యను, గుంతపల్లిలో బాలినేని పుల్లనాయుడు, తాటిచర్లలో బొమ్మిని శ్రీనివాసులు, అయ్యావారిపల్లిలో మంగు వెంకటసుబ్బయ్య ఏకగ్రీవమయ్యారు.

నాలుగు పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా

కొమరోలు మండలంలోని బాదినేనిపల్లి, అక్కపల్లి, యర్రగుంట్ల, మిట్టమీదిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల్లో గురువారం నిర్వహించాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీలకు సభ్యులు లేనందున వాయిదాపడింది. ఆయా గ్రామాల్లో రెండు వర్గాలుగా విడిపోయి పాఠశాలల్లో రాజకీయాలు చేయడంతో ఇరువర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంతో ఆయా వర్గాలు ఎవరిప్రయత్నాలు వారిచేసుకున్నారు. పాఠశాల ఛైర్మన్ పదవికోసం ఓ గ్రామంలో రూ.500 నగదు, మద్యం వంటివి విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చి తనకు ఓటు వేయాలని సాదారణ ఎన్నికలను తలపిస్తున్న ఈ విద్యాకమిటి ఎన్నికలను ప్రజలు ఆసక్తిగా ఏమి జరుగుతుంది, ఏ వర్గం గెలుస్తుందని ప్రజలు ఏదురు చూస్తున్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

పెద్దారవీడు : మండలంలో ప్రభుత్వ పాఠశాలలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 59 ఉన్నాయి. వాటిలో 7 పాఠశాలలలో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. 18 పాఠశాలలకు కమిటీ ఛైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా టీడీపీ మద్దతు దారులే. మిగిలిన 34 పాఠశాలలలో ఎన్నికలు జరిగాయి. పలుచోట్ల వైసీపీ మద్దతుదారులు సైతం ఎన్నికయ్యారు. ఎస్‌ఎంసీ ఎన్నికలలో ఎటు వంటి సమస్యలు తలెత్తకుండా ఎంఈవో ఎస్.సుబ్రహ్మణ్యం అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మార్కాపురం రూరల్ : మండలంలో మొత్తం 90 ప్రభుత్వ పాఠశాలలకు గాను 88 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రాందాస్ నాయక్ తెలిపారు. మండలంలో బిరుదలనరవ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, మదరస పాఠశాలలో పేరెంట్స్ హాజరుకోరం లేక వాయిదా పడినట్లు తెలిపారు.


పొదిలిలో ఎన్నికైన కమిటీతో విద్యార్థుల తల్లిదండ్రులు

మిగిలిన అన్ని పాఠశాలలో ప్రశాంత వాతావరణంలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు పూర్తి చేసి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించినట్లు తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ ఎంసీ కమిటీ ఛైర్మన్లగా దరిమడుగు సంపంగుల సుబ్బారావు, రాయవరం కేజీవీవీ దేవండ వెంకటేశ్, పెద్ద యాచవరం యురికిపూడి చంద్రశేఖర్, గజ్జలకొండ జె.కోటేశ్వరరావు, రాయవరం కె.బ్యూలా రాణి, వేములకోట సీహెచ్ సుబ్బారాయుడు, భూపతిపల్లి ఎం.పిచ్చిరెడ్డి, తిప్పాయపాలెం షేక్ బాషా, మిట్టమీదిపల్లి ఏపీ మోడల్ స్కూల్ జి.సుబ్బారా యుడులు ఎన్నికైనట్లు ఎంఈవో తెలిపారు.

పాఠశాలలను సందర్శించిన సీఐ


సూచనలిస్తున్న సీఐ అవుల వెంకటేశ్వర్లు

స్కూల్ మేనేజ్మెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలలను సీఐ అవుల వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి వెళ్లి సందర్శించారు. ప్రశాంత వాతావరణంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిపించాలని ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను కోరారు. మండలంలోని బోడపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఉదయం సందర్శించి ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి సలహాలు, సూచనలిచ్చారు. పాఠశాలలో తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఎర్రగొండపాలెం : మండలంలోని పాఠశాలల యాజమాన్య కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటి ఛైర్మన్‌గా పి.రసూల్‌ఖాన్, వైస్ ఛైర్మన్‌గా సీహెచ్ మెర్సీ అమానిగుడిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా బి.బాలగురవయ్య, వైస్‌ఛైర్మన్‌గా జే.మంగమ్మ, ఎర్రగొండపాలెం జడ్పీఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా షేక్ ఖలీల్, వైస్ ఛైర్మన్‌గా బి.లక్ష్మిదేవి, బోయలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా పి.మల్లికార్జున, వైస్‌ఛైర్మన్‌గా పి.కోటేశ్వరమ్మ, కొలుకుల జడ్పీ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా బి.లక్ష్మయ్య, వైస్ ఛైర్మన్‌గా ఎస్ రిబ్కా, వీరభద్రాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా డి.పెద్దమౌలాలి, వైస్ ఛైర్మన్‌గా ఎం.ఎస్తేరురాణిలు ఎన్నికయ్యారని ఎంఈవో తెలిపారు.

మండలంలోని గంజివారిపల్లె జడ్పీఉన్నత పాఠశాల, మురారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల కమిటీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడ్డాయి. ఎర్రగొండపాలెం వేగినాటి కోటయ్యనగర్ ప్రాథమిక పాఠశాల, నర్సాయపాలెం ఎస్సీ, చెన్నరాయునిపల్లి, గంజివారిపల్లె ప్రాథమిక పాఠశాలలలోఎన్నికలు వాయిదా పడినట్లు తెలిపారు.

కంభం : మండలంలో మొత్తం 50 పాఠశాలలు ఉండగా అందులో రావిపాడు, కంభం పాఠశాలలకు కోర్టు స్టేతో ఎన్నికలు నిర్వహించలేదు. ఒక ఎయిడెడ్ పాఠశాలను మూసివేశారని, అలాగే విద్యార్థులు లేని ఔరంగబాద్, చిన్ననల్లకాల్వ పాఠశాలలను మినహాయించి మిగిలిన 19 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంఈవో మాల్యాద్రి తెలిపారు. మిగిలిన 26 పాఠశాలల్లో నామమాత్రపు ఎన్నికలు జరిగినట్లు తెలిపారు. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కమిటీ ఛైర్మన్‌గా రామారావు, వైస్‌ఛైర్మన్‌గా చిన్నమ్మ, తురిమెళ్ల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఛైర్మన్‌గా మదాసు జ్యోతి, వైస్‌ఛైర్మన్ గొట్టిముక్కల పావని, కందులాపురం మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఛైర్మన్‌గా ఎం.రాజు, వైస్‌ఛైర్మన్‌గా కె.స్వాతి ఎన్నికైనట్లు తెలిపారు.

తర్లుపాడు : మండలంలో మొత్తం 51 పాఠశాలలకు గాను 47 పాఠశాలలు ఎస్‌ఎంసీ ఛైర్మన్లను, కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోరుగుంతలపాడు ప్రాథమిక పాఠశాలలో మాత్రం ఎన్నిక నిర్వహించారు. మూడు పాఠశాలలో కోరం లేక వాయిదా పడింది. నాగెళ్లముడుపు పంచాయతీలోని ఫత్తేపురం, నాగేళ్లముడుపు, మంగళకుంట పంచాయతీలోని నాతనాంపల్లెలో కోరం లేక వాయిదాపడినట్లు ఎంఈవో దేవరకొండ సుజాత తెలిపారు. తర్లుపాడు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వెన్నా రాజారాంరెడ్డి, వైస్‌ఛైర్మన్‌గా కొండబోయిన దుర్గా భవానీ, హిందూ ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా ఫిరోజ్‌ఖాన్, జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా తంగిరాల అనిల్, గానుగపెంట యూపీ స్కూల్ ఛైర్మన్‌గా కొమ్ము శివ, తుమ్మలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా ఎస్‌బీ కమల్ సాహెబ్, తాడిపారిపల్లి జెడ్పీ స్కూల్ ఛైర్మన్‌గా కోలా ప్రకాశం, మీర్జపేట ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా దేశపోగు పోలమ్మ, మీర్జపేట జెడ్పీహెచ్‌ఎస్ ఛైర్మన్‌గా రాజారపు గురవయ్య, చెన్నారెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల ఛైర్మన్‌గా అలుగుపల్లి లీలావతి, తర్లుపాడు ఉర్దూ పాఠశాల ఛైర్మన్‌గా షేక్ కరిముల్లా, తర్లుపాడు గర్ల్స్ హిందూ పాఠశాల ఛైర్మన్‌గా గుణపాటి గురవయ్య, ఎస్సీ పాఠశాల ఛైర్మన్‌గా గుంటు లెజెండ్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. 47 పాఠశాలలలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్‌ఎంసీ ఛైర్మన్‌లను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు విఘ్నేశ్వర్ రెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలంలో మొత్తం 61 పాఠశాలలు ఉండగా, ఆరు పాఠశాలల్లో కోరంలేక వాయిదా పడ్డాయి. మిగిలిన 55 పాఠశాలలకు గాను 53 పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులు విజయం సాధించి ఛైర్మన్‌లను దక్కించుకున్నారు. మండలంలోని మర్రివేములలో రెండు, యండ్రపల్లి, వెంకటరెడ్డిపల్లి, సింగుపల్లి, కుందంపల్లి పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవో శ్యామూల్ జార్జీ తెలిపారు. అయితే మర్రివేముల మెయిన్ స్కూల్‌లో వైసీపీ కుయుక్తులతో పాఠశాల ఛైర్మన్ దక్కించుకోవడానికి చేసిన ప్రయత్నాలతో అక్కడ హైడ్రామా కొనసాగింది. చివరకు అక్కడ ఎన్నికలు వాయిదా పడ్డాయి.









పుల్లలచెరువు, తర్లుపాడులో ఎన్నికైన కమిటీలు, కంభంలో ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ, దోర్నాలలో ఎన్నికైన నూతన కమిటీతో టీడీపీ నేతలు

అవీ..ఇవీ..

అదనపు బోగీల ఏర్పాటు

గిద్దలూరు, ఆగస్టు 8 : గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వెళ్లే 17261/17262 ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 21వ తేదీ వరకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా 2 జనరల్ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు.

పిచ్చిమొక్కల తొలగింపునకు శ్రీకారం


పనులు ప్రారంభిస్తున్న కమిషనర్

పొదిలి, ఆగస్టు 8 : పట్టణంలో పిచ్చిమొక్కలు తొలగింపునకు నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని చర్చి సమీపంలో కాలువల్లో, రహదారులకు అడ్డుగా ఉన్న చిల్లచెట్లను తొలగిస్తున్నారు. కార్యక్రమంలో నగరపంచాయతీ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ

పెద్ద దోర్నాల, ఆగస్టు 8 : దోర్నాలలోని ముస్లిం మైనార్టీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్యకేంద్రంలో గురువారం రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. పేదలకు సేవచేసే భాగ్యం కలిగినందులకు సంతోషిస్తు న్నామని, మరిన్ని సేవలు చేయనున్నట్లు సమితి అధ్యక్షులు పూలబాబు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బషీర్‌ఖాన్, షేక్ సుబాన్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో జిల్లాను అభివృద్ధి చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 8: జిల్లాను విద్యారంగంలో అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ అన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్‌స్థాయి సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించిందని, ఆ జిల్లాలోని పశ్చిమ ప్రకాశం మరీ వెనుకబడి ఉందన్నారు. వెంటనే మార్కాపురం మెడికల్ కాలేజీని పూర్తి చేయాలన్నారు. మార్కాపురంలో సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌వీకేపీ కళాశాలను పునఃప్రారంభించాలన్నారు. ప్రభుత్వ పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగమయ్య వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో నాగదేవతలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 8: మండలంలోని బోడపాడు గ్రామంలో నాగమయ్య ఆలయంలో గురువారం వార్షికోత్సవం సందర్భంగా నాగదేవతలకు వైభవంగా పూజా, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్థులు నిర్వహించారు. నాగమయ్య వార్షికోత్సవం సందర్భంగా గుడిలో నాగదేవతలకు తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పుష్పాలంకరణతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. బోడపాడు గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై నాగదేవతలకు కాయకర్పూరం కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా నాగమయ్య గుడికి వచ్చిన భక్తులకు గ్రామస్థులు భారీఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, యువకులు, గ్రామస్థులు, చిన్నపిల్లలు సైతం అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు.

కౌలురైతు కార్డులు పంపిణీ చేయండి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 8 : మండలంలోని గ్రామాల్లో వీఆర్వోలు, వీఏఏలు పర్యటించి కౌలురైతులను గుర్తించి ప్రతి కౌలు రైతుకు కౌలు కార్డులు పంపిణీ చేయాలని తహసీల్దారు ఎం.హరిబాబు కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలకు, వీఏఏలకు గురువారం సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కే.శేషారెడ్డి మాట్లాడుతూ కౌలుకు పొలం తీసుకొని పంటలు వేసే ప్రతిరైతు కౌలుకార్డు తీసుకొని పంటలు సాగు చేసి ప్రభుత్వ రాయితీలు పొందాలని అన్నారు. పొలం కౌలుకు తీసుకొని కౌలు కార్డు పొందిన కౌలురైతుకు సాగుచేసిన పంటల మీద మాత్రమే హక్కు ఉంటుందన్నారు. భూమిపై ఎలాంటి హక్కు ఉండదన్నారు. కౌలుకార్డులు ఉన్న రైతులకు మాత్రమే పంటనమోదు, పంటనష్టపరిహారం, పంటలబీమా వర్తిస్తుందని తెలిపారు. కౌలు రైతులు, కౌలు కార్డులు లేకుండా పంటలు సాగుచేస్తున్న రైతులకు ఎటువంటి భరోసా ఉండదని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు భాస్కర్, ఏఈవోలు, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 8 : వివిధ అంశాలపై ఆటోడ్రైవర్లకు రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పించారు. రోడ్డు పక్కన పార్కింగ్ చేసే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుం డా చూసుకోవాలని, రోడ్డు అంచులను పూర్తిగా దిగి మాత్రమే ఆటోలను ఆపుకోవాలన్నారు. అతివేగం పనికిరాదని ఆర్‌టీవో అమర్‌నాయక్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావులు ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉన్న స్థలాల్లో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలన్నారు. రోడ్ల మీద వాహనాలు ఆపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి ఎక్కించుకుంటే కేసులు తప్పవని హెచ్చరించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

కంభం, ఆగస్టు 8 : కౌలురైతులకు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా ఇవ్వాలని, ప్రతిరోజు తమ గ్రామపరిధిలో కనీసం పదిమందికి కార్డులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి స్వరూప తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. కంభం మండలంలో మొత్తం 1023 కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. సాగుభూమిని ఆధారంగా చేసుకోవాలన్నారు. ఆగస్టు 31వ తేదీలోపు లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఖరీఫ్ కాలం ప్రారంభమైందని, పంట వేసిన రైతులకు ఈ-పంట నమోదును ఇప్పటినుంచే ప్రతిరోజు చేయాల్సిందిగా ఆమె సూచించారు. కార్యక్రమంలో కంభం మండల తహసీల్దార్ కిరణ్, ఆర్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

● భర్త, అత్తల వేధింపులే కారణం

ఎర్రగొండపాలెం, ఆగస్టు 8 : భర్త, అత్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గోళ్లవీడపి గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని గోళ్లవీడపి గ్రామానికి చెందిన సంద్రపాటి దేవదాస్‌కు దొనకొండ మండల కోచ్చర్లకోట గ్రామానికి చెందిన సరళ(23)తో 3 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసున్న ఒక కుమారుడు ఉన్నాడు. అత్త, భర్త తిట్టారని గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటిలోపల గదిలోకి వెళ్లి చీరతో ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సరళ ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన సమయంలో భర్త దేవదాస్ ఇంటిలో ఉన్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం పోలీసు స్టేషన్‌కు సమచారం అందడంతో సీఐ రాములు నాయక్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనపై సరళ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆవులకు చికిత్స

గిద్దలూరు, ఆగస్టు 8 : కబేళాలకు అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకుని అధికారులకు అప్పగించిన బీజేపీ నాయకులు వాటి ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ తీసుకుంటున్నారు. విజయవాడ నుంచి హిందూపురం వరకు ఒక లారీలో 60 ఆవులను అక్రమంగా తీసుకుని వెళుతుండగా స్థానిక బీజేపీ నాయకులు అడ్డుకుని అధికారులకు అప్పగించిన విషయం విధితమే. గురువారం మార్కెట్‌యార్డు ఆవరణలోని ఆవుల వద్దకు బీజేపీ నాయకులు వెళ్లారు. వాటిలో రెండు ఆవులు అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తించి వెంటనే పశువైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఎ.ఉదయ్ శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు దహనం

పొదిలి, ఆగస్టు 8 : ఇంటి ముందు నిలిపి ఉన్న రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన పట్టణంలోని తూర్పుపాలెంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకొంది. బాధితుడు మున్నా చెప్పిన వివరాల ప్రకారం ఇంటి ముందు వాహనాలు నిలిపి రోజుమాదిరిగానే రాత్రి పడుకున్నామన్నారు. అర్ధరాత్రి ఇంట్లోకి పొగలు వ్యాపించడంతో తలుపులు తీసి చూశానన్నారు. ద్విచక్రవాహనాలు కాలిపోతున్నట్లు గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పక్కనే ఉన్న నీళ్ల ట్యాంకులో నీటితో మండలు ఆర్పినట్లు మున్నా చెప్పారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతి


మృతి చెందిన జింకలను పరిశీలిస్తున్న సీఐ ఎస్ఐలు

పొదిలి, ఆగస్టు 8 : మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. అయితే విధి నిర్వహణలో భాగంగా పొదిలి సీఐ, ఎస్ఐ మల్లికార్జునరావు, కోటయ్యలు ఒంగోలు నుండి వస్తున్న సమయంలో రోడ్డుపై మృతి చెంది ఉన్న జింకలను చూశారు. అక్కడే తమ వాహనాన్ని ఆపుకొని వచ్చిపోయే వాహనాలు జింకలను తొక్కకుండా ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. జింకలను రోడ్డుపై నుండి పక్కకు తొలగించి ఫారెస్ట్ అధికారులు వచ్చేంత వరకు అక్కడే ఉన్నారు. అటవీశాఖ అధికారులు మృతి చెందిన జింకలను తీసుకెళ్లిన తరువాత పొదిలికి చేరుకున్నారు. రోడ్డుపై వాహనాలు తోలే సమయంలో మూగజీవాలను చూసుకుంటూ జాగ్రత్తగా వెళ్లాలని ఆయన సూచించారు.

ఏ1 గ్లోబల్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్


క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రతినిధులు

మార్కాపురం, ఆగస్టు 8: స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎక్సెల్ ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను పలు విధాలుగా ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి జయవర్మ మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరం ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించేందుకు ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే అదనపు నైపుణ్యాలు తప్పక అవసరం అన్నారు. ఆ దిశగా విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మీర్జా మసూద్ అలీబేగ్, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ లత, సీఎస్ఈ హెచ్‌వోడీ షేక్ మహ్మద్ రఫీ, డీన్ శివకుమార్, మీరావలి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ఎర్రగొండపాలెం, ఆగస్టు 8 : జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గోళ్లవీడపి గ్రామంలో గురువారం చోటుచేసుకొంది గ్రామానికి చెందిన పోలు అచ్చేశ్వరరావు (19) ఇంటిలో ఉరివేసుకొని మృతిచెందాడు. అచ్చేశ్వరరావు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చదువు సక్రమంగా రాక పోవడం, పొలం పనులు చేత కాకపోవడంతో జీవితంపై విరకిచెంది, తాను చనిపోతున్నట్లు తన అన్న సెల్‌పోన్‌కు మెసేజ్ పంపి, ఇంటిలో ఎవరిలేని సమయంలో మధ్యాహ్నం ఉరివేసుకొని మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఎర్రగొండపాలెం సీఐ రాములు నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు తండ్రి కోటయ్య ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేశారు.

అభివృద్ధి ప్రదాత వేగినాటి కోటయ్య : ఎరిక్షన్‌బాబు

అమానిగుడిపాడులో విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 8 : నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ఎర్రగొండపాలెం సమితి మాజీ అధ్యక్షులు దివంగత వేగినాటి కోటయ్య చేసిన అభివృద్ధి పథకాలు ప్రత్యక్షంగా కన్పిస్తున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో గురువారం అభివృద్ధి ప్రదాత కోటయ్య విగ్రహన్ని, మండల విద్యాశాఖ మాజీ అధికారి వడ్లమూడి వెంకట సుబ్బయ్య విగ్రహలను ఎరిక్షన్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల పాటు సమితి అధ్యక్షులుగా ప్రజలకు కోటయ్య చేసిన సేవలు ఎనలేనివన్నారు. వేగినాటి కోటయ్య సేవలకు గుర్తింపుగా ఎర్రగొండపాలేనికి ఏ ప్రభుత్వం ప్రాజెక్టును మంజూరు చేసినా ఆయన ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. జగన్మోహన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల రాక్షస పాలన చేశాడన్నారు. దీంతో ప్రజలు టీడీపీకి ప్రజలు పట్టంకట్టారని అన్నారు. వేగినాటి కోటయ్య, వడ్లమూడి వెంకట సుబ్బయ్యల విగ్రహాలను ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోటయ్య తనయుడు వేగినాటి శ్రీనివాస్, వెంకట సుబ్బయ్య కుమారుడు సురేష్, రాష్ట్ర కాకతీయ కమ్మసేవాసమితి కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ ముఖ్యనాయకులు చిట్యాల వెంగళరెడ్డి, గోళ్ల సుబ్బారావు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, చీదెళ్ల నాగేశ్వరరావు, తోట మహేష్, పాలడుగు వెంకటకోటయ్య, షేక్ ఇస్మాయిల్, జాగర్లమూడి గాలెయ్య, టీడీపీ కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.


ర్యాలీగా వెళుతున్న టీడీపీ శ్రేణులు



విద్యుత్‌ఉపకేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

విద్యుత్ ఉపకేంద్రానికి స్థల పరిశీలన

తాళ్లూరు, ఆగస్టు 8: మండలంలోని శివరాంపురం గ్రామ శివారున 133/32 విద్యుత్ ఉపకేంద్రానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని బదలాయింపు నిమిత్తం ఒంగోలు ఆర్డీవో ఎం.సుబ్బారెడ్డి గురువారం పరిశీలించారు. గత ప్రభుత్వం 2020 సంవత్సరంలో తూర్పుగంగవరం- చీమకుర్తి మార్గంలో గల 307/3, 307/5లోగల 3.64 ఎకరాల బండిబాట పోరం బోకు భూమిని కేటాయించారు. ఆభూమి బదలాయింపు నిమిత్తం రికార్డులను, భూమి స్వరూపాన్ని స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శింగారావు, డీటీ ప్రశాంత్, విలేజ్ సర్వేయర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ అమలుతీరుపై సర్వే

వెలిగండ్ల, ఆగస్టు 8: గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)విభాగం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ అమలు తీరుపై పల్స్ సర్వేకు ప్రభుత్వం ఆదేశించిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం వెలిగండ్ల మండల పరిషత్ కార్యలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9 నుంచి 14 వరకు ఇంటింటికి వెళ్లి కుళాయిలు ఉన్నాయా.. లేవా, నీరు వస్తుందా.. లేదా అనే వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పల్స్ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఓడీఎఫ్ ప్లస్ సర్వేను కూడా త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, సచివాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పామూరు, ఆగస్టు 8: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో పి.పుట్టారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తూర్పువీధిలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారాలు వేయవద్దన్నారు.

నిరుద్యోగులను దగా చేస్తున్న ప్రభుత్వాలు

కనిగిరి, ఆగస్టు 8: నిరుద్యోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిండా మోసం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకుడు పీవీ శేషయ్య ధ్వజమెత్తారు. స్థానిక ఎంఎస్ఎం, ఎంఎస్ఆర్, విజేత, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న విధానాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ నిరుద్యోగులను తీవ్రంగా మోసగించారని మండిపడ్డారు. ప్రజలందరూ ఎన్నికల ఫలితాలపై దృష్టి సారించిన సమయంలో నీట్ పరీక్షా ఫలితాలు పదిరోజులు ముందుగానే ప్రకటించి తమ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకున్నారన్నారు. నీట్ ఫలితాల్లో 67 మంది టాపర్స్‌గా రావడం ఎలా సాధ్యమన్నారు. పాలకులు చేస్తున్న తప్పుడు విధానాలకు స్వస్తి చేప్పేలా నిరుద్యోగులు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు.

ఇండ్లచెరువు రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

దొనకొండ, ఆగస్టు 8: మండలంలోని ఇండ్లచెరువు రేషన్‌షాపును ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామ్‌నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేశారు. సరుకులో వ్యత్యాసం ఉండటంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు సమాచారం. గ్రామంలో మిగిలిన లబ్ధిదారులకు రేషన్‌బియ్యం పంపిణీ నిమిత్తం సరుకును వీఆర్వోకు అప్పగించినట్లు తెలిసింది.

దుర్గా చెన్నమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, ఆగస్టు 8: మండలంలోని జమ్మలమడక గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదుర్గా చెన్నమల్లేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబసభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ, నాగిరెడ్డి, సూదిదే వర అంజయ్య, గొంది వెంకట అప్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గా చెన్నమల్లేశ్వర స్వామి

నలుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు, ఆగస్టు 8: మండలంలోని బొప్పూడివారిపాలెంలో పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందటంతో గురువారం ఎస్ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. వారినుంచి రూ.10,830 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

దొనకొండపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ
- పరిశ్రమల పార్క్, విమానాశ్రయం పరిశీలన



దొనకొండ విమానాశ్రయాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

దొనకొండ, ఆగస్టు 8: దొనకొండలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. దొనకొండలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటైన చిన్నతరహా పరిశ్రమల పార్కును, బ్రిటీష్‌కాలంలో ఏర్పాటైన విమానాశ్రయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. దొనకొండలో ఏపీఐఐసీకి ఎంత భూమి కేటాయించారు, చిన్నతరహా పరిశ్రమల పార్క్‌లో ఎన్ని ప్లాట్లు వేశారు, పరిశ్రమల ఏర్పాటుకు నీటి సౌకర్యం, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు ఉన్నాయా అని అధికారులను ప్రశ్నించారు. పది కిలోమీటర్ల దూరంలో సాగర్ కెనాల్ ఉందని కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. అలాగే, 30 కిలోమీటర్ల దూరంలో వెలిగొండ ప్రాజెక్టు ఉందని మ్యాపు ద్వారా వివరించారు. ఆక్రమణలు ఉన్నాయని ఆర్డీవో తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎంపిక చేసే భూముల్లో ఆక్రమణలు లేకుండా చర్యలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. రైలు, రహదారి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్రిటీష్ కాలంలో ఏర్పాటైన విమానాశ్రయం భవనం, చుట్టూ ఉన్న భూమి హద్దులను పరిశీలించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జేసీ పేర్కొన్నారు. దొనకొండలోని విమానాశ్రయం ప్రభుత్వం దృష్టిలో ఉండటంతో పరిశీలించేందుకు వచ్చినట్టు చెప్పారు. విమానాశ్రయానికి 136 ఎకరాల భూమి ఉందని, అదనంగా 340 ఎకరాల భూమిని గుర్తించినట్టు ఆర్డీవో జాన్‌ఇర్విన్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, వీఆర్వో తన్నీరు హరినారాయణ, సర్వేయర్లు మస్తాన్‌వలి, సీహెచ్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టౌన్‌గా దర్శిని అభివృద్ధి చేస్తాం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 8: దర్శి నగర పంచాయతీని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణంలోని 12వ వార్డులో నిర్మించే సీసీ రోడ్లకు గురువారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి పథకాల అమలుకు ఇప్పటికే కోట్లాది రూపాయలు మంజూరు చేయటం ఆనందదాయకమన్నారు.

దర్శి నగర పంచాయతీలోని ప్రజలకు ఇంటింటికి కొళాయిని అమృత పథకం ద్వారా ఏర్పాటుచేస్తామని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. ఏడాదిన్నర క్రితం నిధులు మంజూరైనప్పటికీ వైసీపీ పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. అమృత పథకం పనులను త్వరలో ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ తలారి కోటయ్య, కౌన్సిలర్లు వీసీ రెడ్డి, నక్కా రంగా, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా నాగులారం రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధ్వానంగా ఉన్న నాగులారం రోడ్డు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 8: సీఎస్‌పురం మండలం చింతపూడు నాగులారం రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కంభంపాడు గ్రామ సమీపం జాతీయ రహదారి నుంచి వీరభద్ర వీరాంజనేయస్వామి దేవస్థానం, నాగులారం వరకు సరైన రోడ్డు మార్గంలేదు. వారంలో మంగళవారం, శనివారం వందలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. జాతీయ రహదారి నుంచి సీ నాగులారం గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ వరకు మట్టి రోడ్డు ఉన్నప్పటికీ పలుచోట్ల గుంతలు పడ్డాయి. దేవస్థానానికి భక్తులు మొక్కులు చెల్లించుకొనేందుకు, పొంగళ్లు పెట్టుకొనేందుకు ట్రాక్టర్లు, ఆటోల్లో వస్తుంటారు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

గ్రామీణ ప్రాంత రోడ్ల అ భివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. గతంలో పలుమార్లు రోడ్డు దుస్థితి గురించి గ్రామస్థులు తెలిపినా పట్టించుకొన్న నాథుడే లేడు. ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డి గెలుపొందడంతో గ్రామస్థుల్లో తారు రోడ్డు నిర్మాణంపై ఆశలు ఏర్పడ్డాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి తమ ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.

త్వరలో పూరిమెట్ల ఉన్నత పాఠశాలకు స్థల కేటాయింపు

ముండ్లమూరు, ఆగస్టు 8: మండలంలోని పూరిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మూడు ఎకరాలు భూమిని కేటాయించనున్నట్టు ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి అన్నారు. ఇందుకుసంబంధించి త్వరితగతిన రికార్డులు తయారుచేయాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణను ఆదేశించారు. గురువారం పూరిమెట్ల ఉన్నత పాఠశాలను సందర్శించి హెచ్ఎం ప్రమోద్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్థులతో చర్చించారు. సర్వే నెంబరు 64/5, 6, 7, 10లో ఉన్న మూడు ఎకరాలు స్థలాన్ని గతంలో ఇళ్ళ స్థలాల కోసం కేటాయించి లబ్ది దారులకు అందజేశారు. లబ్ధిదారులు ఆ స్థలం తమకు వద్దని, గ్రామంలో ఉన్నత పాఠశాలకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయటంతో ఆర్డీవో సుబ్బారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. వెంటనే రికార్డులు పరిశీలించి పాఠశాలకు కేటాయించాలని ఆదేశించారు. విద్యార్థులకు సరైన భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామస్థులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి తెలియ జేయటం మంచి పరిణామమన్నారు. పెద ఉల్లగల్లులో 33/11కేవీ సబ్ స్టేషన్ మంజూరు కావటంతో ప్రభుత్వ స్థలమైన 270/3లో ఉన్న ఎకరం స్థలాన్ని ఆర్డీవో సుబ్బారెడ్డి పరిశీలించారు. స్థలానికి సంబంధించిన రికార్డులను పూర్తి చేసి విద్యుత్ శాఖ అధికారులకు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మండలంలో అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ కౌలు కార్డులను అందజేయాలని వీఏఏ, వీఆర్‌వోలను ఆర్డీవో ఆదేశించారు. గురువారం ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, పెదఉల్లగల్లు సచివాలయాలను సందర్శించారు. పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ పుల్లారెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

భూ అక్రమాలపై చర్యలకు వెనకాడొద్దు!

కనిగిరి, ఆగస్టు 8: భూ అక్రమాలపై, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవటంలో ఏమాత్రం వెనకాడవద్దని ఆర్డీవో జాన్‌ఇర్విన్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం డివిజన్‌స్థాయి తహసీల్దార్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాల్లో జరిగిన భూ అక్రమాలు, కబ్జాలు, ఆన్‌లైన్ లోపాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో క్షేత్రస్థాయి గ్రామాల వీఆర్వోలతో సమావేశాలు ఏర్పాటుచేసి రైతులు, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ అక్రమాలపై వెంటనే స్పందించి నిజాలు తేల్చాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు అశోక్‌రెడ్డి, ఉయ్యాల పుల్లారావు, రమణారావు, జ్వాలా నరసింహం, ఆవుల సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్శి సీఐగా రామారావు



రామారావు

దర్శి ఆగస్టు 8: దర్శి సీఐగా వై.రామారావు నియమితులయ్యారు. గుంటూరు రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న రామారావును దర్శి సీఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్త ర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ షేక్ షమీముల్లా ఎన్నికల సమయంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈనేపథ్యంలో ఆయన్ను బదిలీ చేసి రామారావును నియమించారు.

పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొననున్న సాయిహరిప్రవీణ్



సాయిహరిప్రవీణ్

దర్శి ఆగస్టు 8: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లా నుంచి ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు దర్శికి చెందిన సాయిహరిప్రవీణ్‌కు అవకాశం లభించింది. ఎన్ఎస్ఎస్ విభాగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించే సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొన్న హరిప్రవీణ్‌ను గుర్తించి వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

దర్శి ఆగస్టు 8: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో డీలర్లు గురువారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ నాయకులు దేవతి ప్రసాద్, ఎస్‌పీవీ సుబ్బారావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. వాహనాల కొనుగోలులో వేలాది రూపాయలు కొల్లగొట్టి దోచుకున్నారని ఆరోపించారు. ఎండీయూలకు, వాహనాలకు వేలాది కోట్లు ఖర్చు చేసి ప్రజాసొమ్మును దుర్వినియోగం చేశారని విమర్శించారు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని నిర్ణయించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రేషన్ వ్యవస్థ పటిష్టంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, ఆగస్టు 8: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి మండంలోని రేషన్ డీలర్లు పాలాభిషేకం చేశారు. ఎండీయూ ఆపరేటర్లను తొలగించటంతో పాటు వాహనాలను తీసివేసి గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగానే పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వటంతో డీలర్లు పాలభిషేకం చేశారు.

కార్యక్రమంలో కనిగిరి డివిజన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దేవతి వరప్రసాద్, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగసూరి సుబ్బయ్య, వీరపనేని నాగేశ్వరరావు, మిత్తింటి ఏసుశెట్టి, కాసా అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ బద్రి గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూలో కొత్త కోర్సులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 8: ఆంధ్రకేసరి యూనివర్శిటీ (ఏకేయూ)లో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచేలా కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ మూర్తి తెలిపారు. గురువారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో బీఈడీ కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ళతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కోర్సులకు కళాశాలలు కూడా తగు విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. జాతీయ నూతన విద్యావిధానం, డిజిటల్ మూల్యాంకాన్ని ప్రోత్సహిస్తున్నందున యూనివర్శిటీలో కూడా డిజిటల్ మూల్యాంకనం ప్రవేశపెడుతున్నట్లు మూర్తి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థుల రికార్డులు డిజిటలైజేషన్ మూల్యాంకనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డీన్ డి.వెం కటేశ్వరరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, సీఈ కేవీఎస్.రాజు, ఎస్ఈ పద్మజ, ప్రిన్సి పాల్ జి.రాజమోహన్, డీవోఏ సోమశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, బీఈడీ కళాశాల ప్రతినిధులు వై.వెంకటేశ్వర రావు, కె.గుండారెడ్డి, మార్పు గ్రెగోరి, చంద్ర రావు, రమణారెడ్డి, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



తాళ్లూరు: మాధవరం పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నికైన స్కూల్ కమిటీ సభ్యులను అభినందిస్తున్న టీడీపీ ఎంపీపీ తాటికొండ

కురిచేడు, ఆగస్టు 8: మండలంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 60 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా, 59చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పడమర గంగవరం పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎస్ఎంసీ చైర్మన్‌లుగా టీడీపీ సానుభూతి పరులు ఎన్నికయినట్టు సమాచారం. కురిచేడులోని వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా తెల్లమేకల మల్లికార్జున్, కస్తూర్బా బాలికల పాఠశాల చైర్మన్‌గా నక్కా సుబ్బలక్ష్మమ్మ ఎన్నికయ్యారు. దేకనకొండ జడ్పీ ఉన్నత పా ఠశాల చైర్మన్‌గా వెలగపూడి సుబ్బారావు, కురిచేడు బాలికల ఉన్నత పాఠశాల చైర్మన్‌గా కమతం రమణ ఎన్నికయ్యారు. పడమర కాశీపురం జనరల్ పాఠశాలలో సాయంత్రం వరకూ ఎన్నికల హడావుడి జరిగి గ్రామస్థ ఏకాభిప్రాయంతో పూర్తయింది. పడమర గంగవరం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా జరగడంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు తమవంతు పాత్ర పోషించినట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు.

మిట్టపాలెం పాఠశాల కమిటీ చైర్మన్‌గా నరసయ్య

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 8: సీఎస్‌పురం మండలంలో గురువారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో మొత్తం 67 పాఠశాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి తెలిపారు. మిట్టపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యా కమిటి చైర్మన్‌గా కాలువ నరసయ్య వైస్‌చైర్మన్‌గా చలువాది కవిత ఎన్నిక కావడంతో గ్రామస్థులు అభినందించారు.

పామూరు విద్యా కమిటీ చైర్మన్‌గా కొండలరావు

పామూరు, ఆగస్టు 8: మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని 87 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో - 1 సుబ్బారావు తెలిపారు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా గుత్తి కొండలరావు, వైస్ చైర్మన్‌గా లక్ష్మి ఎన్నికయ్యారు. బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా చల్లా ప్రమీల, కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా యర్రసింగ్ శ్రీనివాస్, చిలంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా గంధం పిచ్చయ్య ఎన్నికయ్యారు. పామూరులోని కేజీబీవీ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్‌గా సీహెచ్ సునీత, వైస్ చైర్మన్‌గా అనంతుక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రిన్సిపాల్ కటకం సజన తెలిపారు.

టీడీపీ మద్దతుదారుల విజయం

పీసీపల్లి, ఆగస్టు 8: పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు విజయం సాధించారు. మండలంలో 56 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 55చోట్ల టీడీపీ మద్ధతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఎన్నిక కోసం బుధవారం రాత్రిక ఇరుపార్టీల మద్ధతుదారులు పోటాపోటీగా ఓటు హక్కు కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమకు మద్దతు తెలపాలంటూ ప్రచారం చేశారు. అయితే, టీడీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



కనిగిరి ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

వెలిగండ్లలో ఏకగ్రీవం

వెలిగండ్ల, ఆగస్టు 8: మండలంలో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏఎస్ఐ శివ బందోబస్తు ఏర్పాటుచేశారు. మండలంలో మొత్తం 66 పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నూతనంగా ఎన్నికైన కమిటీలను పాఠశాలల సిబ్బంది, నాయకులు, గ్రామస్థులు అభినందించారు.

దొనకొండలో ఏడుచోట్ల నిలిచిన ఎన్నికలు

దొనకొండ, ఆగస్టు 8: మండలంలో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 70 ప్రభుత్వ పాఠశాలలకుగాను 63 పాఠశాలల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. వద్దిపాడు, నర్సింహనాయునిపాలెం(జనరల్), సంగాపురం(ఏప), మల్లంపేట(బీసీ), వల్లపునేనిపల్లి(ఎస్సీ) ప్రాథమిక పాఠశాలలు, తెల్లబాడు, మల్లంపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వివిధ కారణాలతో ఎన్నికలు నిలిచిపోయాయని ఎంఈవో సాంబశివరావు తెలిపారు. దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్‌గా పొడతరపు భూలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికకావటంతో పాఠశాల సిబ్బందితో పాటు గ్రామస్థులు అభినందించారు.

దర్శిలో 76చోట్ల ఏకగ్రీవం

దర్శి, ఆగస్టు 8: మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 85 పాఠశాలలు ఉండగా, 76 చోట్ల ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకున్నారు. చందలూరు, పోతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలకు ఇంకా సమయం ఉండటంతో ఎన్నికలు నిర్వహించలేదు. తానంచింతల, దేవవరం, చందలూరు, లింగన్నపాలెం పాఠశాలల్లో కోరం లేక వాయిదా పడ్డాయి. దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాల, లక్ష్మీపురం పాఠశాలల్లో ఎన్నికల ద్వారా కమిటీలను ఎన్నుకున్నారు. 90 శాతానికిపైగా కమిటీల్లో టీడీపీ సానుభూతిపరులు ఎన్నికైనట్లు సమాచారం.

63 పాఠశాలలకు ఏకగ్రీవం

ముండ్లమూరు, ఆగస్టు 8: మండలంలోని 68 పాఠశాలలకు గాను 63 చోట్ల విద్యాకమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎంఈవోలు ఎస్.సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఐదుచోట్ల కోరం లేక ఆగిపోయినట్టు వారు తెలిపారు ముండ్లమూరు ఏపీ మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా వీరపనేని రాంబాబు, ముండ్లమూరు జడ్పీ పాఠశాల చైర్మన్‌గా చొక్క శేషయ్య, మారెళ్ళ పాఠశాల చైర్మన్‌గా పూరిమెట్ల యల్లయ్య ఎన్నికయ్యారు. సుంకరవారిపాలెం, చినఉల్లగల్లు, పులిపాడు తండా, పలుకురాళ్ళ తండా, రెడ్డినగర్‌లలో కోరం లేక ఎన్నికలు జరగలేదని ఎంఈవోలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నాలుగు పాఠశాలల్లో ఆగిన ఎన్నికలు

తాళ్లూరు, ఆగస్టు 8: మండలంలో 47 పాఠశాలలకుగాను 43 చోట్ల ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తూర్పుగంగవరం, శివరాంపురం జిల్లా పరిషత్ హైస్కూళ్లు, తురకపాలెం యూపీ స్కూల్, శివరాంపురం ఏప పాఠశాలలో కోరం లేక వాయిదా పడ్డాయి. అన్నిచోట్ల టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మాధవరం యూపీ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ పదవిని కాంగ్రెస్, వైసీపీ నేతలు దక్కించుకున్నారు. ఈ పర్యాయం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు టీడీపీ శ్రేణులను ఐకమత్యంగా ముందుకు తీసుకెళ్లడంతో పాఠశాల యాజమాన్య కమిటీని మొదటిసారి దక్కించుకుంది. తాళ్లూరులో గల ఆరు పాఠశాలల కమిటీల్లో టీడీపీ యువనేత ఐ.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ మద్దతుదారులు ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. ఎస్సై కె.విజయకుమార్ అన్ని గ్రామాల్లో తిరిగి ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా శాంతి భద్రతలు పర్యవేక్షించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ఎంఈవోలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకార్‌రావులు సజావుగా నిర్వహించారు.


కనిగిరిలో మూడుచోట్ల పోటీ

కనిగిరి, ఆగస్టు 8: కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గురువారం పాఠశాలల విద్యాకమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మూడునాలుగు చోట్ల తప్ప మిగతా పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవమయ్యాయి. కనిగిరి మండలంలో 85 ప్రాథమిక, 14 ప్రాథమికోన్నత, 15 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 114 పాఠశాలల్లో 111 చోట్ల ఏకగ్రీవంగా కమిటీలు ఎన్నికయ్యాయి. ప్రభుత్వ మోడల్‌స్కూల్, ప్రభుత్వ బాలికల హైస్కూల్, తుమ్మకుంట ఎంపీయూపీ స్కూల్‌లో పోటీ అనివార్యమైంది.


కనిగిరి ప్రభుత్వ బాలికల హై స్కూల్‌లో ఇద్దరు పోటీపడగా ఉయ్యూరి కోటేశ్వరి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కాకొల్లు నారాయణరావు ఎన్నికయ్యారు. ఎన్నికాధికారిణిగా హెచ్ఎం కలవ విజయలక్ష్మి వ్యవహరించారు. కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను మున్సిపల్ చైర్మన్ గఫార్ అభినందించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 9 ఆగస్టు 2024




నాగార్జున సాగర్ 26 గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతూ జాలువారుతున్న నీరు

కనువిందు.. కలవరం


రేపల్లె: పెనుమూడి కృష్ణానదికి చేరిన వరదనీరు


కొల్లూరు: గండి వద్ద పోసిన ఇసుక, కట్ట నుంచి లీకు అవుతున్న వరద నీరు


కొల్లూరు: గాజుల్లంక వద్ద ఇటుక బట్టీలను ముంచెత్తిన వరద నీరు


నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి


సెల్ఫీలతో సందడి చేస్తున్న పర్యాటకులు

ముంపు.. ముప్పు

రేపల్లె, కొల్లూరు, ఆగస్టు 8: కృష్ణానదికి వరద పోటెత్తటంతో కరకట్ట వెంబడి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. అంతకంతకు ప్రవాహ ఉధృతి పెరుగుతూ వస్తుండటంతో లంకలు, తీర ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో కృష్ణానదీ పరివాహక ప్రాంత ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేస్తూ వస్తోంది. గురువారం రేపల్లె మండలం పెనుమూడికి వరదనీరు పోటెత్తింది. మూడు మెట్లు నీటమునిగాయి. మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చుకుని వలలను భద్రం చేసుకుంటున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద 50 గేట్లు ఎత్తి సుమారు 3 లక్షల క్యూసెక్కులు దిగువకు వదలడంతో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో చేపల వేటకు మత్స్యకారులు వెళ్ళరాదని అధికారులు సూచించారు. రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి, మైనేనివారిపాలెం, మోర్తోట, గంగడిపాలెం, రాజుకాల్వ, లంకేవానిదిబ్బ, లక్ష్మీపురం గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ కూడా నది తీరానికి వెళ్లరాదని హెచ్చరికలు జారీచేశారు. కరకట్ట వెంబడి ఉన్న గృహాలవారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని, ఇబ్బందులు ఉంటే తక్షణమే రెవెన్యూ సిబ్బందికి తెలపాలని సూచించారు. వరద ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో కరకట్ట పటిష్టతపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొల్లూరు మండలంలోని అరవిందవారధి, గాజుల్లంక, పోతార్లంక, జువ్వలపాలెం పుష్కర ఘాట్‌లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. గాజుల్లంక వద్ద చిన్నరేవు నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో పల్లపు ప్రాంతాల్లో వాణిజ్య పంటలు, ఇటుక బట్టీలు ముంపునకు గురయ్యాయి. కల్లాల్లో ఉన్న ఇటుక తయారీ ముడిసరుకు ఊక, ప్లైయాష్ వరద నీటిలో కొట్టుకుపోయాయి. చిన్నరేవులో వరద నీరు మెల్లమెల్లగా ప్రాంతాలను ముంచెత్తుతూ పరుగులు తీస్తుంది. ఈ ప్రవాహం దోనేపూడి కరకట్ట దిగువన ఉన్న పోతార్లంక లోలెవల్ చప్టాపై నుంచి వెళ్లే అవకాశాలు ఉండటంతో కొన్ని గంటల్లో ఆ రహదారిపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. గాజుల్లంక, పోతార్లంక మధ్య నది అంచులు బలహీనంగా ఉండటంతో వరదనీరు సీపేజ్ అయి పొలాలను ముంచెత్తుతోంది. వరద ఉధృతి 4 లక్షలకు పైగా పెరిగితే రహదారులపై కూడా నీరు ప్రవహించే సూచనలు కనిపిస్తున్నాయి. వరద ఉధృతి కొనసాగు తుండటంతో రేపల్లె ఆర్డీవో హేలాషారోన్ లంక గ్రామా ల్లో గురువారం పర్యటించారు. కొల్లూరు మండలం జు వ్వలపాలెం, పోతార్లంక, గాజుల్లంక, పెసర్లంక తదితర లంక గ్రామాల్లో ముంపు ప్రాంతాలను పరిశీలించి ప్రజల రాకపోకల కోసం పడవలు ఏర్పాటు చే యాలని అధికారులకు సూచించారు. పోతార్లంక వద్ద మత్స్యకారులతో మాట్లాడారు. రావిలంకలో చిక్కుకుపోయిన రెవెన్యూ, పంచాయితీ సిబ్బందిని మరబో టు సహాయంతో తీసుకువచ్చా రు. అరవింద వారధి ఎగు వన గండికి అడ్డుగా పోసిన కట్ట మూడున్నర లక్షల వరద నీరు వరకు తట్టుకుంటుందని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆర్డీవోకు తెలిపారు. నదిలోకి ఎవరూ దిగకుండా చూడాలని, రేవుల వద్ద ఉన్న పోలీసు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆర్డీవో వెంట కొల్లూరు ఎంపీడీవో లక్ష్మీకుమారి, డీటీ నిరంజన్, ఆర్ఐ త్రివేణి, ఈవోపీఆర్డీ రవి తదితరులు ఉన్నారు.

- కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు
- సాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- ప్రాజెక్టుల వద్దకు పోటెత్తుతోన్న పర్యాటకులు
- అంతకంతకూ పెరుగుతోన్న ప్రవాహ ఉధృతి
- పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతున్న వరద నీరు
- సుమారు 3 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి
- తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు
- వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకుంటున్న మత్స్యకారులు

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. సాగర్ నుంచి సాగరం దిశగా పరుగులు పెడుతోంది. వరద ప్రవాహ ఉధృతి అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. నాగార్జున సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని గేట్లు తెరిచి దిగువకు నీటిని వదిలేస్తుండగా ఆ ప్రవాహ సోయగాలను చూసేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. నాగార్జున సాగర్ 26 గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను పర్యాటకులు కనులారా తిలకించి సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణమ్మ ప్రవాహాన్ని తిలకించేందుకు కూడా జనం పోటీ పడ్డారు. కృష్ణమ్మ వరద ఉధృతి గురువారం కూడా కొనసాగడంతో తీర ప్రాంత ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ముంపు ప్రాంతాలను కృష్ణమ్మ ముంచేస్తోంది. బ్యారేజీ దిగువన లంక గ్రామాల ప్రజలు కృష్ణమ్మ ఉధృతి ఎప్పటికి తగ్గుతుందోనని ఎదురుచూస్తున్నారు.

వీపీసౌత్, మాచర్ల రూరల్, అచ్చంపేట, తాడేపల్లి టౌన్/ నరసరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ కనువిందు చేస్తోంది. నాగార్జున సాగర్ జలాశయం 26 క్రస్ట్ గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను పర్యాటకులు కనులారా తిలకిస్తున్నారు. పాల నురగలా స్పీల్ వే గుండా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ జలాశయానికి భారీగా వరద కొనసాగుతోంది. దీంతో గురువారం అన్ని గేట్లు తెరుచుకున్నాయి. డ్యాంకు వస్తున్న నీటిని వస్తున్నట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. 26 క్రస్ట్ గేట్ల తెరచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,67,906 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కుడి కాల్వ ద్వారా 8144, ఎడమ కాల్వ ద్వారా 8193, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,501, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 మొత్తం ఔట్‌ఫ్లోగా 3,14,544 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,94,683 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.40 అడుగలకు చేరింది. నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 295.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 2,54,698 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుండగా ఆరు గేట్ల ద్వారా 2,42,601 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 12వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది.

ప్రకాశం బ్యారేజి వద్దకు భారీగా వరద

ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజి వద్దకు వచ్చి చేరుతోంది. పులిచింతల నుంచి 2 లక్ష 56 వేలు, కీసర వాగు నుంచి 54 వేల క్యూసెక్కులు మొత్తం 3 లక్షల 10 వేల క్యూసెక్కుల వరద నీరు గురువారం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 7 అడుగులు, 10 గేట్లను 8 అడుగులు ఎత్తి దిగువకు 2 లక్ష 96 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 13వేల 800 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలిపారు. కాగా గురువారం అర్ధరాత్రికి వరద ఉధృతి స్వల్పంగా తగ్గే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి రైతులు, మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


పులిచింతల ప్రాజెక్టు నుంచి పరవళ్లు తొక్కుతున్న వరదనీరు


ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

విద్యుత్‌శాఖ హెల్ప్‌లైన్ సెంటర్‌లు

గుంటూరు: విస్తృతంగా వర్షాలు, వరదల నేపథ్యంలో విద్యుత్‌శాఖ అప్రమత్తమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదు డివిజన్లలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ తెలిపారు. విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా, తెగిపడిన విద్యుత్ తీగెలు వంటి సమస్యలపై గుంటూరు సర్కిల్ కార్యాలయంలో 9440817526, గుంటూరు టౌన్-1 డివిజన్ కార్యాలయం 9440817527, తెనాలి డివిజన్ 9440817535, బాపట్ల డివిజన్ 9491052945, నరసరావుపేట డివిజన్ 9440817539, మాచర్ల 9440817531 లకు ఫోన్లు చేసి సమాచారం అందించాలన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు తడిచిన ఇనుప స్తంభాలను తాకకుండా దూరంగా ఉండాలన్నారు. తెగిపడిన విద్యుత్ తీగెలకు దూరంగా ఉండాలని సూచించారు.

- జిల్లాలో 1409 పాఠశాలలకు నియామకం
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతం


అద్దంకి టౌన్ సత్రం బడి యూపీ స్కూల్‌కు ఎన్నికైన ఎస్ఎంసీ

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లకు ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 1444 పాఠశాలలు ఉండగా 1409 పాఠశాలలకు ఎస్ఎంసీల ఎన్నిక జరిగింది. మిగిలిన 35 స్కూళ్లకు రెండు చోట్ల కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. 11 స్కూళ్లలో జీరో అడ్మిషన్ల వల్ల కమిటీల ఎన్నిక సాధ్యపడకపోగా 22 ఎయిడెడ్ స్కూళ్లలో ఎన్నిక జరగలేదు. వీటిలో మూడు స్కూళ్లకు సంబంధించి గతంలోనే ఈ కమిటీలకు సంబంధించి కోర్టుమెట్లు ఎక్కాయి. కమిటీలు ఎన్నుకున్న 1409 పాఠశాలల్లో ప్రైమరీ 1085 ఉండగా, అప్పర్ ప్రైమరీ 113, హైస్కూల్స్ 211 ఉన్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి పాఠశాలల దగ్గర గురువారం ఉదయం నుంచే సందడి కనిపించింది. ఆయా పాఠశాలల్లో ఎన్నికలకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఓటు హక్కు కల్పించారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యుల ఎంపికను పూర్తిచేసి వారంతా కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎన్నుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమిటీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆయా మండలాల్లోని రెవెన్యూ విభాగం ఈ ఎన్నికలను పర్యవేక్షించింది. ఎక్కువ సభ్యులున్న పాఠశాలల్లో ఎన్నిక నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు రక్షణ ఏర్పాటుచేశారు

పిట్టలవానిపాలెం మండలంలోనే...

కోరం లేక కమిటీ ఎన్నిక వాయిదా పడిన రెండు స్కూళ్ల పిట్టలవానిపాలెం మండల పరిధిలోనే ఉన్నాయి. వాటిలో ఒకటి పీవీపాలెం ప్రభుత్వ హైస్కూల్ కాగా, మరొకటి కేఆర్‌ఆర్‌పాలెం ప్రైమరీ పాఠశాల. చెరుకుపల్లి మండల పరిధిలోని నడింపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నిక కోరం లేకపోయినా జరిపించారని టీడీపీ నాయకులు ఆరోపించారు. అక్కడ హెచ్ఎం లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా కమిటీ ఎన్నికైనట్లు ప్రకటించి వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని టీడీపీ ఆరోపిస్తోంది.

- విత్తనాలు, ఎరువుల నాణ్యతపై నిర్లక్ష్యం
- ఎరువుల్లో 97 శ్యాంపిల్స్‌కి తీసింది 15 మాత్రమే
- వ్యవసాయశాఖ లక్ష్యంలో 40 శాతం కూడా లేదు

నమూనాల సేకరణ.. నామమాత్రమే

గుంటూరు సిటీ, ఆగస్టు 8: రైతులకు మేలు జరగాలంటే తొలుత చేయాల్సింది విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల్లో నకిలీలను అరికట్టాలి. నాణ్యమైన విత్తనాలు సకాలంలో రైతుకు అందితే దిగుబడి ఆశాజనకంగా ఉండి రైతులకు లబ్ధి జరుగుతుంది. ఇందుకు వ్యవసాయశాఖ చేయాల్సింది. ఆయా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నమూనాల ను ఎక్కడికక్కడ సేకరించి నాణ్యతను నిర్ధారించి రైతుల ను అప్రమత్తం చేయాలి. కానీ ఖరీఫ్ సీజన్ సగం దాటుతున్నా వ్యవసాయశాఖ నిద్ర మేలుకోలేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల్లో నకిలీలను నిగ్గుతేల్చే నమూనాల సేకరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఏడాది లక్ష్యంలో కనీసం 40శాతం అన్నా ఈ పాటికి పూర్తికావాల్సి ఉండగా నమూనాల సేకరణ సంఖ్య నామమాత్రంగానే కనిపిస్తుంది. ఎరువుల్లో ఏడాదికి 213 నమూనాలు సేకరించాలి. మే, జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో 97 నమూనాలు సేకరించాల్సి ఉండగా, ఇప్పటికి కేవలం 15 మాత్రమే తీశారు. పురుగుమందులు సుమారు 195 నమూనాలు సేకరించాల్సి ఉండగా, ఇప్పటికి కేవలం 30 మాత్రమే సేకరించారు. బహిరంగ మార్కెట్‌లో రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు నాణ్యమైనవో, నకిలీవో తేలాలంటే నమూనాల సేకరణ జరగాలి. అది కూడా వ్యాపారస్థలంలోనే జరగాలి. గతంలో సుమారు 400 నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపగా వాటిల్లో 40 శ్యాంపిల్స్ విఫలమయ్యాయి. వారిలో కొంతమందిపై కేసులు నమోదు చేసి కోర్టు కు పంపారు.

ఎన్ని నమూనాలు తీస్తే అంత మంచిది

రైతులకు మేలు జరగాలంటే విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల నమూనాలు ఎక్కువ సేకరించి ల్యాబ్‌కు పంపాలని నిపుణులు చెబుతున్నారు. దానివల్ల నకిలీలను అరికట్టే అవకాశం ఎక్కువ ఉంటుందంటున్నారు. అసలు నమూనాలు తీయకపోవడం నకిలీలు అమ్మే వారికి తోడ్పడట మే అని చెబుతున్నారు. ఎరువుల్లోని మైక్రో న్యూట్రీట్స్, మ్యాక్రో న్యూట్రీట్స్‌లో నమూనాలు సేకరించాలి. మిక్సర్ ఫర్టిలైజర్స్‌గా పేర్కొనే ఎరువుల్లో ఎక్కువ నకిలీలు వచ్చే అవకాశం ఉన్నందున వాటిల్లో సుమారు 90 నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలి. గతంలో మైక్రో న్యూట్రీట్స్, మ్యాక్రో న్యూట్రీట్స్ నమూనాల్లో కొన్ని విఫలమైనట్లు తెలుస్తోంది. ఇప్పుడు అసలు ఆ నమూనాల జోలికి అధికారులు వెళ్లలేదని తెలుస్తోంది.

విత్తనాల్లో ఫెయిల్యూర్ ఎక్కువ

గత ఏడాది విత్తనాలకు సంబంధించి 241 శ్యాంపిల్స్ తీస్తే అందులో నాలుగు విఫలమయ్యాయి. గుంటూరు ఆటోనగర్‌లోని ఓ విత్తన కంపెనీకి చెందిన మిర్చి, మరో రెండు కంపెనీల పత్తి విత్తనాలు విఫలమయ్యాయి. పురుగుమందుల నమూనాలు కూడా గత ఏడాది 175కు 135 తీశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల శ్యాంపిల్స్ తీసే విషయంలో అర్బన్ పరిధిలోని అధికారుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యవసాయ శాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించి అధికారులకు పలు సూచనలు చేశారు. మొదట్లో కొంత హడావుడి చేశారు. ఆ తర్వాత కాడి పూర్తిగా కిందేశారు. ఇప్పటికైనా అధికారులు నమూనాలు సేకరిస్తే రానున్న రోజుల్లో అయినా రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటోంది.







రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

- 30 మందికి పోస్టింగ్స్ ఇస్తూ ఐజీ ఉత్తర్వులు

గుంటూరు, ఆగస్టు 8: గుంటూరు రేంజిలో మరోసారి భారీగా సీఐలను బదిలీ చేశారు. 30 మంది సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులకు గురై వీఆర్‌లో ఉండి కనీసం జీతాలు అందక ఇబ్బందులు పడిన సీఐలకు ఎట్టకేలకు పోస్టింగ్‌లు దక్కాయి. బదిలీ అయిన ఆయా సీఐల వివరాలు..

పేరు	ప్రస్తుతం	బదిలీ
టీపీ నారాయణస్వామి	కారంపూడి	పెదకాకాని
గంగా వెంకటేశ్వర్లు	వీఆర్	తుళ్లూరు -1
బెల్లం శ్రీనివాసరావు	వీఆర్	తెనాలి రూరల్
దాసరి ప్రసాద్	గిద్దలూరు	గురజాల టౌన్
పీ ప్రభాకర్	వీఆర్	మాచర్ల టౌన్
షేక్ నఫీజ్‌బాష	కందుకూరు	మాచర్ల రూరల్
టీవీ శ్రీనివాసరావు	కోవూరు	కారంపూడి
ఆర్ అహ్మద్‌జానీ	ఎస్‌బీ-2 నెల్లూరు	బాపట్ల టౌన్
కే గంగాధర్‌రావు	ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ తిరుపతి	బాపట్ల రూరల్
షేక్ అన్వర్‌బాష	కొత్తపేట గుంటూరు	నెల్లూరు 4వ పట్టణం
ఎం రోశయ్య	సౌత్ ట్రాఫిక్, నెల్లూరు	నెల్లూరు ఫోర్త్ టౌన్
జీ గంగాధర్‌రావు	వీఆర్	ఆత్మకూరు
కే వాసు	కమాండ్ కంట్రోల్, తిరుపతి	తాడికొండ
మాకినేని శ్రీనివాసరావు	డీటీసీ, ఒంగోలు	అమరావతి
వై రామారావు	వీఆర్	దర్శి
కే సురేష్	మాచర్ల రూరల్	గిద్దలూరు
జే రామకోటయ్య	కంభం	గిద్దలూరు
ఎండీ ఫిరోజ్	కలిగిరి	కావలి 1 టౌన్
కేశవ వెంకటేశ్వరరావు	కంట్రోల్ రూమ్, ఒంగోలు	కందుకూరు
జీ మంగారావు	పెదకూరపాడు	గుడ్లూరు
వై వీరసోమయ్య	గిద్దలూరు	పాత గుంటూరు
కే శేఖర్‌బాబు	వీఆర్	గూడూరు 1 టౌన్
హెచ్ఎస్ హుస్సేన్‌బాష	సైబర్ క్రైమ్, నెల్లూరు	వాకాడు
ఎం బాబి	నెల్లూరు 2 టౌన్	నాయుడుపేట
మాకినేని మురళీకృష్ణ	వీఆర్	సూళ్లూరుపేట
జీ సోమశేఖర్	చీరాల 2 టౌన్	కొండేపి
ఏవీ శివప్రసాద్	కంట్రోల్ రూమ్, గుంటూరు	లాలాపేట, గుంటూరు
కే వేమారెడ్డి	మహిళా పీఎస్, గుంటూరు	సంగం
ఎం వీరయ్య	వీఆర్	కొత్తపేట, గుంటూరు
ఎస్ శ్రీకాంత్‌బాబు	వీఆర్	ఒంగోలు రూరల్ సర్కిల్

నలుగురు డీఎస్పీలకు స్థానచలనం

రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేశారు. గుంటూరు పశ్చిమ డీఎస్పీ కేవీ మహేష్‌ను అనంతపురం జిల్లా హిందూపురానికి బదిలీ చేశారు. సీఐడీలో ఉన్న వీవీ రమణకుమార్‌ను నెల్లూరు జిల్లా గూడూరు సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్ లో ఉన్న గోగినేని రామాంజనేయులును బాపట్ల సబ్ డివిజన్‌కు నియమించారు. బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను సీఐడీ విభాగానికి బదిలీ చేశారు.

ఆరోపణలు.. పోస్టింగ్‌లు

గత వైసీపీ ప్రభుత్వంలో గోగినేని రామాంజనేయులుకు సంబంధం లేని కేసులో సస్పెండ్ చేసి వేధించారు. ఐదేళ్ల ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా మానసిక ఇబ్బందులకు గురి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. అప్పటి నుంచి వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు తాజాగా పోస్టింగ్ దక్కింది. ఇక అనంతపురం జిల్లా హిందూపురం సబ్ డివిజన్‌కు బదిలీ అయిన కేవీ మహేష్, నెల్లూరు జిల్లా గూడూరు సబ్ డివిజన్‌కు నియమితులైన వీవీ రమణకుమార్‌లపై పలు ఆరోపణలు ఉన్నాయి. పైగా వారు గత ప్రభుత్వంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్లు ముద్రపడినా తాజాగా కూటమి ప్రభుత్వంలో పోస్టింగ్‌లు సంపాదించినట్లు పోలీస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సాగర్ నీటితో నింపుతాం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కల్పన
- మంత్రి గొట్టిపాటి

అద్దంకి, ఆగస్టు 8 : గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సాగర్ నీటితో నింపుతామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం అద్దంకిలో పలు కార్య క్రమాలకు హాజరైన రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో గుండ్లకమ్మ రిజర్వాయర్ పూర్తి నిర్లక్షానికి గురైందని, గేట్లు కూడా కొట్టుకుపోయి 3 సంవత్సరాలు అయినా ఏర్పాటు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యుద్ధప్రాతిపదిక మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు లేనందున సాగర్ డ్యామ్ నుంచి విడుదలయ్యే నీటితో 1.6 టీఎంసీలను నిల్వ చేస్తారన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వసతుల కల్పన

అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి రవికుమార్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంత్రి రవికుమార్ పరిశీలించారు. ఒకేషనల్ స్టూడెంట్స్‌కు కంప్యూటర్ ల్యాబ్‌లో 10 కంప్యూటర్‌లు అవసరమని, విద్యార్థులకు డైనింగ్ హాల్, సరిపడా డ్యూయల్ డెస్కులు కావాలని, ఆటస్థలానికి అడ్డంగా ఉన్న పాత భవనాలు, మట్టి తొలగించేలా చేయాలని ప్రిన్సిపాల్ రాజేశ్వరి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.


విద్యార్థులు రూపొందించిన పోస్టర్లతో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనరావు

మాదకద్రవ్యాలతో అనర్థాలు

- పోస్టర్ల తయారీపై పోటీ

అద్దంకి, ఆగస్టు 8 : మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియజెప్పే విధంగా విద్యార్థులు పోస్టర్‌లు తయారు చేయడం అభినందనీయమని కేఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనరావు అన్నారు. శింగరకొండ వద్ద ఉన్న కేఆర్‌కే ప్రభుత్వ డి గ్రీ కళాశాలలో ఎన్‌సీసీ 1, 2 విభాగాలు, యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో గురువారం మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పోస్టర్‌లు తయారీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి ఎం.పూజిత, ద్వితీయ బహుమతి పి.సురేష్ పొందారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిత, రాజశేఖర్, ప్రసాద్, రామకృష్ణ, సురేష్‌కుమార్, అశోక్‌కుమార్, శిఖామణి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఏలూరికి సమస్యలు విన్నవిస్తున్న అనంతవరం మహిళలు

హామీలన్నీ నెరవేరుస్తాం

- అన్నదాతలకు అండగా ఉంటాం
- ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఆగస్టు 8 : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందని ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏలూరి ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తప్పకుండా అమలుచేస్తామన్నారు. జగన్‌రెడ్డి నాశనం చేసిన వ్యవస్థలను గాడిలో పెడుతూనే మరోపక్క పారదర్శక పాలనను అందిస్తామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తానన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఏలూరి హామీ ఇచ్చారు. కాలువల ద్వారా రైతులకు సాగర్ నీటిని అందిస్తామన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు, నాయకులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యేని కలిసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్

మార్టూరు, ఆగస్టు 8 : ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంప్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును గురువారం రాత్రి మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని, చట్టప్రకారం అందరికీ న్యాయం చేయాలని, జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే విధంగా కృషి చేయాలని ఇంకా తదితర సమస్యలపై శేషగిరిరావుకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఆయన వెంట కోనంకి టీడీపీ నాయకులు కోటపాటి సురేష్ పాల్గొన్నారు.

యువకులు వ్యాపారాలపై మొగ్గుచూపాలి

మేదరమెట్ల, ఆగస్టు 8 : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వినూత్న ఆలోచనలతో యువకులు వ్యాపారాలు సాగించేందుకు మొగ్గుచూపాలని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆయన గురువారం మేదరమెట్లలో వ్యాపార దుకాణాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారరంగంలో నూతన పద్ధతులను పాటించాలన్నారు. వ్యాపారంరంగంలో పెట్టుబడులు ప్రధానం కాదన్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలను సాధించే వ్యాపారాలపై దృష్టి సారించాలన్నారు. ఆర్థిక క్రమశిక్షణతోనే ఉన్నతస్థాయికి చేరగలరని మంత్రి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

దూకుడు పెంచిన ఎస్పీ

- నిన్న తర్లుపాడు ఎస్సై వీఆర్‌కు
- మొన్న త్రిపురాంతకం సీఐ, కురిచేడు ఎస్ఐ కూడా..
- ఆకతాయిలు, మృగాళ్లకు ముకుతాడు
- సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట
- సిట్ దర్యాప్తు కోసం ఎదురుచూపులు
- ఇంకా కొన్ని చిక్కుముడి వీడని పాత కేసులు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ ఏఆర్.దామోదర్ పాలనాపర విధానంలో దూకుడు పెంచారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై వేటు వేసేందుకు వెనుకాడటం లేదు. అదేసమయంలో రౌడీయిజం చేసేవారికి తన పోలీసు మార్కు ట్రీట్‌మెంట్ ఇవ్వడంలో వెనకాడటం లేదు. కేసుల నమోదు విషయంలో జాప్యం చేసిన వారిపైనా చర్యలు చేపట్టారు. త్రిపురాంతకం సీఐ, కురిచేడు ఎస్సైలను మొన్న వీఆర్‌కు పిలిపించారు. నిన్న విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తర్లుపాడు ఎస్ఐని వీఆర్‌కు పిలిపించి ఏఆర్‌కు అటాచ్ చేశారు. అదేసమయంలో సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అలాగే ఒంగోలు నగరంలో రౌడీయిజం చేస్తున్న వారిపైనా దృష్టి పెట్టారు.


పోకిరీల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 8 : పాలనాపరంగా ఎస్పీ దామోదర్ దూకుడు పెంచారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై వేటు వేసేందుకు వెనుకడుగు వేయడం లేదు. బుధవారం సెట్ కాన్ఫరెన్స్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తర్లుపాడు ఎస్ఐని ఆగమేఘాల మీద వీఆర్‌కు పిలిచి ఏఆర్‌కు అటాచ్‌మెంట్ ఇచ్చారు. అదేవిధంగా కేసులు నమోదు విషయంలో జాప్యం చేసినందుకు కురిచేడు ఎస్ఐ, పర్యవేక్షణలోపం ఉందని త్రిపురాంతకం సీఐలను వీఆర్‌కు పిలిచారు. కురిచేడు పొలాలలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించిన వారి గురించి మీడియాలో వచ్చినప్పటికి పోలీసు అధికారుల నుంచి స్పందన లేదని, అక్కడ పనిచేస్తున్న స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సరైన సమాచారం సేకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు వచ్చి చెప్పినా పట్టించుకోలేదని తెలిసింది. ఆ నేపథ్యంలోనే ఎస్సై, సీఐలపై చర్యలు తీసుకున్నారు. ఇలా అధికారుల నిర్లక్ష్యంపై అత్యంత వేగంగా ఎస్పీ చర్యలు తీసుకోవడంతో శాఖ ఉలికిపాటుకు గురవుతోంది.

పోకిరీలు, ఆకతాయిలకు ముకుతాడు

ఆకతాయిలు, పోకిరీలపై ప్రధానంగా దృష్టిపెట్టిన ఎస్పీ తనదైన శైలిలో బుద్ధి చెబుతున్నారు. ఒంగోలులో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలపై ఆయన స్పందించిన తీరు నగర ప్రజలకు స్వాంతన కలిగించింది. మహిళ పోలీసుస్టేషన్ తనిఖీకి ఎస్పీ వెళ్ళిన సమయంలో అక్కడ ఓ బాలిక తల్లి ఆవేదనను వినిపించింది. తమ కుమార్తె పెంపుడు కుక్కను బయటకు తీసుకెళుతుండగా, ఆకతాయి బైక్‌పై వచ్చి అసభ్యంగా ప్రవర్తిచడంతోపాటుగా ఇదేమిటి అని ప్రశ్నించిన తన భర్తపై దాడి చేశారని మొరపెట్టుకుంది. దీంతో స్పందించిన ఎస్పీ ఆకతాయిపై కేసు నమోదు చేయడమే కాకుండా కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు. రౌడీషీట్ తెరవమని ఆదేశించారు. అదేక్రమంలో స్థానిక ఎన్‌జీఓ కాలనీలో నూడిల్స్ కోసం వెళుతున్న బాలిక పట్ల ఇరువురు యువకులు అసభ్యంగా ప్రవర్తించడం పట్ల ఎస్పీ తీవ్రంగా స్పందించారు. స్వయంగా ఘటన స్థలానికి వెళ్లి ఆ ప్రాంత వాసులకు భరోసా కల్పించి, ఇరువురు పోకిరీలకు తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలు, చిన్నపిల్లలను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదు అంటూ హెచ్చరించారు.

సిబ్బంది సక్షేమానికి పెద్దపీట

ఎస్పీ బాధ్యతలు తీసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది సంక్షేమంపై దృష్టిసారించారు. శాఖలో పనిచేస్తున్న వారి పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. అదేసమయంలో నిత్యం విధి నిర్వహణలో పని వత్తిడితో ఉండే సిబ్బందికి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచనలు ఇచ్చారు. ఒంగోలులో వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు.

పరిష్కరించాల్సినవి చాలా...

ఈ నేపథ్యంలో పాత కేసులు దర్యాప్తులో జాప్యం జరగడం, గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు బనాయించిన వారు తమ పరిస్థితి ఏమిటి అనేది ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. భూ వివాదాలలో కూరుకుపోయిన బాధితులు సిట్ ఏర్పాటుతో స్వాంతన లభిస్తుందని ఆశపడితే అది నిరాశగానే మిగిలిన విషయం తెలిసిందే. అలాంటి వారికి న్యాయం చేయలని పలువురు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో అక్రమంగా కేసులు బనాయించి కక్షపూరితంగా రౌడీషీట్లు తెరవడం పట్ల విమర్శలు వచ్చాయి. ఇలాంటి వాటిపై దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిట్ కేసులు దర్యాప్తు జాప్యం

జిల్లాలో గత ప్రభుత్వంలో భూదందాలు విచ్చలవిడిగా జరిగాయి. దీంతో అప్పటిలో ఉన్న ఎస్పీ మలికగర్గ్ భూదందాలపై సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు. అయితే కేసులలో పురోగతి కనిపించలేదు. అంతే కాకుండా దందాలకు మూలకారణమైన వారిపై కేసులు నమోదు చేయడం కానీ, ఒకవేళ చేసినా కనీసం విచారించిన పాపాన పోలేదే. కేవలం జిరాక్స్ తీసినవారు, డాక్యుమెంట్‌లు తయారుచేసిన వారు, సాక్షి సంతకం పెట్టిన వారిని కేసులో అరెస్టు చేశారు. అసలు ఆ భూస్కాంల వలన ఎవరు లబ్ధిపొందారు అనే విషయంలో పోలీసులు ఉదాసీనత ప్రదర్శించారు. వందల ఎకరాలకు నకిలీపత్రాలు సృష్టించిన వారిని తెలిసీ వదిలివేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అండతో దందాలు చేసి కోట్లు కొల్లగొట్టిన వారి జోలికి వెళ్లలేదు. పైగా సిట్ ఏర్పాటు పోలీసు అధికారులకు సిరులు పంట కురిపించిందనే ఆరోపణలు వచ్చాయి. తెలియక భూములు కొని మోసపోయిన అమాయకులనే పోలీసులు మళ్లీ వేధించారనే విమర్శలు వచ్చాయి. ఇప్పటికైయినా భూదందాలకు పాల్పడిన వారిపై దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్‌లో అనేక కేసులు

పాత కేసులు అనేకం పోలీసు స్టేషన్‌లో పెండింగ్ ఉన్నాయి. అక్రమంగా కేసులు బనాయించి రౌడీషీట్లు తెరిచిన సందర్భాలు ఉన్నాయి. ఒంగోలులో ఎన్నికలకు సంబంధించి రెండు కేసులలో 150 మందిపై రౌడీషీట్లు తెరిచిన చరిత్ర ఉంది. అమాయికులపై రౌడీషీట్లు తెరవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికి దర్యాప్తు ముందుకు సాగని హత్య కేసులు ఉన్నాయి. ఒంగోలులో బాతుల కాపరి పక్కలో నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారి అదృశ్యం ఇప్పటికి కొలిక్కి రాలేదు. కరవాదిలో వృద్ధురాలను హత్య చేసి బంగారం అపహరించిన కేసు అలాగే ఉంది. పేర్నమిట జీవన్ హత్య కేసులో ఎలాంటి పురోగతి లేదు. ఒంగోలు లో జరిగిన అనేక దొంగతనాలు ఇంతవరకు రికవరీ కాలేదు. ఇలా పాత కేసులలో ఎలాంటి పురోగతి కనిపిచడం లేదు. ఇలాంటి కేసులలో దర్యాప్తు వేగవతం చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతం

- నేతివారిపాలెంలో పోటాపోటీ
- 83 పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా

ఒంగోలు(విద్య), ఆగస్టు 8 : పాఠశాలల యాజమాన్య కమిటీల ఏర్పాటుకు గురువారం పాఠశాలల్లో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల సందర్భంగా సున్నితమైన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినా ఎక్కడ ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. సాయంత్రం ఆరు గంటలకు జిల్లాకేంద్రానికి అందిన సమాచారం మేరకు.. 2,405కుగాను 2,002 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 310 పాఠశాలల్లో చేతులెత్తే విధానంలో సభ్యులను ఎన్నుకున్నారు. 84 పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడగా మరో తొమ్మిది పాఠశాలల్లో వివిధ కారణాలతో నిలిచిపోయాయి. నాలుగు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించి తమ పాఠశాలల్లో ఎన్నికలు జరగకుండా నిలుపుదల చేశారు. ఒంగోలులోని వివేకానంద విద్యావిహార్, కొమరోలులోని ఎస్‌బీఎస్ ఆర్ఎం, కంభం, రావిపాడులోని శ్రీ సత్యనారాయణ అండ్ శ్రీనివాస్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో హైకోర్టు ఉత్తర్వులతో ఎన్నికలు ఆగాయి. కొండపి మండలం నేతివారిపాలెం హైస్కూలులో ఎస్ఎంసీ ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి.

ఎన్నికలు ప్రశాంతం

జిల్లాలో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రాథమిక పాఠశాలల్లో 15 మందిని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 24 మందిని, హైస్కూళ్లలో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లాలో మొత్తం 38 మండలాలకు సాయంత్రం ఆరు గంటలకు 34 మండలాల నుంచి మాత్రమే సమాచారం జిల్లా కేంద్రానికి అందింది. ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అనంతరం మొదట ఎస్ఎంసీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు ఓటర్లలో 50శాతం మంది హాజరు అవసరం. అయితే 84 పాఠశాలల్లో కోరం లేని కారణంగా ప్రధానోపాధ్యాయులు ఎన్నికలను వాయిదా వేశారు.


నేతివారిపాలెంలో ఎన్నిక సందర్భంగా హైస్కూల్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

నేతివారిపాలెంలో పోటాపోటీ

కొండపి మండలం నేతివారిపాలెం ఎస్ఎంసీ ఎన్నిక పోటాపోటీగా జరిగింది. ఇక్కడి ఎస్ఎంసీ ఎన్నిక పంచాయతీ ఎన్నికలను తలపించింది. ఓటర్లకు డబ్బు ప్రలోభాలు పెట్టడంతో భారీమొత్తాలు చేతులు మారాయి. ఇతర గ్రామాలు, సమీప గ్రామాల్లోని పిల్లల తల్లిదండ్రులను రప్పించారు. ఇక్కడ ఓటు రూ.5వేలు పలికినట్లు చెప్పుకుంటున్నారు. ఇక్కడ పోటీ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎన్నికకు చేతులెత్తే పద్ధతిలో నిర్వహించారు. ఎటువంటి అలజడి లేకుండా ఎన్నిక ప్రశాంతంగా జరగడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఒంగోలు మండలంలో మొత్తం 82 పాఠశాలలకుగాను 81 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగినట్లు ఎంఈఓ కిషోర్ బాబు తెలిపారు.

ఒంగోలు డీఎస్పీగా రాయపాటి

- పోలీసు శాఖలో బదిలీల పరంపర
- మరో ఐదుగురు సీఐలకు పోస్టింగ్‌లు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 8: పోలీసు శాఖలో బదిలీల పరంపర కొనసాగుతోంది. నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలీసు అధికారుల బదిలీలు చేపట్టారు. గురువారం మలివిడత బదిలీల పర్వంలో రాష్ట్రంలో 28మంది డీఎస్పీలకు స్థానచలనం కల్పించారు. ఒంగోలు డీఎస్పీగా ప్రస్తుతం శ్రీకాకుళంలో దిశ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రాయపాటి శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చారు. అదే విధంగా ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సీహెచ్.శ్రీనివాసరావును గన్నవరం డీఎస్పీగా నియమించారు. అదేవిధంగా గుంటూరు రేంజిలో 30మంది సీఐలను బదిలీ చేయగా జిల్లాలో ఐదుగురికి పోస్టింగ్ ఇచ్చారు. ఒంగోలు వీఆర్‌లో ఉన్న వై.రామారావును దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె.సురేష్‌ను గిద్దలూరు సీఐగా నియమించారు. ప్రస్తుతం కంభం సీఐగా పనిచేస్తున్న జె.రామకోటయ్యను గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. బాపట్ల జిల్లా చీరాల 2 టౌన్ సీఐగా పనిచేస్తున్న జి.సోమశేఖర్ ను కొండపి సీఐగా , రేంజీ వీఆర్‌లో ఉన్న ఎస్.శ్రీకాంత్ ను ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. గిద్దలూరు సీఐగా పనిచేస్తున్న దాసరి ప్రసాద్‌ను గురజాల టౌన్‌కు, ఒంగోలు డీటీసీలో పనిచేస్తున్న మాకినేని శ్రీనివాసరావును అమరావతి టౌన్‌కు బదిలీ చేశారు. అలాగే రేంజ్ వీఆర్‌లో ఉన్న మాకినేని మురళీకృష్ణను తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. పీసీఆర్‌లో పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును కందుకూరు సర్కిల్‌కు బదిలీచేయగా వై.వీరాస్వామయ్యను గిద్దలూరు టౌన్ నుంచి ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీ చేశారు.

జిల్లాకు సుపరిచితుడు రాయపాటి

ఒంగోలు డీఎస్పీగా నియమితులైన రాయపాటి శ్రీనివాసరావు జిల్లాకు సుపరిచితుడు. జిల్లాలో ఎస్సైగా, సీఐగా అనేక ప్రాంతాలలో పనిచేశారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేశారు. రాయిపాటికి మంచి అధికారిగా పేరు ఉంది. ఆయన నియామకంతో అసాంఘిక శక్తుల గుండెల్లో గుబులు మొదలైంది. వచ్చేవారంలో బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని శ్రీనివాసరావు తెలిపారు.

పంట ఉత్పత్తి నియంత్రణ పాటించాలి

- పొగాకు రైతులకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు విజ్ఞప్తి
- పలు కేంద్రాల్లో కొనుగోళ్లు పరిశీలన

ఒంగోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న సీజన్‌లో రైతులు అనుమతి ఇచ్చిన మేరకే పంట సాగు, ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు కోరారు. ఎవరికి వారు ప్రస్తుత ధరలు చూసి ఉత్పత్తి అధికం చేస్తే భవిష్యత్‌లో నష్టపోతారన్నారు. ప్రతి రైతు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. దక్షిణాది వేలం కేంద్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న కొనుగోళ్లను బోర్డు సెక్రటరి దివి వేణుగోపాల్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని టంగుటూరు, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కందుకూరు-2 కేంద్రాలలో వేలం తీరును పరిశీలించారు. బయ్యర్లు, రైతు ప్రతినిధులు, సంబంధిత అధికారులతోనూ మాట్లాడారు. రెండు కేంద్రాల్లోనూ రైతులతో సమావేశాలను నిర్వహించారు. రెండేళ్లుగా అంతర్జాతీయంగా పంట ఉత్పత్తి తగ్గడం, ఇతర సానుకూల పరిస్థితులతో మెరుగైన ధరలు లభించాయన్నారు. వాటిని చూసి పంట ఉత్పత్తి పెంచరాదన్నారు. లేకుంటే వచ్చే సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని హితవు పలికారు. కాగా ప్రస్తుత సీజన్‌లో దక్షిణాదిలోని 11 వేలంకేంద్రాలలో సుమారు 101 మిలియన్ కిలోలు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.254.57 ధర లభించినట్లు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు వివరించారు. వచ్చేనెల 15 నాటికి వేలం ప్రక్రియ పూర్తికావచ్చని తెలిపారు.



టంగుటూరులో పొగాకు వేలం పరిశీలిస్తున్న బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు ఇతర అధికారులు

బాలినేని అక్రమాల లెక్కలు తేలుస్తాం

- ఈవీఎంల మాక్ కౌంటింగ్‌పై ఎలాంటి అభ్యంతరం లేదు
- ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 8: గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి అడ్డగోలుగా చేసిన అక్రమాలన్నీ లెక్కలు తేలుస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓట్లు లెక్కింపుపై అనుమానంతో బాలినేని చేసుకున్న దరఖాస్తుకు తాము సిద్ధమేనని, రీ మాక్ కౌంటింగ్‌లపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, దానిని స్వాగతిస్తామని చెప్పారు. గురువారం ఒంగోలులోని పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ ఇటీవల బాలినేని చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా సమాధానమిచ్చారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో గంజాయి బ్యాచ్‌ను అడ్డుపెట్టుకుని జీజీహెచ్‌లో చేసిన రౌడీయిజం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళలపై చేసిన దాడులు, టీడీపీ కార్యకర్తలపై పెట్టిన కేసులు, బాలినేని అక్రమాలు, అవినీతిపై అన్ని లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ఇష్టమొచ్చినట్లు నోరుపారేసుకుని పరుష పదజాలంతో మాట్లాడిన బాలినేని ఓట్లు లెక్కింపు రోజు తొలి రౌండ్‌కే ఒంగోలు వదిలి వెళ్ళిపోయిన సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. మరలా నెలతర్వాత ఒంగోలు వచ్చి నోటికొచ్చినట్లు మాట్లాడి వెళ్ళిపోతే ఇక్కడ ఎవరూ భయపడరని దామచర్ల ఎద్దేవా చేశారు. గతంలో వైసీపీకి 151 సీట్లు వచ్చినపుడు ఈవీఎంలపై అనుమానం రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు టీడీపీ కూటమికి 164 సీట్లు వచ్చి వైసీపీకి 11 సీట్లు రావడంతో జగన్‌రెడ్డికి మతి భ్రమించి ఏదేదో మాట్లాడుతున్నారని, అలాగే ఇక్కడ కూడా బాలినేనిది అదే పరిస్థితి అని విమర్శించారు.

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఓట్లు లెక్కింపుల్లో ఈవీఎంలపై అనుమానం ఉందంటూ బాలినేని దరఖాస్తు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్లు రూపాయల అవినీతి సొమ్మును సంపాదించి ఇప్పుడు రూ.లక్షలు చెల్లించి మాక్ కౌంటింగ్ కోరితే ఎవరూ భయపడరన్నారు. దీనిని తాము స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే దామచర్ల స్పష్టం చేశారు. తనపై వ్యక్తిగతంగా చేసిన వాఖ్యలు, జీజీహెచ్‌లో చేసిన రౌడీయిజం, బాలినేని అక్రమాల చిట్టా అంతా సిద్ధంగా ఉందని, తాము కూడా బాలినేని పై రూ.25 కోట్లు పరువు నష్టం దావా వేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

అమ్మఒడి పేరుచెప్పి సైబర్ నేరగాళ్ల వల

- వలంటీర్ నంబర్ నుంచి కాల్
- ఫోన్‌పే నుంచి రూ.22వేల తస్కరణ

పొదిలి, ఆగస్టు 8 : రోజుకో కొత్త మార్గం వెతుక్కునే సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాల లబ్ధిపేరుతో ప్రజలను బోల్తాకొట్టిస్తున్నారు. తాజాగా అమ్మఒడి లబ్ధి పేరుతో వ్యక్తిని మోసం చేసి రూ.22వేలు దోచేశారు. నగరపంచాయతీ పరిధిలోని పిచ్చిరెడ్డితోటకు చెందిన బి.రామకృష్ణకు వలంటీర్ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. మేము సచివాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం. మీకు అందుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి డబ్బులు వచ్చాయా..? అని అడిగారు. దీనికి రామకృష్ణ అన్నీ వచ్చాయని సమాధానం చెప్పాడు. అమ్మఒడి డబ్బులు పడలేదు కదా..! అని అడిగాడు. 'పడలేదు సార్' అని చెప్పాడు. ఇప్పుడు డబ్బులు పడుతున్నాయి ఫోన్‌పే తెరిచి నేను చెప్పినట్లు చేయండని చెప్పాడు. నిజమేనని నమ్మిన రామకృష్ణ అతడు చెప్పినట్లు చేశాడు. దీంతో రామకృష్ణ ఖాతా నుంచి రూ.22వేల పోయినట్లు తెలిపారు. వెంటనే వలంటీర్‌కు ఫోన్ చేసి విషయం తెలుపగా తనను హోల్డ్‌లో పెట్టి సైబర్ నేరగాళ్లు నీతో మాట్లాడారని, తన ఫోన్ ట్రాప్‌చేసి ఇద్దరిని మోసం చేసినట్లు చెప్పాడు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.

గ్రంథాలయంలో సభ్యత్వాలను పెంచాలి

చినగంజాం, ఆగస్టు 8 : శాఖ గ్రంథాలయం, గ్రంథాలయ పరిధిలోని బుక్ డిపాజిట్ కేంద్రాలలో సభ్యత్వాలను పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సూచించారు. శాఖ గ్రంథాలయం చినగంజాంను ఆమె గురువారం రాత్రి సందర్శించి, వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం నాకు ఇష్టం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని గ్రంథపాలకుడు మోహనలక్ష్మీ నరసింహాచార్యులను ఆదేశించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రంథాలయ రికార్డులను ఆమె తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పెదగంజాం, కొత్తపాలెం, మున్నంవారిపాలెం, కడవకుదురు పుస్తక కేంద్ర నిర్వాహకులు కోమట్ల దామోదరరెడ్డి, మరపాల బ్రహ్మానందరెడ్డి, నాయుడు రామాంజనేయులు, కే.శాంతకుమారి పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

భయపెడుతున్న బ్రిడ్జిలు..!

» శిథిలావస్థతో పొంచి ఉన్న ప్రమాదాలు
» వాహనచోదకుల ఆందోళన


అద్దంకి-దర్శి రోడ్డులో శిథిలావస్థకు చేరిన గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జి


గుండ్లకమ్మ బ్రిడ్జి పై పడిపోయిన రెయిలింగ్

అద్దంకి, ఆగస్టు 8 : ప్రధాన రోడ్లలో సైతం బ్రిడ్జిలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అవి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా అంతంత మాత్రంగా ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్లలోని బ్రిడ్జిలు సైతం మరింత ప్రమాదకరంగా మారాయి. అద్దంకి - దర్శి రోడ్డులో అద్దంకి పట్టణానికి సమీపంలో గుండ్లకమ్మ నదిపై 4 దశాబ్దాల కిందట నిర్మించిన బ్రిడ్జి రెండు దశాబ్దాల కిందట కుంగి, రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి బ్రిడ్జిపై రాకపోకలు పునరుద్ధరించారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరి బ్రిడ్జిపై గోతులు పడుతున్నాయి. స్లాబులో వేసిన ఇనుప చువ్వలు సైతం బయట పడ్డాయి. బ్రిడ్జిపై తారుతో తాత్కాలికంగా గోతులు పూడ్చుతున్నప్పటికి వెంటనే మరలా యథాస్థితి చేరుతున్నాయి. ఇక రెయిలింగ్ పూర్తి శిథిలావస్థకు చేరి పడిపోతుంది. అద్దంకి-కొనికి ఆర్‌అండ్‌బీ రోడ్డులో అద్దంకి-రేణింగవరం మధ్య డబుల్ రోడ్డుగా ఉన్నప్పటికి మూడు చోట్ల వాగులపై ఉన్న కల్వర్టులు మాత్రం పాతవే ఉన్నాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు సైడ్ వాల్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టులపై తారుతో మరమ్మతులు చేపట్టినా వర్షపు నీరు ప్రవహించిన వెంటనే మళ్లీ గోతులమయంగా మారుతున్నాయి. అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో అద్దంకి బ్రాంచి కెనాల్‌పై సుమారు 6 దశాబ్దాల కిందట నిర్మించిన చిన్న బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో పాటు మలుపు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు మృతి చెందారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిల స్థానంలో కొత్త బ్రిడ్జిల నిర్మాణం జరుగుతాయని ఆశతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు ఉన్నారు. తిమ్మాయపాలెం - ఇలపావులూరు రోడ్డులో పేరాయపాలెం వద్ద దోర్నపు వాగుపై ఉన్న బ్రిడ్జి గత ఏడాది పూర్తిగా కూలిపోయింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా పైప్ కల్వర్టు పనులు ప్రారంభించారు. శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు
- చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

అద్దంకి, ఆగస్టు 8 : ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. అద్దంకి నియోజకవర్గంలో, ప్రధానంగా గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జి, ఊటబావుల వద్ద యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో పలు శాఖల అధికారులతో గురువారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నా రు. తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో సత్యనారాయణ, మున్సిపల్ ఎఈ మరియదాసు, ఎస్ఈబీ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి


పెద్దమీరాసా మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ

అద్దంకి, ఆగస్టు 8 : నియోజకవర్గంలో పలు కుటుంబాలను విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం పరామర్శించారు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడులో టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నుపల్లి పెద్ద మీరాసా గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందగా మృతదేహానికి గొట్టిపాటి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని గరటయ్యకాలనీలో బాలుడు మణికంఠ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబసభ్యులను రవికుమార్ పరామర్శించారు. తిమ్మాయపాలెంకు చెందిన అడుసుమల్లి హనుమంతరావు ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని 18వ వార్డులో ఇటీవల మృతి చెందిన తన్నీరు వెంకటేశ్వర్లు, 14వ వార్డులో ఇటీవల మృతి చెందిన గుంజి శ్రీనివాసరావు, 11వ వార్డులో ఇటీవల మృతి చెందిన గుమ్మడి శివపార్వతి కుటుంబ సభ్యులను మంత్రి రవికుమార్ గురువారం పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని ఇడుపులపాడులో ఇటీవల చనిపోయిన బాధిత కుటుంబసభ్యులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం పరామర్శించారు.చెరుకూరి వీరనారాయణ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం గోరంట్ల బ్రహ్మానందం చిత్రపటానికి నివాళ్లులర్పించారు.ఆయన వెంట నాయుడు హనుమంతరావు,కరి శ్రీనివాసరావు, పాపయ్యస్థానిక నాయకులు ఉన్నారు.

రూ.3.25లక్షల వెండి కవచం అందజేత


భక్తాంజనేయస్వామికి వెండి కవచాన్ని అందజేస్తున్న దాతలు

అద్దంకి, ఆగస్టు 8 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం పరివార ఆలయంగా ఉన్న భక్తాంజనేయస్వామి దేవాలయంలో 3,24,950 రూపాయల విలువైన 3.250 కిలోల బరువు గల వెండి కవచాన్ని ఒంగోలుకు చెందిన అమరా హనుమంత ప్రసాద్ రమాదేవి కుమారుడు చక్రధర్, శ్రావ్య మనుమడు సహిష్ణు ఆలయ ఈవో సుభద్రకు గురువారం అందజేశారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను ఆశీర్వదించారు.


ఆరిఫ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బలరాం

నిందితులను కఠినంగా శిక్షించాలి

మాజీ ఎమ్మెల్యే కరణం

చీరాల, ఆగస్టు 8 : సయ్యద్ ఆరిఫ్ హత్య దారుణమని, నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే బలరాం, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు ఈపురుపాలెంలోని ఆరిఫ్ కుటుంబాన్ని పరామర్శించారు. వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దు, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే విద్యార్థిని ఇడుపలపాయ ట్రిపుల్ ఐటీ చదువుతూ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు

» దాతల సహకారంతో ఏర్పాటు
» అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
» పట్టించుకోని పోలీసు శాఖ


బల్లికురవ కూడలిలో పనిచేయని సీసీ కెమెరాలు

బల్లికురవ, ఆగస్టు 8 : అక్రమార్కులను త్వరిత గతిన గుర్తించేందుకు దాతల సహకారంతో బల్లికురవ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిద్రపోతున్నాయి. రెండేళ్లుగా అవి పనిచేయడం లేదు. మొదట్లో ఎంతో ఆర్భాటంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పిన అధికారులు వాటి నిర్వహణ విషయాన్ని పట్టించుకోలేదు. అవి పనిచేయకపోవడంతో గ్రామాల్లో దొంగతనాలు ఎక్కువయ్యా యని స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ మండల కేంద్రంలో రెండేళ్ల కిందట పోలీసు అధికారులు దాతల సహకారంతో లక్షలు వెచ్చించి బల్లికురవలో సంతమాగులూరు రోడ్డు, అద్దంకి రోడ్డు, సంతమాగులూరు రోడ్డు, మార్టూరు రోడ్డు వైపులా కదలికలు రికార్డు అయ్యేలా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి మొదట్లో ఏర్పాటు చేసిన సమయంలో ప్రజలు మనకు ఇంకా దొంగల భయం ఉండదని ఆనందించారు. ఎవరైనా చోరీలకు పాల్పడితే నిఘా నేత్రంలో చిక్కి దొరికిపోతారని అందరు భావించారు. సీసీ కెమెరాలు రెండేళ్ల నుంచి పనిచేయడం లేదు. నలువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు కెమెరాలు ఆలంకార ప్రాయంగా ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగి గుర్తు తెలియని వాహనాలు వస్తే వాటిని గుర్తించేందుకు కెమెరాలు బాగా ఉపయోగ పడేవని, అవి మరమ్మతుకు గురికావడంతో ఎలాంటి ఫుటేజీలు లేకుండా పోయింది. దాతలు ఇచ్చిన సాయం వృథా అవుతుందని వారు తెలిపారు. అలానే మండలంలోని పలు గ్రామాలలో కూడా దాతల సహకారంతో సీసీ కెమెరాలను గతంలో ఏర్పాటు చేశారని వాటిని కూడా పరిశీలించి అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రానున్నది వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు, మహిళలు ఎక్కువ సమయం పొలాలవద్దే ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో దొంగలు హల్‌చల్ చేసే అవకాశాలు లేకపోలేదు. సీసీ కెమెరాలను బాగుచేయించి వినియోగంలోకి తీసు కురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శ్రీ త్రివిక్రమ స్వామి హుండీ లెక్కింపు

చెరుకూరు(పర్చూరు), ఆగస్టు 8: పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ త్రివిక్రమ, శ్రీ అగస్తేశ్వరస్వామివార్ల సంవత్సర హుండీ ఆదాయం రూ.48వేలు అని ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.నాగయ్య తెలిపారు. గురువారం దేవస్థాన ప్రాంగణంలో ఒంగోలు దేవదాయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షణ, అర్చకుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీకి సంబంధించి రూ.48,392 స్వామివార్లకు భక్తులు కానుకల ద్వారా వచ్చినట్లు అధికారులు తెలపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి రామకృష్ణ, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

అపోలో స్పెక్ట్రా హాస్పటల్ ప్రారంభంలో ఎమ్మెల్యే కొండయ్య


ఎమ్మెల్యే కొండయ్యకు వివరాలు చెప్పున్న డాక్టర్ రవికిరణ్, నిరుపమ దంపతులు

చీరాల, ఆగస్టు 8 : అత్యాధునిక పరికరాలు, వసతులతో కార్పొరేట్ స్థాయిలో చీరాలలో అపోలో స్పెక్ట్రా హాస్పటల్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని, ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఏరియా వైద్యశాల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో స్పెక్ట్రా ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పలువురు ప్రముఖులు పలు విభాగాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే కొండయ్య ఆపరేషన్ థియేటర్, వార్డులను ప్రారంభించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, డాక్టర్ దొప్పలపూడి మాణిక్యమ్మ, అపోల్ హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్ సీఈవో శ్రీరామ్ అయ్యర్, డీఎంఎస్ డాక్టర్ విజయ అగర్వాల్, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ నిరుపమ, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) తదితరులు పలు విభాగాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్పటల్ ఆవిర్భాం నుంచి వారి కృషి, ప్రస్తుతం అపోలో స్పెక్ట్రా హాస్పటల్ ఏర్పాటు వరకు పరిణామక్రమాలను వివరించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ హాస్పటల్ నిర్వహణ కొంత సేవాభావంతో కూడా ఉండాలని సూచించారు. డాక్టర్ అవంతి వందన సమర్పణతో కార్యక్రమం ముగింది. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వైద్యనిపులు, వైద్యులు, సిబ్బంది, పలువురు పురప్రముఖులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం : ఎమ్మెల్యే కొండయ్య

మండల పరిధిలోని ఈపురుపాలెం పంచాయతీ సీతారాంపేట రామాలయం వీధి రైల్వేస్టేషన్ రోడ్డులో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, స్థానిక నాయకుడు గుద్దంటి చంద్రమౌళి, టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

» దరిదాపులకు రాని వైసీపీ కేడర్
» అధికార పార్టీకి అంతా ఏకపక్షమే


చక్రాయపాలెం హైస్కూల్‌లో కమిటీ సభ్యులను ఎన్నుకుంటున్న తల్లిదండ్రులు
సంతరావూరులో చైర్మన్‌గా మహేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం

అద్దంకి, ఆగస్టు 8 : పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని 76 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు వైసీపీ కేడర్ ముందుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి పూర్తి పట్టు ఉన్న శంఖవరప్పాడు లాంటి గ్రామాలలో సైతం అన్ని పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు అధికార పార్టీకి ఏకపక్షంగా జరిగాయి. వారిలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎం లు నూతన కమిటీ సభ్యుల చేత ప్రమాణం చేయించారు. ఎంఈవోలు గంగాధరరావు, బి.సుధాకరరావు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పలు పాఠశాలల వద్ద ముందస్తుగానే బందోబస్తు ఏర్పాటు చేశారు.

చినగంజాం : మండల పరిధిలోని 38 పాఠశాలల్లో పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 29 ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎంపిక చేసినట్లు ఎంఈవోలు బి.అజయ్‌బాబు, ఎన్.కోటేశ్వరరావులు తెలిపారు. చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా సాయిని సౌజన్య, వైస్ చైర్మన్‌గా మేడికొండ ప్రభుదాసు, కడవకుదురు జడ్పీ పాఠశాలకు జీవీ రామకృష్ణారెడ్డి, ఎస్.సునీత, పెదగంజాంకు ఆసోది సుదర్శనరెడ్డి, రాయపాటి మరియమ్మ, రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాలకు సూర్ని వెంకటరమణారెడ్డి, నాయుడు బ్రహ్మమ్మ, పెద్ద పల్లెపాలెం జడ్పీ పాఠశాలకు బాలకుమారి, సీతారావ మ్మ, అడవీధిపాలెంకు ఎస్.రామస్వామి, మేరి, కేజీబీవీకి కే.కల్పన, ఎం.కామేశ్వరి, సంతరావూరుకు సాయిని మహేష్, కే.లోహిత, పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డిపాతగొల్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా జి.శేషారావు, వి.లక్ష్మీతిరుపతమ్మ ఎన్నికైనట్లు తెలిపారు.

పంగులూరు : మండలంలో పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. అలవలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్‌గా షేక్ కాలేషావలి, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చందలూరు పాఠశాలకు గొట్టిపాటి హరికృష్ణ, పంగులూరు ఉన్నత పాఠశాలకు అద్దంకి రాజేశ్వరి, ముప్పవరం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలకు వేల్పుల మరియదాస్, బూదవాడ ఉన్నత పాఠశాలకు వీరారెడ్డి, కొండమంజులూరు స్కూల్‌కు గోలి సంధ్య చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 7 ప్రాథమిక, 31 ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి.

పర్చూరు : పాఠశాల మేనేజిమెంట్ కమిటీ ఎన్నికలు గురువారం మండలంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలకు సంబంధించి మొత్తం 50 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు జరిగినట్లు ఎంఈవో వెంకట్రామయ్య తెలిపారు. నాగులపాలెంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల చైర్మన్‌గా దాసి కిరణ్ ఎన్నికయ్యారు. పర్చూరు నెహ్రూ కాలనీ పాఠశాల చైర్మన్‌గా షేక్‌రఫీ, వైస్‌చైర్మన్‌గా శివనాగలక్ష్మి ఎన్నికయ్యారు. ఉప్పుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు షేక్ ఖాదర్ బాషా, రమాదేవి ఏకగ్రీవం గా ఎన్నికలయ్యారు. బోడవాడ ఎంపీపీఎస్ పాఠశాలకు చైర్మన్‌గా సాల్మన్, వైస్ చైర్మన్‌గా అనురాధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు.

కారంచేడు : కారంచేడు మండలంలోని 33 పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగానే ముగిశాయి. ఎలాంటి వివాదాలకు తావులేకుండా మండల విద్యాశాఖాధికారి మొలబంటి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల్లో భాగంగా ఎక్స్ అఫిషియో సభ్యులు ఆరుగురు, ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులను ప్రతి పాఠశాలలో నామినేట్ చేసినట్లు ఎంఈవో తెలిపారు. నూతన కమిటీ పదవీకాలం రెండేళ్లు ఉంటుందని తెలిపారు.

మార్టూరు : మండలంలోని 56 ప్రభుత్వ స్కూళ్లలో గురువారం జరిగిన పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సంపత్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎన్నికలను ఎంఈవో వస్రాంనాయక్ పరిశీలించారు. మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు కొన్ని గ్రామాలలో స్కూళ్ల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో 33 ప్రభుత్వ స్కూళ్లల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈవో చిలుకూరి గోపి ఎన్నికలను పర్యవేక్షించగా, ఎస్ఐ జీవీఎస్ చౌదరి కొన్ని స్కూళ్ల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలలో టీడీపీ కూటమి మద్దతుగలిగిన అభ్యర్థులు విజయం సాధించారు.

బల్లికురవ : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం స్కూల్ మేనేజిమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలను జిల్లా అబ్జర్వర్ శ్రీనివాసరావు బల్లికురవ ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రమేష్ పాల్గొన్నారు. కొత్తూరులో టీడీపీ నేత పి. ఆంజనేయులు పాఠశాల అభివృద్ధికి 25వేల రూపాయలు, అల్లంశెట్టి నాగేశ్వరరావు 10 వేల రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు.

ఇంకొల్లు : ఏడు ఉన్నత పాఠశాలలకు, 30 ప్రాథమిక పాఠశాలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యా కమిటీ ఎన్నికలు జరిగినట్లు మండల విద్యాశాఖాధికారి తెలిపారు. నూతన కమిటీలకు మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు.

మేదరమెట్ల : పేరెంట్స్ కమిటీ ఎన్నికలలో టీడీపీ కూటమి మద్దతుదారులైన అభ్యర్థులు హవా కనిపించింది. 35 ప్రభుత్వ స్కూళ్లల్లో ఎన్నికలు జరిగినట్లు ఎంఈవో పున్నయ్య తెలిపారు. పి.గుడిపాడు పాఠశాలలో కూటమి మద్దతుదారు విజయం సాధించగా, ఓడిపోయిన అభ్యర్థికి ఒక్క ఓటు వచ్చింది.


బోడవాడలో ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ, ఇంకొల్లు : నూతన కమిటీతో హనుమంతరావు

సెల్‌ఫోన్ దొంగ దొరికాడు

మార్టూరు, ఆగస్టు 8 : మార్టూరులో ఏలూరి రమ ఇంటిలో బుధవారం మధ్యాహ్నం కేబుల్ టీవీ నుంచి వచ్చానని, మోసంచేసి మూడు సెల్‌ఫోన్‌లను ఎత్తుకుపోయిన వ్యక్తిని గురువారం మార్టూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మూడు సెల్‌ఫోన్‌లను ఎత్తుకుపోయిన వ్యక్తి రెండు సెల్‌ఫోన్‌లను డబ్బులుకోసం ఇతరుల వద్ద తాకట్టుపెట్టగా, ఐఫోన్ మాత్రం ఓపెన్‌కాకపోవడంతో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కళామందిర్ సెంటరు వద్ద ఐఫోన్‌ను పారవేశాడు. అక్కడ ఈ ఐఫోన్‌ను చూసిన ఒక యువకుడు ఈ ఫోన్‌ను తీసుకొని టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. రమ కుమార్తె కావ్య ఐఫోన్ పోయిన విషయంపై అమెరికాలోని స్నేహితులతో చెప్పగా వారు లోకేషన్ వెర్ఫికేషన్ చేయగా ఎక్కడున్నదీ తెలిసింది. విషయాన్ని మార్టూరు పోలీసులకు తెలపగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు సూచనలు మేరకు ఏఎస్ఐ సైదా బాధితులతో చిలకలూరిపేట వెళ్లి ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

న్యాయాధికారి సుధ


రికార్డులు పరిశీలిస్తున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, ఆగస్టు 8 : పాఠశాల పరిధిలోని విద్యార్థినులకు అందించే సౌకర్యాలపై బాధ్యతగా మెలగాలని న్యాయాధికారి సుధ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం చీరాల మండలం గ్రామీణ పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని రికార్డులను న్యాయాధికారి సుధ నిశితంగా తనిఖీ చేశారు. అలాగే విద్యార్థినుల గదులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను చెక్ చేసి వాటిపై ఆరా తీశారు. నివేదికను ఉన్నత న్యాయస్థానాలకు పంపనున్నట్లు చెప్పారు. న్యాయమూర్తి వెంట కోర్టు సిబ్బంది, పాఠశాల సిబ్బంది ఉన్నారు.


విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులే


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

చీరాలటౌన్, ఆగస్టు 8 : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్ జీఎం అల్ఫాన్స్, ఒంగోలు జిల్లా జిల్లా విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చీరాల మండల పరిధిలోని గ్రామీణంలో విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు 37 బృందాలుగా ఏర్పడి 2711 సర్వీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అదనపు లోడ్ 122కు రూ.3.41 లక్షలు, విద్యుత్ చౌర్యం 15 సర్వీసులకు గాను రూ.65 వేలు, అక్రమ కేటగిరీకు సంబంధించి 12 సర్వీసులకు రూ.36 వేలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. తనిఖీలలో చీరాల ఈఈ థామస్, విజిలెన్స్ డీఈ శ్రీనివాసరావు, విద్యుత్ డీఈ టీ శ్రీనివాసరావు, వేటపాలెం డీఈ శ్రీనివాసులు, పర్చూరు డీఈ రమేష్, తొమ్మిది మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ అందజేత

ఇంకొల్లు, ఆగస్టు 8 : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వారిచే బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన నల్లూరి అభిరామ్‌కు ఉచితంగా ల్యాప్‌ట్యాప్ అందజేసారు. గుంటూరు విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న అభిరాంకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు వారి మిత్రులు లంకా కృష్ణ, ఘంటా బాబు సహకారంతో గురవారం అభిరామ్‌కు ల్యాప్‌ట్యాప్‌ను అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కరణం రమేష్, పిడికిటి శ్రీనివాసరావు, కరణం పూర్ణ, సూది సుబ్బారావు, యార్లగడ్డ రామకృష్ణ, రామారావు, సోమయ్య, వీరయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.





ప్రారంభానికి నోచుకోని గోషా ఆసుపత్రి

సత్యాజీ

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి సమస్యల స్వాగతం
- గోషా ఆసుపత్రి ప్రారంభం ఎప్పుడు.. ?
- రూ.3 కోట్ల భవనాన్ని ఆక్రమించినా చర్యలు శూన్యం
- సమయపాలన పాటించని జీజీహెచ్ వైద్యులు
- కలెక్టరుకు ఐవోసీ ఇచ్చిన హామీ ఏమైంది ?

సంస్కరణల ఊసేది ?

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 8: గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన వైద్యశాఖను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జగన్ పాలనలో వైద్యులు, సిబ్బంది ఆడిందే ఆటగా... పాడింది పాటగా గడిచింది. ఎన్నో సంస్కరణలు చేపట్టినా వైద్యశాఖలో మాత్రం మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి వైద్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, తొలిసారిగా సత్యకుమార్ జిల్లాలో అడుగుపెడుతున్నారు. ఆ శాఖలోని అనేక సమస్యలు ఆయనకు స్వాగతం పలుకుతున్నాయి. వైద్యశాఖలో సంస్కరణలు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యశాఖకు ఏడాదికి రూ. 25కోట్లు వస్తున్నా, వాటిద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉండగా, ఆ దిశగా కృషి జరగడం లేదన్న విమర్శలు లేకపోలేదు. గతవైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ఆరోగ్య సేవలను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● గోషా ఆసుపత్రి, ఆక్రమణల సంగతేంటి ?

2021 జనవరిలో వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన గోషా ఆసుపత్రి నిర్మాణం పూర్తయింది. 100 పడకలతో ఉన్న ఈ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆరునెలల క్రితమే ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. 25 మంది స్టాఫ్‌నర్సులు, 10 మంది ఏఎన్ఎంలు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండెంట్, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలను నియమించాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు. అంతేకాక కార్యాలయ సిబ్బంది యూడీసీ, ఎల్‌డీసీలతో పాటు టైపిస్టు నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అయినా ఇంతవరకు ఆ నియామకాలు చేపట్టలేదు.



ఆక్రమణలో వైద్యశాఖ భవనం

ఇదిలాఉండగా ఈ ఆసుపత్రి ప్రాంగణంలోనే రూ. 3 కోట్ల విలువైన పాత భవనాన్ని వైసీపీ చెందిన వ్యక్తి ఆక్రమించినా, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నేటికీ ఖాళీ చేయించలేదు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 52 పీహెచ్‌సీలు, 495 విలేజ్ హెల్త్ సెంటర్‌లు ఉన్నా వైద్య చికిత్సలు నామమాత్రంగానే ఉన్నాయి. విలేజ్ హెల్త్ సెంటర్లు 412 చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటికి అద్దె చెల్లింపులో నేటికీ వైద్య ఆరోగ్యశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరగాల్సి ఉన్నా, సుమారు 10 పీహెచ్‌సీల్లో నేటికీ ఒక్క ప్రసవం కూడా జరగలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా 45 వేల ప్రసవాలు జరుగుతుండగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం 10 వేల ప్రసవాలు మాత్రమే జరుగుతున్నాయి. దీన్నిబట్టి వైద్యశాఖ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● అక్కడా సంస్కరణలేవి ?

జిల్లాలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ సర్వీసెస్ కింద ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితో పాటు కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీలు ఉన్నాయి. ఆయా కేంద్రా ల్లోనూ ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆయా ఆరోగ్య కేంద్రాల్లో 124 మంది వైద్యులు ఉన్నారు. మరో 28 వైద్యుల నియామకం చేపట్టాల్సి ఉంది. అలాగే హెడ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియాలజీ టెక్నీషియన్లు మరో 14 మంది సిబ్బంది అవ సరం ఉన్నా నేటికి నియామకాలు చేపట్టలేదు. ఇవన్నీ ఇలాఉండగా నెల్లూరు నగరంలోని క్షయ ఆసుపత్రికి చెందిన రూ. 5 కోట్ల విలువైన స్థలాన్ని రెవెన్యూ విభాగానికి పెట్రోల్ బంక్ కింద కేటాయించారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ)వారు రూ. 30 లక్షల విలువైన టిఫాస్కాన్‌ను ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తామని గత కలెక్టర్ హరినారాయణకు హామీ ఇచ్చారు. అలాగే సామాజిక, ఏరియా ఆసుపత్రుల్లోనూ ఈఎన్‌టీ పరికరాలతోపాటు మరో రూ. 37 లక్షల విలువైన పరికరాలు ఇస్తామని కూడా కంపెనీ హామీ ఇచ్చింది. అయితే పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్న ఐవోసీ ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చలేదు.

జీజీహెచ్‌లోనూ మార్పులేవి ?

జీజీహెచ్‌లో కూడా 126 మంది వైద్యులు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది వైద్యులు సక్రమంగా విధులకు హాజరు కావటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలు విభాగాల హెచ్‌వోడీలు విశ్రాంతి గదులకే పరిమిత మవుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. హైపటైటిస్ రోగులను ఓ వైద్యుడు తన ప్రైవేట్ క్లినిక్‌కు రప్పించుకుంటూ వేల రూపాయలు గుంజుతున్నట్లు సమాచారం. అలాగే ఎమ్మారై, సిటీ స్కానింగ్‌లు చేయించుకునే రోగులకు రిపోర్టులు ఇవ్వటంలో పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇక పోస్టుమార్టం విభాగంలోనూ డబ్బులు ఇవ్వందే మృతదేహాన్ని ఇవ్వరన్న విమర్శలు లేకపోలేదు. 750 పడకలు ఉన్నా జీజీహెచ్‌లో కొంతమంది వైద్యులు మెరుగైన వైద్య చికిత్స అందిస్తూ పేరుతెచ్చుకుంటున్నారు. మరికొందరి తీరు వల్ల ఆసుపత్రికే చెడ్డపేరు వస్తున్నది. వీటన్నింటిపై మంత్రి సత్యకుమార్ దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. ఈ క్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. సీఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి నాడు-నేడు, తల్లికివందనం, విద్యాకానుక తదితర కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షిం చేలా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఎన్నికల్లో పోటీచేసేందుకు పలువురు తల్లిదండ్రులు ఆసక్తి చూపారు. జిల్లా విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి గురువారం ఎన్నిక లను నిర్వహించింది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నికలు ఇష్టానుసారంగా నిర్వహించగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అందరి ఆమోదంతో 1,980 పాఠశాలలు ఏకగ్రీవం అయ్యాయి.



సీతారామపురం ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎంసీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్‌వలి

- 1,980 పాఠశాలల్లో ఏకగ్రీవం
- 604 స్కూళ్లలోనే ఎలక్షన్స్
- 27 చోట్ల వాయిదా

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

● చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక

చేతులెత్తే పద్ధతిలో గురువారం ఎన్నికలు జరిపారు. గతంలో పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ పాలక వర్గాల గడువు ముగియడంతో ఎన్నికలు నిర్వహిం చకుండా పాతవారి పదవీకాలన్నే పొడిగించారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ ఎన్నికలు రాజకీయ నేతల కనుసన్నల్లోనే జరిగాయి. తమ అనుచరులనే చైర్మన్‌లుగా చేయాలన్న లక్ష్యంతో చేసిన ప్రయత్నాలు పలు ప్రాంతాల్లో వివాదాలకు దారితీశా యి. దీంతో పాటు అన్ని పాఠశాలలను ఏక గ్రీవం చేసుకున్నారు. అయితే ప్రస్తు తం మారిన పరిస్థితుల నేపథ్యంలో రాజ కీయ ప్రమేయం లేకుండా ఎన్నికలు నిర్వహిం చేలా అధికార యంత్రాంగం కృషి చేసింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం స్థానిక పరిస్థితుల కారణంగా ఎన్నికలు వాయి దా పడగా, అత్యధిక ప్రాంతాల్లో ప్రశాం తంగా జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఏకగ్రీవమైన పాఠశాల ల్లో తమకు నచ్చిన వారిని తరగతికి ముగ్గురు చొప్పున గరిష్ఠంగా 23 మం దిని ఎంపిక చేసి మరో ఐదుగురు కోఆప్షన్ సభ్యులను నియమించారు. ఎన్నికలు జరిగిన పాఠ శాలల్లో చైల్డ్ ఇన్ఫోలో నమోదైన ప్రతి ఒక్క విద్యార్థి తల్లి, తండ్రి లేదా సంరక్షుడు ఒకరికి ఓటు హక్కు కల్పించారు. అయితే అధికారులు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఎన్నికలు నిర్వహిస్తామని తొలుత ప్రకటించినా, అత్యధిక ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు కూడా నిర్వహించలేకపోయారు. అన్ని ప్రాంతాల్లో సర్దుబాట్ల అనంతరమే ఎన్నికలు పూర్తిచేసినట్లు విద్యాశాఖ సిబ్బంది తెలిపారు.

● 604 చోట్లే ఎన్నికలు

జిల్లాలోని 38 మండలాల్లో 2,622 పాఠశాలలు ఉండగా వీటిలో 2611 పాఠశాలలు ఎన్నికలకు ఎంట్రీలు నమోదు చేసుకున్నాయి. వీటిలో 1980 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా 604 పాఠశాలల్లో మాత్రం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తల్లి దండ్రులు, సంరక్షలు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని 27 పాఠశాలల్లో మాత్రం స్థానిక పరిస్థి తులు, పరస్పర సహకా రాలు లేకపోవడం, స్వల్ప వివాదాల మధ్య అధికారులు ఎన్నికలు వాయిదా వేశారు. వాయిదా పడ్డ పాఠశాలల వివరాలను ఉన్నతాధికారులకు అందచేసి వారి ఆదేశాల మేరకు ఎంట్రీ కాని పాఠశాలలకు, వాయిదా పడిన పాఠశాలలకు ఎన్నికలు నిర్వహిం చేలా చర్యలు తీసుకుంటా మని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలను డీఈవో రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషా రాణి, సమగ్ర శిక్ష సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

- నెల్లూరు (విద్య)

అక్కంపేటలో ఆగిన ఎన్నిక

- కాంగ్రెస్, టీడీపీ వర్గీయుల రాకతో రగడ
- పోలీసుల రంగప్రవేశం

మనుబోలు: ఎస్ఎంసీ ఎన్నికలు మనుబోలు మండలం అక్కంపేట ఉన్నత పాఠశాలలో గురువారం అసెంబ్లీ ఎలక్షన్లను తలపించాయి. పాఠశాల వద్దకు టీడీపీ, కాంగ్రెస్ వర్గీయులు రావడంతో రగడ మొదలైంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. హెచ్ఎం సెలవుపెట్టడంతో ఇన్‌చార్జి హెచ్ఎం దయామణి ఎన్నికను నిర్వహించారు. ముందుగా 1నుంచి 8తరగతుల వరకు ముగ్గురేసి చొప్పున కమిటీ సభ్యులను ఎంపికచేశారు. మధ్యాహ్నం నుంచి చైర్మన్ ఎన్నిక జరపాల్సి ఉండగా, 24మంది సభ్యులతో ప్రారంభించారు. ఇంతలోకి అక్కడికి రాజకీయ నేతలు రావడంతో ఇన్‌చార్జి హెచ్ఎం ఎలా ఎన్నిక నిర్వహిస్తారని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఎన్నిక జరపాల్సిందేనంటూ కాంగ్రెస్ నేత పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాలు వాదనలకు దిగాయి. సాయంత్రం ఐదు వరకు వాగ్వాదం జరిగింది. అనంతరం ఇన్‌చార్జి హెచ్ఎం మాట్లాడుతూ తనకు ఆరోగ్యం బాగా లేదని, ఇవాళ ఎన్నిక నిర్వహించలేనని చెప్పింది. ఇంతలోనే ఆమె అస్వస్థతకు గురవడంతో 108లో చికిత్స నిమిత్తం నెల్లూరుకి తరలించారు. దీంతో సీఐ రాంబాబు, ఎస్ఐలు రామకృష్ణ, అజయ్‌కుమార్ ఇరుపార్టీల నాయకులను, కమిటీసభ్యులకు సర్దిచెప్పి స్కూల్ నుంచి పంపేశారు.



మనుబోలు : ఇన్‌చార్జి హెచ్ఎంతో వాదిస్తున్న కమిటీ సభ్యులు

సీఐల బదిలీల వివరాలు

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రాంతం
ఎస్‌కె నఫీజ్ బాషా	కందుకూరు సర్కిల్	మాచర్ల రూరల్, పల్నాడు జిల్లా
కేశవ వెంకటేశ్వరరావు	పీసీఆర్, ప్రకాశం జిల్లా	కందుకూరు సర్కిల్
జీ మంగారావు	పెద్దకూరపాడు సర్కిల్, పల్నాడు	గుడ్లూరు సర్కిల్
బీ వీరవెంకట సుబ్బారావు	గుడ్లూరు సర్కిల్	రేంజ్ కర్యాలయం
టీవీ శ్రీనివాసరావు	కోవూరు సర్కిల్	కారంపూడి సర్కిల్, పల్నాడు జిల్లా
ఆర్ అహ్మద్ జానీ	డీఎస్‌బీ-2	బాపట్ల టౌన్ పీఎస్
షేక్ అన్వర్‌బాషా	కొత్తపేట పీఎస్, గుంటూరు	నవాబుపేట పోలీసు స్టేషన్
ఎం బాబీ	నవాబుపేట పోలీసు స్టేషన్	నాయుడుపేట అర్బన్ పీఎస్, తిరుపతి జిల్లా
ఎం రోశయ్య	సౌత్‌ట్రాఫిక్ పీఎస్	దర్గామిట్ట పోలీసు స్టేషన్
హెచ్ఎస్ హుసేన్‌బాషా	దర్గామిట్ట పీఎస్	రేంజ్ కార్యాలయం
హెచ్ఎస్ హుస్సేన్‌బాషా	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్	వాకాడు సర్కిల్, తిరుపతి
కే వేమారెడి	మహిళా పీఎస్-1 గుంటూరు	సంగం సర్కిల్
రవినాయక్	సంగం సర్కిల్	రేంజ్ కార్యాలయం
జీ గంగాధర్‌రావు	రేంజ్ వీఆర్	ఆత్మకూరు సర్కిల్
జీ వేణు	ఆత్మకూరు సర్కిల్	రేంజ్ కార్యాలయం
ఎండీ ఫిరోజ్	కలిగిరి సర్కిల్	కావలి -1 పీఎస్
రాజేష్	కావలి-1 పీఎస్	రేంజ్ కార్యాలయం

పోలీసుశాఖలో భారీగా బదిలీలు

డీఎస్పీలు, సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8 : పోలీసు శాఖలో బదిలీల పర్వం ఊపందుకుంది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆత్మకూరు డీఎస్పీగా ఉన్న ఎన్ కోటారెడ్డి పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీకాగా, ఆయన స్థానంలో సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కే వేణుగోపాల్‌ను నియమించారు. గుంటూరు రేంజ్ పరిధిలో 30 మంది సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు.

డీఎంహెచ్‌వో సంతకం ఫోర్జరీ

● కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు8: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) సంతకం ఫోర్జరీ చేసి, నకిలీ అపాయింట్‌మెంట్లు ఇచ్చిన ఘటనపై నెల్లూరు సంతపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, తిరుపతి జిల్లాకు చెందిన కరీముల్లాకు నెల్లూరులోని వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులతో ఎంతోకాలంగా పరిచయాలున్నాయి. దీంతో ఆయన పలువురు నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని, కాంట్రాక్టు ప్రాతిపదికన స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురి వద్ద నుంచి రూ.14 లక్షలు వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా డీఎంహెచ్‌వో పేరుతో ఉన్న అపాయింట్‌మెంట్ లెటర్ వారికి అందించాడు. ఈ క్రమంలో బాధితుడు వెంకటకృష్ణ అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకుని డీఎంహెచ్‌వో పెంచలయ్యను కలిశాడు. తనకు మర్రిపాడు పీహెచ్‌సీలో పోస్టింగ్ ఇవ్వాలని కోరాడు.కంగుతున్న డీఎంహెచ్‌వో నియామక పత్రాన్ని పరిశీలించారు. అందులో ఉన్న సంతకం తనదికాదని, ఎవరో ఫోర్జరీ చేశారని గుర్తించారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం రాత్రి ఆయన సంతపేట పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో జడ్పీ

- తగ్గిపోతున్న ఆదాయ వనరులు
- పట్టించుకునే నాథుడే కరువు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు
- రేపు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

నెల్లూరు, (జడ్పీ), ఆగస్టు 8: జిల్లాపరిషత్(జడ్‌పీ) ఆదాయ వనరులు, అధికారాలు నానాటికీ కుంచించుకుపోతున్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో జడ్పీ కునారిల్లుతోంది. గతంలో ఉన్న అధికారాలు, ఆదాయమార్గాలు లేకపోవటంతో మొక్కుబడి సమావేశాలకే పరిమితమవుతున్నది. జిల్లా మంత్రులతో పాటు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొనే జిల్లా అత్యున్నత సమీక్ష సమావేశాలకు జడ్పీ వేదిక అయినా, ఆర్థిక కష్టాలు తీర్చే నాథుడే కరువయ్యాడు. ఉమ్మడి జిల్లాలోని 46 మండలాలకు వేదికైన జిల్లా పరిషత్ సమావేశం శనివారం జరగనుంది.

● దూరమైపోతున్న ఆర్థిక వనరులు

ఏ సంస్థ అభివృద్ధి చెందాలన్నా ఆర్థికవనరులే కీలకం. పేరుకి జిల్లాలోని గ్రామీణశాఖలను పర్యవేక్షించే అధికారం మాత్రం జడ్పీకి ఉండగా, ఆర్థిక వనరులు మాత్రం ఉండటం లేదు. గతంలో ఇసుక సీనరైజ్ చార్జీలతోపాటు, మైనింగ్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఫర్ క్యాపిటల్ గ్రాంట్, స్టాంపు డ్యూటీ, ఆర్థిక సంఘం జనరల్ ఫండ్, నిధులు జిల్లా పరిషత్‌కి భారీగా వచ్చేవి, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసే అవకాశం ఉండేది. కేవలం ఇసుక సీనరైజ్ చార్జీలే ఏడాదికి రూ.10కోట్ల మేర వచ్చేవి, అలాగే స్టేట్ ఫైనాన్స్ నుంచి రూ.4 నుంచి రూ.5కోట్లు వరకు వచ్చేవి. అయితే కొన్నేళ్లుగా ఇసుక సీనరైజ్ చార్జీలతోపాటు, స్టేట్ ఫైనాన్స్ నిధులు నిలిచిపోయాయి. అలాగే స్టాంపు డ్యూటీ, మైనింగ్ సెక్టార్ల చార్జీలు కూడా అరకొరగా వస్తున్నాయి. జనరల్ ఫండ్ నిధులు మాత్రం కొంతమేరకు వస్తున్నాయి. ఈ నిధులను కూడా అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు వీలులేకుం డా జడ్పీపై పింఛనర్ల భారం పడింది. దాదాపు వందమంది పెన్షన్లకు నెలకి రూ.20 లక్షల చొప్పున సంవత్సరానికి రూ.2.40 కోట్లు చెల్లించాల్సి వస్తున్నది. సహజంగా పెన్షర్ల వేతనాల బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. జడ్పీకి పెన్షన్ల భారం తగ్గిస్తే ఏడాది రూ.2.40కోట్లు నిధులు అభివృద్ధి పనులకు వినియోగించుకునే అవకాశం ఉంది.



● నిధుల విడుదలపై చర్చించాలి

ఇకపోతే రిజిస్ట్రేషన్‌శాఖ, మైనింగ్ నుంచి రావాల్సిన స్టాంపు డ్యూటీలు. ఇసుక సీనరైజ్, స్టేట్ ఫైనాన్స్ నిధులు జడ్పీకి వచ్చేలా సభ్యులు సమావేశంలో చర్చించి ప్రభుత్వానికి విన్నవించాలి. సభ్యులు నిధుల మంజూరుకు కృషి చేస్తే జిల్లా పరిషత్‌కి ఆర్థిక కష్టాలు చాలా వరకు తీరే అవకాశాలు ఉన్నాయి. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు జడ్పీకి ఏడాదికి రూ.19 కోట్ల మేర వస్తున్నా... అవి కరెంటు చార్జీలు, తాగునీటి నిర్వహణకే ఖర్చవవు తున్నాయి. దీంతో వస్తున్న అరకొర నిధులతో అభివృద్ధి పనులకు అవకాశం లేకుండా పోయింది.

● మొక్కుబడిగా సమావేశాలు

గత ఐదేళ్లుగా జడ్పీటీసీలతోపాటు, ఎమ్మెల్యేలు, మంత్రులు అధికార పార్టీకి చెందిన వారు కావటంతో సమావేశాలు మొక్కుబడిగా జరిగేవి. సమస్యలపై చర్చ లేకుండానే ప్రభుత్వానికి అనుకూలంగా నిర్వహిస్తూ వచ్చారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటం, మంత్రులతోపాటు ఎమ్మెల్యేలంతా అధికార పార్టీవారే ఉండంతో వారందరికీ శనివారం జరిగే జడ్పీ సమావేశం తొలి కావడంతో ఆర్థిక వసరులపై ప్రత్యేకంగా చర్చించాలని ప్రజలు ఆశిస్తున్నారు. అలాగే గతంలో ఉపాధ్యాయుల బదిలీలు, తదితర అధికారాలు జడ్పీకి ఉండగా ప్రస్తుతం అవి లేకుండా పోయాయి. వీటన్నింటిపై ప్రత్యేకంగా చర్చించి జడ్పీ బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- అయ్యోర్లకు తప్పిన ఫొటోల భారం
- మరుగుదొడ్ల ఛాయాచిత్రాలు తీయక్కర్లేదని ఆదేశాలు
- ఉపాధ్యాయ సంఘాల హర్షం

యాప్‌ల యాతన ఇకలేనట్టే !

నెల్లూరు (విద్య), ఆగస్టు 8 : పాఠశాలల్లోని మరుగుదొడ్ల ఛాయాచిత్రాలు (ఫొటోలు) తీసే పరిస్థితి నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం లభించింది. స్కూళ్లలో మరుగుదొడ్ల శుభ్రతను ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని, నిత్యం ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి అయ్యోర్లు ఈ ఫొటోలు తీయడంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.అంతేకాక ఎన్నో సార్లు మెమోలు కూడా అందుకున్నారు. తమకు బోధనేతర పనులు అప్పగించడం తగదని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఉపాధ్యాయులు అనేక మార్లు నిరసన తెలియచేశారు. ఈ విషయమై ప్రస్తుత కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బడుల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీయక్కర్లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు ఇవ్వడంతో ఫొటోల బాధ్యతల నుంచి టీచర్లను తొలగిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు మూడురోజుల క్రితం ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

● హర్షణీయం : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పిస్తూ మంత్రి నారా లోకేష్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం శుభ పరిణామమన్నారు.



పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయురాలు(ఫైల్)

గురువులకు విముక్తి : ఏపీ ఉపాధ్యాయ సంఘం

బాత్రూమ్ ఫొటోలు తీసే బాధ్యత నుంచి టీచర్లకు విముక్తి లభించిందని ఏపీ ఉపాధ్యా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేకే రాజగోపాలాచారి, పీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. గౌరవప్రదంగా పనిచేసే ఉపాధ్యాయులు నిత్యం బాత్రూమ్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలనడం తమను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ పని నుంచి తమను విముక్తులను చేయడం హర్షణీయమన్నారు.

తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

అనంతసాగరం, ఆగస్టు 8: విద్యార్థులపై తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని ఏబీసీడబ్ల్యూ శ్రీదేవి తెలిపారు. రేవూరు బీసీ బాలికల వసతిగృహంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారికి సూచనలిచ్చారు. సెలవుల సమయంలో ఇంటికి వచ్చిన విద్యార్థులు శ్రద్ధగా చదువుకొనేలా ప్రోత్సహించడంతో పాటు, సకాలంలో వారిని హాస్టల్‌కు పంపిచేలా చొరవ చూపాలన్నారు. వసతిగృహంలో వసతులు, భోజన ఏర్పాట్లపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగార్జునరెడ్డి, కే రవీంద్రరెడ్డి, సంక్షేమాధికారి మల్లేశ్వరి పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

సీతారామపురం, ఆగస్టు 8: నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కృషి అభినందనీయమని పార్టీ రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 4వేల క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. అందుకు సహకరించిన జనసైనికులకు, వీర మహిళలు, వాలంటీర్స్ టీమ్, ఐటీ విభాగం టీంకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 36వేల పార్టీ సభ్యత్వాలు నమోదయ్యేలా ప్రణాళికలు చేశామన్నారు.

మంత్రిని కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును గురువారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సేవాసంస్థలను భాగస్వామ్యం చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య, సభ్యులు వీకే ప్రకాష్, సలహాదారు మామిడిపల్లి బాలగంగాధర్, వెంకటశ్రీనివాస్ ఉన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: జలజీవన్ మిషన్ పల్స్ సర్వేలో భాగంగా ఇంటింటికీ తిరిగి కొళాయి ఉందా లేదా గుర్తించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్ తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 31వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది సర్వే చేపట్టి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: తిరుమలాపురం పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని సర్పంచ్ కొల్లుబోయిన సంజయ్‌కృష్ణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీలో రెండేళ్లుగా ఇంటి పన్నులు వసూలు చేసిన దాఖలాలు లేవని వాపోయారు. ఈ సమస్యతో అభివృద్ధి పనులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. విషయాన్ని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: పట్టణానికి చెందిన మన ఫౌండేషన్ సభ్యులు రంతుజానీ, టీడీపీ నాయకుడు బాబుల తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవోగా పద్మావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతసాగరం ఐసీడీఎస్ సీడీపీవోగా పని చేస్తున్న ఆమెను ఉన్నతాధికారులు ఉదయగిరికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ఉదయగిరి రూరల్: అన్ని పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుక రావాలని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ తెలిపారు. గురువారం ఆమె ఆర్లపడియలో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల ప్రారంభం

అల్లూరు, ఆగస్టు 8 : గ్రామ పంచాయతీల అభివృద్ధి అంశాలపై కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించనున్న శిక్షణా తరగతులు గురువారం ప్రాంభమయ్యాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన శిక్షణ తరగతులను ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో శీనానాయక్, తహసీల్దారు లక్ష్మీనారాయణ పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రాన్ని ఉద్దేశించి ఆర్డీఓ మాట్లాడారు. ప్రతిగ్రామం అభివృద్ధి చెందాలంటే ముందుగా కార్యదర్శులు, సర్పంచ్‌లు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై సమగ్రంగా అవవగాహన పొందితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, సర్పంచ్‌లు ఆట తిరుమల పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత పనులకు శ్రీకారం

ఆత్మకూరు, ఆగస్టు 8: మున్సిపాలిటీకి మంజూరైన రూ.22.81లక్షల జీపీఎస్ నిధులతో పట్టణ పరిధిలోని 91.10కిలోమీటర్ల మురుగునీటి కాలువ పూడికతీత పనులు చేపడుతు న్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. గురువారం ఆయన ప్రజాప్రతినిధులతో కలిసి పనులను పరిశీలించి మాట్లాడారు. అనంతరం 15వ వార్డులో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, టీడీపీ నాయకులు తోడేటి వెంకటయ్య పాల్గొన్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

ప్రతి పాఠశాలలో యాజమాన్య కమిటీల ఎన్నిక

సంగం, ఆగస్టు 8: మండలంలోని 48 ప్రాథమిక పాఠశాలల్లో 5ఏకగ్రీవంగా కాగా మిగిలిన వాటిలో ఎన్నికలు జరిగాయి. ఒక్క గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య చిన్న వివాదం నెలకొంది.

సీతారామపురం: 40 ప్రాథమిక పాఠశాలలు, 4ఉన్నత పాఠశాలు, కేజీబీవీ, ఏపీ మోడల్‌స్కూల్‌లో ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి తెలిపారు.

ఆత్మకూరు: మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం హర్షనీయమని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి ఉన్నారు.

చేజర్ల: 46 ప్రాథమిక , 6 ఉన్నత, ఒక గురుకుల పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 851మంది కమిటీ సభ్యులుగా, 59మంది చైర్మన్లుగా ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

అనంతసాగరం: మండలంలో పాఠశాలలో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. సోమశిల ఉన్నత పాఠశాలలో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొనడంతో పోలీసులు జోక్యంతో సమస్య సద్దుమణిగింది.

వరికుంటపాడు: 46ప్రాథమిక, 4ప్రాథమికోన్నత, 8ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 53పాఠశాలల్లో ఏకగ్రీవంగా చైర్మన్లను ఎన్నుకున్నారు. నార్త్‌కొండాయపాళెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మాత్రమే ఎన్నికలు నిర్వహించారు. తూర్పు బోయమడగల, జంగంరెడ్డిపల్లి, మహమ్మదాపురం పాఠశాలల్లో కోరం వాయిదా వేశారు.

ఉదయగిరి రూరల్: మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. 60 పాఠశాలల్లో 57 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయన్నారు. గండిపాళెం గురుకుల, మెయిన్, వెంగళరావునరగ్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయన్నారు. అనంతరం చైర్మన్లు, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి తొలి సమావేశాన్ని నిర్వహించారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు



నందిపాడు సెంటర్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 8: రాష్ట్రంలో వైసీపీ నాయకులపై దాడులు అధికమయ్యాయని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్సీ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు అన్నారు. నందిపాడు సెంటర్‌లో మండ్ల వెంకటేశ్వర్లకు చెందిన తొలగించిన ఇళ్లు, రేకులషెడ్లు, చెట్లను గురువారం పరిశీలించి బాధితులను పరామర్శించారు. వైసీపీ నాయకుడి ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమ న్నారు. కొత్తపేట తిరుపాలు నాయుడికి రూ.50వేల చెక్కును అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా కలిగిరి సీఐ వెంకటనారాయణ, దుత్తలూరు, ఉదయగిరి ఎస్ఐలు ఉమాశంకర్, ఇంద్రసేనారెడ్డిలు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు గణపం బాలకృష్ణారెడ్డి, మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఉన్నారు.

టీడీపీ నాయకులు కూల్చారని చెప్పడం అవాస్తవం

● నందిపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు ఉండేలా గురవారెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 8: నందిపాడు సెంటర్‌కు చెందిన మాజీ హోంగార్డు మండ్ల వెంకటేశ్వర్లుకు చెందిన ఇల్లు, చెట్లు, రేకుల షెడ్లు టీడీపీ నాయకులు కూల్చారని చెప్పడం అవాస్తమని నందిపాడు మాజీ సొసైటీ అధ్యక్షుడు ఉండేలా గురవారెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడా రు. వెంకటేశ్వర్లు ఓ వ్యక్తి వద్ద 90 సెంట్ల భూమిని కొనుగోలు చేసి అతనికి డబ్బులు చెల్లిం చకపోవడంతో వివాదం తలెత్తిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షలు స్వాహా చేశాడన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజవకర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగో పాల్‌రెడ్డి అండతో వెంకటేశ్వర్లు అనేక అక్రమాలు, అరాచకాలు పాల్పడ్డారని చెప్పారు. వాట న్నింటిపై సీఐడీ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మండవ మధు, శింగవరపు వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, కనసాని సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గురవారెడ్డి

జాతీయ జెండాతో కావలికి ప్రత్యేక గుర్తింపు: ఎమ్మెల్యే

కావలి, ఆగస్టు 8: పట్టణ ట్రంకు రోడ్డులో ఏర్పాటు చేయనున్న 100అడుగుల జాతీయ జెండా, మహనీయుల చిత్రపటాలతో కావలికి ప్రత్యేక గుర్తింపు రానుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందేలా కావలి ప్రజలకు ఆహ్లాదం అందించే సెల్ఫీ పాయింట్ లా నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 15న దీన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

టీబీ రహిత సమాజం కోసమే వ్యాక్సినేషన్

● రాష్ట్ర విభాగం ఏపీవో రవీంద్ర

కావలిటౌన్, ఆగస్టు 8: టీబీ రహిత సమాజం కోసమే బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రం అని టీబీ రాష్ట్ర విభాగం ఏపీవో రవీంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్, పుల్లారెడ్డినగర్, బొమ్మారెడ్డి వీధిలోని టీడీ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని టీబీ జిల్లా అధికారి, అడిషన్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలితో కలిసి ఆయన పర్యవేక్షించారు. దేశంలో టీబీని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వం ధ్యేయంగా పని చేస్తుందని అందులో భాగంగానే వ్యాక్సినేషన్ ప్రక్రియను పడక్బందీగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వమే ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి దీర్ఘకాలం మందులు, పౌష్టికాహారం, ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న టీబీ రాష్ట్ర విభాగం ఏపీవో రవీంద్ర

తహసీల్దార్లకు సన్మానం

సంగం, ఆగస్టు 8: మండల తహసీల్దారు సోమ్లానాయిక్‌ను గురువారం జనసేన నియోజకవర్గ పార్టీ ఉపాధ్యక్షులు భాను కిరణ్, చిరంజీవి, మండల యూత్ అధ్యక్షులు కృష్ణమోహన్‌కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఉదయగిరి రూరల్: తహసీల్దారు సుభద్రను టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్ కలిసి సన్మానించారు.

ఆత్మకూరు: టీడీపీ రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డిలు నూతన తహసీల్దారు సుధీర్‌ను కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు బాబునాయుడు, మద్దినేని నారాయణ, చంద్రా మల్లికార్జున నాయుడు, ఎన్.పెంచలనాయుడు, కొండ్రెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆత్మకూరు, ఆగస్టు 8: వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పుట్టా సత్యవాణి తెలిపారు. గురువారం కరటంపాడులో వరిపైరును పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి ఈ క్రాప్ నమోదు తెలుసకున్నారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతి

సీతారామపురం: తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సింగాల నాగేశ్వరావు, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, శ్రీకుర్తి రవీంద్రబాబుతో కలిసి గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. మండల తాగునీటి సమస్య, సిమెంట్ రోడ్లు, మురుగుకాలువల సమస్యలపై చర్చించారు. మండలానికి అన్న క్యాంటీన్ కావాలని, పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారిని గుర్తించాలని కోరినట్లు తెలిపారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



కావలి పట్టణ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సీఎంసీ సభ్యులు

కావలి టౌన్, రూరల్, ఆగస్టు 8: మండలంలోని 120 పాఠశాలలకు 106 ఏకగ్రీవం కాగా 14 పాఠశాలల కమిటీలకు ఎన్నికలు జరిగాయి. పట్టణ పరిధిలోని జెడ్పీ బాలుర, బాలికల, ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 8వ వార్డు, వెంగళరావునగర్, పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, విశ్వోదయ బాలుర, బాలికోన్నత ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, 3 అప్పర్ ప్రైమరీ, 12 ప్రైమరీ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఎన్నికలు ఏకగ్రీవమైనాయి.

జలదంకి : మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలకు గురువారం ఎంఈఓలు శ్రీధర్, నాగేశ్వరరావుల పర్యవేక్షణలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు జరిగాయి. ఒక్క రామవరప్పాడు మెయిన్ పాఠశాలలో 4, 5 తరగతులకు కోరం లేక ఎన్నిక జరగకపోవడంతో ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 58పాఠశాలల్లో చైర్మన్, సభ్యుల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఐ ఆదిలక్ష్మీ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కొండాపురం: మండలంలోని 66 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు జరగాల్సి ఉండగా గురువారం 65 పాఠశాలల్లో పూర్తయినట్లు మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్ తెలిపారు. నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల హాజరుశాతం తగ్గడంతో ఎన్నిక ఆగిపోయింది. ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులతో హెచ్‌ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు.

బిట్రగుంట, (దగదర్తి): బోగోలు మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలల్లో 54 పాఠశాలలు ఎన్నికలు ఏకగ్రీవం అవగా బోగోలు, బిట్రగుంట పాఠశాల్లో ఎన్నికలు జరిగాయి. ఎస్సీ పాలెం పంచాయతీలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల్లో ఏకగ్రీవానికి అంగీకరించక పోటీ నిర్వహించగా సరిసమానంగా రావడంతో ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలు తెలిపారు. అదేవిధంగా దగదర్తి మండలంలోని 57 పాఠశాలల్లో కమిటీ చైర్మన్ ఎంపికలు ఏకగ్రీవం అయినట్లు ఎంఈవో భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల కమిటీ ఎన్నికలో ఏకగ్రీవమైన చైర్మన్ వైస్‌చైర్మన్ సభ్యులను గురువారం టీడీపీ మండల యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో మాలేపాటి సుధాకర్ నాయుడు, కంచర్ల కృష్ణ, వెంకటేశ్వర్లు, వట్టిగుంట గోపాల్, వడ్డే వినయ్‌కుమార్, ముపాళ్ళ సురేష్ ఉన్నారు.

లింగసముద్రం: మండలంలో గురువారం అన్ని పాఠశాలల్లో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను టీడీపీ మద్దతుదారులు కైవశం చేసుకున్నారు. అయితే మొగిలిచెర్ల గ్రామంలోని మెయిన్ పాఠశాలలో కోరం లేక ఎన్నిక నిలిచిపోయింది. ఈ ఎన్నికలను టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ ముప్పరాజు వెంకటేశ్వర్లు, ఎ రంగయ్య, గాలంకి ప్రసాద్, చిన కొండయ్య పర్యవేక్షించారు.

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లె, బంగారక్కపాలెం, చెర్లోపాలెం గ్రామాలలోని పాఠశాలలు మినహ మిగిలిన 48 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో కోరంలేక ఎన్నిక నిలిచిపోయింది. బంగారక్కపాలెంలో కోదండరామస్వామి ఉత్సవాలు సందర్భంగా ఎస్ఎంసీ ఎన్నికలకు గ్రామస్తులు రాకపోవడంతో ఎస్ఎంసీ ఎన్నిక నిలిచిపోయింది. చెర్లోపాలెం ఎంపీపీ స్కూల్‌లో చైర్మన్, వైస్‌చైర్మన్ ప్రమాణ స్వీకారం చేయని సందర్భంగా ఎన్నిక నిలిచిపోయినట్లు ఎంఈఓ రవికుమార్ తెలిపారు.

కందుకూరు: ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాకమిటీల చైర్మన్‌ల ఎంపిక జరిగింది. కందుకూరు పట్టణ 28వ వార్డు అమలనాధుని పాలెం మండల పరిషత్ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా పాశం శ్రీను, వైస్ చైర్మన్‌గా సిరిగిరి దుర్గమ్మ, కమిటి సభ్యులను ఎన్నుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిణి తెలిపారు. అదేవిధంగా మహదేవపురం ఆదిఆంధ్ర కాలనీ ఎంపీ యూపి జనరల్ స్కూల్ చైర్మన్‌గా చదలవాడ దావీదు, వైస్ చైర్మన్‌గా పొట్లూరి భవానిలను ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు.



మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో ఎన్నికైన ఎస్ఎంసీ నూతన కార్యవర్గం



జలదంకి: తిమ్మసముద్రం ఎస్ఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు



కొండాపురం : సాయిపేటలో సభ్యుల ప్రమాణ స్వీకారం

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ నియామకం

కందుకూరు, ఆగస్టు 8 : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ నియామకం చేపట్టినట్లు ఆసుపత్రి సూరింటెండెంట్ జీ హరీష్ తెలిపారు. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ప్రథమ ప్రాధాన్యత సభ్యులుగా నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కమిటి సభ్యులుగా చాగొల్లు గ్రామానికి చెందిన వర్ధినేని శ్రీనివాసులు, ఉలవపాడుకు చెందిన దంతవైద్యులు డాక్టర్ బీవీ పవన్, సన్నెబోయి ప్రభావతితోపాటు ఎంపీడీవో ఎస్ విజయ, పంచాయతీ కార్యదర్శి బీ విజ యమ్మ, సీహెచ్‌సీ మెడికల్ ఆపీసర్ జీ హరీష్‌లో కమిటీ ఏర్పడినట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా మెడికల్ ఆఫీసర్ హరిష్, కమిటీ సభ్యులు పవన్, శ్రీనివాసులు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రోగులకు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్వరమే వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని ఈసందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు.



ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బీవీ పవన్, శ్రీనివాసులు

అనుమతికి మించి పొగాకు సాగు శ్రేయస్కరం కాదు

● బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు

కందుకూరు, ఆగస్టు 8: పొగాకు బోర్డు అనుమతికి మించి పంట పండించడం, అనధికార బ్యారన్‌ల నిర్మాణాలు పొగాకు రైతులకు శ్రేయస్కరం కాదని బోర్డు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ఆయన కందుకూరు వేలం కేంద్రాన్ని సందర్శించి వేలం తీరును పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మించిన పరిపాలన భవనాన్ని, ఆధునీకరించిన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరను దృష్టిలో పెట్టుకొని అధిక ధరలకు పొలాలు, బ్యారన్‌లు కౌలుకు తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సెక్రటరి శ్రీదివి వేణుగోపాల్, రీజనల్ మేనేజర్ శ్రీలక్ష్మణరావు, రామాంజనేయులు, వేలం నిర్వహణాధికారి కే రాజగోపాల్‌రెడ్డి, రైతు నాయకులు, రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

భారీ మంచినీటి పథకాల నిర్వహణ టీడీపీ నేతలకు అప్పగింత

లింగసముద్రం, ఆగస్టు 8 : రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే భారీ మంచినీటి పథకాల నిర్వహణను కందుకూరు గ్రామీణ నీటి పథకం డీఈ రామ్మోహన్‌రావు, ఏఈ సీహెచ్ రాజశేఖర్‌లు టీడీపీ నేతలకు అప్పగించారు. లింగసముద్రం, వలేటివారి మండలాల్లోని గ్రామాలకు మంచినీటిని అందించే రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాన్ని లింగసముద్రంలోని టీడీపీ నేతలు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, అర్థాకుల సత్యంలకు, అలాగే లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని గ్రామాలకు మంచినీటిని అందించే గుడ్లూరు మంచినీటిని పథకాన్ని గుడ్లూరు టీడీపీ నేత జె నాగరాజుకు అప్పగించారు. అయితే లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని గ్రామాలకు నీరందించే చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం నిర్వహణను ఇంకా టీడీపీ నేతలకు అప్పగించలేదని సమాచారం. త్వరలో ఈ పథకాల నిర్వహణకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలి: డీఎఫ్‌వో

ఉలవపాడు, ఆగస్టు 8 : మండలంలోని చాకిచర్ల, పెదపట్టపుపాలెం అటవీ భూముల్లో అక్రమంగా ఇసుక రవాణా జరగుతుందని గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తపై జిల్లా అటవీశాఖ అధికారి ఏ చంద్రశేఖర్ స్పందించారు. సంఘటనా ప్రాంతాలను సందర్శించి సమగ్ర విచారణ చేపట్టి అక్రమ ఇసుక రవాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వో కావలి రేంజ్ అధికారి ఉమామహేశ్వర రెడ్డికి ఆదేశాలు జారిచేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ భూముల్లో ఇసుక తలిస్తు పట్టుబడిన ట్రాక్టర్, టైరుబండ్లులపై కేసులు నమోదుచేసి ప్రభుత్వ పరం చేస్తామని, దీనికోసం చర్యలు, నిఘా చేపడతామని కావలి రేంజ్ అధికారి ఉమామహేశ్వర రెడ్డి వివరణ ఇచ్చారు.

అర్హులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలి

కావలి, ఆగస్టు 8: స్థానిక పురపాలక సంఘంలో 2016నుంచి దినసరి కూలీలుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016 నుంచి 52 మంది దినసరి పారిశుధ్య కార్మికులుగా మున్సిపాలిటీలో పని చేస్తుంటే వారిని అనర్హులను సిఫార్సుల మేరకు చేర్చుకోవటం తగదన్నారు. ఆప్కాస్‌లో చేర్చుకునేందుకు కొందరి మధ్యవర్తులతో నగదు అధికారుల వద్దకు చేరినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. 2024 మార్చిలో అర్హతలేని 27 మందిని ఆప్కాస్‌లో కనబర్చినట్లు తెలిపారు. వారిలో ఇద్దరు మినహా మిగతా వారంతా బయటవారేనన్నారు. దినసరి పారి శుధ్య కార్మికులుగా పనిచేస్తున్న 52మందిని ఆప్కాస్‌లో చేర్చుకోవాలని గతంలో కౌన్సిల్ తీర్మానం చేసినా దానిని అమలు చేయకుండా డబ్బులు ఇచ్చిన వారికే అవకాశాలు కల్పించటం బాధాకరం అన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా ఒక నెల జీతాలు, 2024 జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి హెల్త్ అలవెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య, జిల్లా కార్యదర్శి గుంజి క్రిషోర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, సహాయ కార్యదర్శి ప్రభావతి, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి ఎండ్లూరి రవి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

అల్లూరు, ఆగస్టు 8 : అల్లూరు సచివాలయం-4లో గురువారం నిర్వహించిన ఆధార్ కేంద్రాన్ని కావలి ఆర్డీవో శీనానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధార్ కార్డుల్లో ఉండే పొరపాట్లను సవరించుకోవడం, నూతన ఆధార్ కార్డులు నమోదు చేసుకునేందుకే ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ, కమిషనర్ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శీలం అమరనాథ్‌కు డాక్టరేట్

కందుకూరు, ఆగస్టు 8: కందుకూరు పట్టణంలోని బృందావనంకు చెందిన శీలం అమరనాథ్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బోధనా శైలిపై ఆయన చేసిన పరిశోధనా గ్రంథానికి గాను ఆయనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఈ పరిశోధనలో ఆయనకు మార్గదర్శనం చేసిన డాక్టరు హసన్‌కు అమరానాథ్ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించిన అమరనాథ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.



శీలం అమరనాథ్

నేడు గుడ్లూరు మండల సమావేశం

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడివో వై వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల వివరాలతో సకాలంలో హా జరుకావాలని ఎంపిడివో కోరారు.

రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : యూటీఎఫ్

గుడ్లూరు, ఆగస్టు 8: ఉపాధ్యాయ యూనియన్ ఏపీ యూటీఎఫ్ సంఘం ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం ఎంఈవో కార్యాలయం ప్రాంగణంలో గుడ్లూరు యూటిఎఫ్ మండల శాఖ, కావలి రొటరీ క్లబ్ బృందం కలిసి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మక్కెన రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు శిక్షణ

వలేటివారిపాలెం, ఆగస్టు 8 : మండలంలోని పోకూరు రైతు సేవా కేంద్రంలో కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం ఏఓ హేమంత్ భరత్ కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, వివేక్, మయాక్, కందుకూరు సాంకేతిక వ్యవసాయ అదికారి దురా మరియు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీ దుకాణాన్ని తగులబెట్టిన దుండగులు

కందుకూరు: స్థానిక అంకమ్మ తల్లి దేవాలయం ఎదురుగా ఉన్న మునగాల కృష్ణారెడ్డికి చెందిన టీస్టాల్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తగులపెట్టారు. ఈ సంఘటనలో టీ దుకాణంలోని విలువైన సామాగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి.గురువారం డీఎస్పీ ఏ శ్రీనివాస్, సీఐ నఫీస్ బాషా స్థలంకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

కందుకూరు, ఆగస్టు 8 : పట్టణంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు కట్టా వెంకటేశ్వర్లు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(డీపీఈ), డీఈ ఏ వీరయ్యల ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. 32 బ్యాచ్‌లుగా ఏర్పడిన విద్యుత్ శాఖ సిబ్బంది టౌన్‌లోని 2841 సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. 225 సర్వీసుల వినియోగదారులు అదనపు లోడు వాడుకున్నవారికి రూ. 9 లక్షలు, ఒక కేటగిరి తీసుకొని వేరొక కేటగిరి కింద వాడుకుంటున్న 4 సర్వీసుల వినియోగదారులకు రూ.25 వేలు అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో కందుకూరు డివిజన్‌లోని ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

శాంతి భద్రతలను పరిరక్షిస్తాం

కలిగిరి, ఆగస్టు 8: శాంతి భద్రతల పరిరక్షణలకు తగు చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇనస్పెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో కలిగిరి, వింజమూరు, కొండాపురం మండలాల పరిధిలో అక్రమ మద్యం, పేకాట, కోడిపందేలు వంటి అక్రమ చర్యలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.